ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి
5
ప్రకాశం
జిల్లా వార్తలు
శనివారం 1, మార్చి 2025

శంభో.. శివశంభో..

మహాశివరాత్రి ఉత్సవాల్లో భాగంగా త్రిపురాంతకంలోని త్రిపురాంతకేశ్వరుడు, కొత్తపట్నం మండలం మడనూరులోని రామలింగేశ్వరస్వామి రథోత్సవాలు శుక్రవారం రమణీయంగా సాగాయి. రెండు చోట్లా భారీ సంఖ్యలో భక్తులు హాజరయ్యారు. రథాన్ని లాగేందుకు పోటీపడ్డారు. ఆయా ప్రాంతాలు శివనామస్మరణతో మార్మోగాయి.

లోపలి పేజీల్లో..


త్రిపురాంతకంలో రథోత్సవానికి హాజరైన అశేష భక్తజనం (ఇన్‌సెట్‌లో) విద్యుత్ దీపాలతో వెలిగిపోతున్న మడనూరులోని రామలింగేశ్వర ఆలయం

చిట్టి బుర్రల్లో.. గట్టి ఆలోచనలు

- స్ఫూర్తిమంతంగా సైన్స్ ప్రాజెక్టుల రూపకల్పన
- ఘనంగా జాతీయ సైన్స్ దినోత్సవం

7


హృదయ స్పందన స్థాయిని ముగ్గుతో ఆవిష్కరిస్తున్న విద్యార్థినులు లక్ష్మి, మౌనిక, జిత్యశ్రీ, నాగజ్యోతి

ఊరట అంతంతే!




ప్రాజెక్టు : వెలిగొండ
2024-25 కేటాయింపు : రూ. 393.49 కోట్లు
2025-26 కేటాయింపు : రూ. 309.13 కోట్లు



- సంక్షేమానికి పెద్దపీట
- రైతులు, పేదలకు సూపర్ సిక్స్ పథకాలతో భారీ లబ్ధి
- వెలిగొండకు ఆశించిన స్థాయిలో లేని కేటాయింపులు
- జలజీవన్, సూక్ష్మ సేద్యంకు ప్రాధాన్యం
- దొనకొండ కారిడార్‌పై నమ్మకం
- కేశవ్ బడ్జెట్‌పై జిల్లావాసుల్లో మిశ్రమ స్పందన
- పెదవి విరుస్తున్న ప్రతిపక్షాలు, ప్రజాసంఘాలు

రాష్ట్ర వార్షిక బడ్జెట్‌లో సంక్షేమానికి పెద్దపీట వేశారు. సూపర్ సిక్స్ పథకాలకు అగ్రతాంబూలం ఇచ్చారు. వాటి పరిధిలోకి వచ్చే అన్నింటికీ ఎక్కువ నిధులు కేటాయించారు. ప్రధానంగా రైతులు, మహిళలు, పేద వర్గాల ప్రయోజనమే లక్ష్యంగా కూటమి సర్కారు ముందుకెళ్తోంది. అయితే జిల్లాలో అత్యంత ప్రధానమైన వెలిగొండ ప్రాజెక్టుకు మాత్రం ఈ బడ్జెట్‌లో ఆశించిన స్థాయిలో ప్రాధాన్యం లభించలేదు. గత ఆర్థిక సంవత్సరం కన్నా ఈసారి నిధుల కేటాయింపు తగ్గింది. ఇతర ప్రాజెక్టులకీ పెద్దగా కేటాయింపులు కనిపించలేదు. రాష్ట్రంలో నాలుగు అభివృద్ధి కారిడార్లను గుర్తించగా అందులో దొనకొండ ఉంది. దీంతో పారిశ్రామిక అభివృద్ధి, ఉపాధి అవకాశాల పెంపుపై ఆశలు రేకెత్తుతున్నాయి. తాజా బడ్జెట్‌పై జిల్లావాసుల నుంచి మిశ్రమ స్పందన వ్యక్తమవుతోంది. టీడీపీ కూటమి నాయకులు బ్రహ్మాండం అంటుండగా.. ప్రతిపక్షాలు, ప్రజాసంఘాలు పెదవి విరుస్తున్నాయి.

ఒంగోలు, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి) : సంక్షేమానికి అధిక ప్రాధాన్యం ఇస్తూ శుక్రవారం అసెంబ్లీలో ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ ప్రవేశపెట్టిన రాష్ట్ర (2025-26) వార్షిక బడ్జెట్‌లో రాష్ట్రవ్యాప్తంగా అమలయ్యే సంక్షేమ, అభివృద్ధి అంశాలతో జిల్లాకు భారీగానే లబ్ధి చేకూరనుంది. ప్రత్యేకించి సూపర్ సిక్స్ హామీల అమలు ద్వారా రైతులు, మహిళలు, ఇతర పేదవర్గాల్లోని లక్షలాది కుటుంబాలకు సంక్షేమ ఫలాలు అందనున్నాయి. అయితే జిల్లా ప్రజలు ప్రత్యేకించి పశ్చిమ ప్రాంతవాసుల చిరకాల వాంఛ అయిన వెలిగొండ ప్రాజెక్టుకు మాత్రం ఆశించిన స్థాయిలో కేటాయింపులు లభించలేదు. మొత్తం సుమారు రూ.3.22 లక్షల కోట్లకుపైగా భారీ బడ్జెట్‌ను ప్రవేశపెట్టారు. అందులో ఇప్పటికే ఉన్న పింఛన్‌లు, దీపం, రేషన్ సరుకులు, గృహ నిర్మాణం, ఎన్టీఆర్ వైద్యసేవలు వంటి సంక్షేమ పథకాలను కొనసాగించనున్నట్లు

మిగతా 6వ పేజీలో


పోతురాజు కాలువ అభివృద్ధికి :
2024-25 కేటాయింపు : 3.00 కోట్లు
2025-26 కేటాయింపు : నిల్


ప్రాజెక్టు : గుండ్లకమ్మ
2024-25 కేటాయింపు : రూ.13.00 కోట్లు
2025-26 కేటాయింపు : రూ.15.50 కోట్లు


ప్రాజెక్టు : కొరిశపాడు ఎత్తిపోతల
2024-25 కేటాయింపు : రూ. 1.50 కోట్లు
2025-26 కేటాయింపు : రూ.8.65కోట్లు


ప్రాజెక్టు : పాలేరు రిజర్వాయర్
2024-25 కేటాయింపు : రూ. కోటి
2025-26 కేటాయింపు : రూ.10లక్షలు

వాహనదారులకు వాత

- పెరిగిన జరిమానాల భారం
- రహదారి నిబంధనలు పాటించకపోతే జేబుకు చిల్లు
- నేటి నుంచి మోటారు వెహికల్ చట్టం సవరణ అమలు

ఒంగోలు క్రైం, ఫిబ్రవరి28 (ఆంధ్రజ్యోతి): రహదారి భద్రత నిబంధనలు పాటించకపోతే జేబుకు చిల్లు పడనుంది. కేంద్ర ప్రభుత్వం సవరించిన మోటారు వెహికల్ చట్టం శనివారం నుంచి రాష్ట్రంలో అమలు కానుంది. ఇకపై ప్రతి ఒక్కరూ హెల్మెట్ ధరించి వాహనాన్ని నడపాలి. వెనుక కూర్చున వారు సైతం హెల్మెట్ తప్పనిసరిగా వినియోగించాలి. రోడ్డు ప్రమాదాలు అధికమవుతున్న నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం మోటార్ వెహికల్ చట్టంలో అనేక మార్పులు చేసింది. అందులో భాగంగా జరిమానాలను భారీగా పెంచింది. వాహనాలను నడిపేవారు నిబంధనలు పాటించకపోతే పెద్దమొత్తంలో చలానాల భారం పడనుంది. డ్రైవింగ్ లైసెన్స్‌తోపాటు వాహనానికి సంబంధించిన అన్ని డాక్యుమెంట్లు దగ్గర ఉంచుకొని తనిఖీలలో సహకరించాలని ఎస్పీ దామోదర్ కోరుతున్నారు. ఉదాహరణకు గతంలో హెల్మెట్ లేకుండా వాహనచోదన చేస్తే రూ.135 జరిమానా కాగా ప్రస్తుతం

మిగతా 6వ పేజీలో




పీజీ పట్టా అందుకున్న ఆనందంలో విద్యార్థులు (ఇన్‌సెట్‌లో) నాట్యం చేస్తున్న విద్యార్థిని

కల సాకారం..

- పట్టా అందుకున్న మెడికల్ పీజీ విద్యార్థులు
- ఘనంగా మెడికల్ గ్రాడ్యుయేషన్

సుదీర్ఘకాలం పుస్తకాలతో కుస్తీపట్టిన ఒంగోలులోని రిమ్స్ విద్యార్థుల స్వప్నం ఎట్టకేలకు నెరవేరింది. డాక్టర్ పట్టా అందుకున్నారు. స్థానిక జీజీహెచ్‌లోని ఆడిటోరియంలో 2019 మెడికల్ పీజీ విద్యార్థుల గ్రాడ్యుయేషన్ కార్యక్రమం శుక్రవారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా విద్యార్థులు ఆనందంతో కేరింతలు కొట్టారు. వారి తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు హాజరై తమ పిల్లలను ఆప్యాయంగా ముద్దాడారు. ఈ సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

7

కనిగిరి ప్రాంతానికి అధ్యయన కమిటీ

- తక్షణ, శాశ్వత రక్షిత నీటి కల్పనే లక్ష్యం
- ఫ్లోరోసిస్ నివారణ చర్యల్లో భాగం
- ఎమ్మెల్యే ఉగ్ర వినతిపై వేగంగా స్పందించిన డిప్యూటీ సీఎం పవన్

6లో



నేటి నుంచి ఇంటర్ పరీక్షలు

- నిమిషం లేటైనా నో ఎంట్రీ
- సీసీ కెమెరాలతో నిఘా
- సెల్‌ఫోన్లు నిషేధం

ఒంగోలు విద్య, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో ఇంటర్మీడియెట్ పబ్లిక్ పరీక్షలు శనివారం నుంచి ప్రారంభంకానున్నాయి. తొలిరోజు మొదటి సంవత్సరం విద్యార్థులకు పరీక్ష జరగనుంది. ద్వితీయ సంవత్సరం వారికి సోమవారం నుంచి ప్రారంభం కానున్నాయి. పరీక్షలను పకడ్బందీగా నిర్వహించేందుకు అధికారులు అన్ని ఏర్పాట్లను పూర్తి చేశారు. మొత్తం 42,439 మంది విద్యార్థులు హాజరు కానుండగా వీరిలో 21,624 మంది ప్రథమ, 20,815 మంది ద్వితీయ సంవత్సరం వారు ఉన్నారు. అందుకోసం 67 కేంద్రాలను ఏర్పాటు చేశారు. కేంద్రాల్లోని అన్ని గదులకు సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. ఈ కెమెరాలను విజయవాడలోని ఇంటర్మీడియెట్ బోర్డు, ఒంగోలులోని ఆర్ఐవో కార్యాలయానికి

మిగతా 6వ పేజీలో



నేటి నుంచి రేషన్

- మూడు నెలలుగా నిలిచిన కందిపప్పు

ఒంగోలు కలెక్టరేట్, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో శుక్రవారం నుంచి రేషన్ పంపిణీ జరగనుంది. అందుకోసం పౌరసరఫరాల శాఖ అధికారులు ఏర్పాట్లు చేశారు. జిల్లాలో 1,392 చౌకధరల దుకాణాలు ఉండగా మొబైల్ వాహనాల ద్వారా సరుకుల పంపిణీకి చర్యలు తీసుకున్నారు. జిల్లాలో ఉన్న 6.70 లక్షల కార్డుదారులకు అవసరమైన మేరకు బియ్యం, పంచదారను రేషన్ షాపులకు సరఫరా చేశారు. మూడు నెలల నుంచి జిల్లాకు

మిగతా 6వ పేజీలో

హరహరమహాదేవ శంభో...



రథోత్సవంలో ఎమ్మెల్యే జనార్దన్ దంపతులు

వైభవంగా శ్రీరామలింగేశ్వరస్వామి రథోత్సవం

కొత్తపట్నం, ఫిబ్రవరి 28(ఆంధ్రజ్యోతి) : మండలంలో జంట గ్రామాలైన మడనూరు-ఈతముక్కలలో వేంచేసి ఉన్న శ్రీరామ లింగేశ్వరస్వామికి శివరాత్రి మహోత్సవాల సందర్భంగా శుక్ర వారం సాయంత్రం రథోత్సవం వైభవంగా జరిగింది. ఆలయ అర్చకుల మంత్రోచ్ఛారణల మధ్య రథోత్సవం మడనూరులోని ఆలయ ప్రాంగణం నుంచి ప్రారంభమైంది. ఈ కార్యక్రమానికి శాసనసభ్యులు దామచర్ల జనార్దన్, అతని కుటుంబ సభ్యులు, ఎంఆర్వో పిన్నిక మధుసూదనరావులు హాజరయ్యారు. రథోత్స వాన్ని తిలకించేందుకు మండలంలోని పలు గ్రామాలతోపాటు జిల్లాలోని ఇతరప్రాంతాల నుంచి కూడా భక్తులు వేల సంఖ్యలో తరలివచ్చారు. భక్తులు ముక్తకంఠంతో శివనామస్మరణ చేస్తూ రథాన్ని ముందుకు లాగారు. హరహర మహాదేవశంభోశంకర అంటూ భక్తులు నామస్మరణ చేశారు. గ్రామ ప్రధాన మార్గాల ద్వారా రథోత్సవం కొనసాగింది. శుక్రవారం రాత్రి పొద్దుపోయిన తర్వాత రథోత్సవాన్ని ఈతముక్కల గ్రామానికి చేర్చారు. శని వారం ఈతముక్కల గ్రామం నుంచి రథోత్సవం ప్రారంభమై మడనూరులోని శ్రీరామలింగేశ్వరస్వామి ఆలయానికి చేరుకో నుంది. ఈ సందర్భంగా భక్తులు అడుగడుగునా పూజలు చేస్తూ శివనామస్మరణ చేస్తూ ముందుకు సాగారు.

కనిగిరి ప్రాంతం అధ్యయనానికి కమిటీ

తక్షణ, శాశ్వత రక్షిత నీటి కల్పనే లక్ష్యం

ఫ్లోరోసిస్ నివారణ చర్యల్లో భాగం

ఎమ్మెల్యే ఉగ్ర వినతిపై వేగంగా స్పందించిన పవన్

(ఆంధ్రజ్యోతి, ఒంగోలు)

కనిగిరి నియోజకవర్గంలో ఫ్లోరోసిస్ సమస్య నివారణ చర్యల్లో భాగంగా రక్షిత మంచినీటి కల్పనపై అధ్యయ నం చేయాలని డిప్యూటీ సీఎం, గ్రామీణ, పంచాయతీ రాజ్ శాఖల మంత్రి పవన్‌కళ్యాణ్ ఆదేశించారు. కనిగిరి ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి వినతిపై ఆయన వేగంగా స్పందించారు. తదనుగుణంగా సంబంధిత శా ఖల ఉన్నతాధికారులు శుక్రవారం సాయంత్రమే ఎమ్మె ల్యే డాక్టర్ ఉగ్రతో మాట్లాడటం విశేషం. శుక్రవారం ఉద యం అసెంబ్లీలో పవన్‌కళ్యాణ్‌ను కలిసి డాక్టర్ ఉగ్ర సమస్యలను వివరించారు. కనిగిరి ప్రాంతంలో ఫ్లోరోసిస్ సమస్య తీవ్రంగా ఉన్న విషయం తెలిసిందే. రక్షిత మం చినీటి సౌకర్యం కోసం రామతీర్థం నుంచి పైపులైన్ ద్వారా సాగర్ నీరు అందించే కార్యక్రమానికి గతంలో శ్రీకారం పలికారు. కనిగిరి మున్సిపాలిటీ మినహా 458 నివాసిత ప్రాంతాలకు రామతీర్థం నుంచి తాగునీరు అందించాలని నిర్దేశించారు. అందులో 245 నివాసిత ప్రాంతాలకు పైపులైన్లు వేసి నీరందించే కార్యక్రమాన్ని గతంలో ప్రారంభించారు. అయితే పైపులైన్లు దెబ్బతిని పోయి ఇటీవల సక్రమంగా సాగర్ జలాలు గ్రామాలకు అందటం లేదు. దీంతో ఆయా గ్రామాల వారు భూగర్భ జలాలే తాగునీరుగా వాడుతూ మరింతగా ఫ్లోరోసిస్ బారినపడుతున్నారు. ఈ సమస్యను సమగ్ర వివరాలతో పవన్‌కళ్యాణ్‌కు డాక్టర్ ఉగ్ర ఒక నివేదిక పంపారు. దానిపై వెంటనే పరిశీలించాలని ఆయన అధికారులను ఆదేశించారు. శుక్రవారం అసెంబ్లీ ఆవరణలో పవన్‌కళ్యా ణ్‌ను డాక్టర్ ఉగ్ర కలిసి గతంలో పంపిన నివేదికలోని అంశాలను నేరుగా వివరించారు. వెంటనే పవన్‌కళ్యాణ్ ఫ్లోరోసిస్ సమస్య నివారణ లక్ష్యంగా ప్రత్యేక అధికారుల బృందాన్ని పంపి అధ్యయనం చేయాలని ఉన్నతాధికారు లకు ఆదేశాలు ఇచ్చారు. తక్షణం రామతీర్థం జలాశయం నీటిని సమృద్ధిగా సరఫరా చేసే అంశంతోపాటు శాశ్వత పరిష్కారంపై అధ్యయనం చేయాలని అధికారులను ఆదేశించారు. వెంటనే రంగంలోకి దిగిన అధికారులు కిందిస్థాయి అధికారుల నుంచి కొంత సమాచారం తెప్పించుకున్నారు. శుక్రవారం రాత్రికే డాక్టర్ ఉగ్రతో పంచాయతీరాజ్, డిప్యూటీ సీఎం పేషీకి చెందిన ఉన్నతా ధికారులు కృష్ణతేజ, గాయత్రి, మధు తదితరులు మాట్లా డారు. జలజీవన్ పథకం కింద తక్షణ సమస్యల పరి ష్కారానికి పరిశీలన చేస్తున్నట్లు తెలిసింది.



గార్లపేట ఎస్సీకాలనీకి రూ.73లక్షలతో నిర్మించిన సిమెంట్ రోడ్డు

దీర్ఘకాల నిరీక్షణ ఫలించిన వేళ

గార్లపేట దళితుల ఆనందహేల

ఎస్సీ కాలనీకి సిమెంటు రోడ్డు నిర్మాణం

ఎన్నికల హామీని నెరవేర్చిన మంత్రి స్వామి

నేడు ప్రారంభం

మర్రిపూడి, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి) : గ్రామానికి దూరంగా విసిరేసినట్లు ఉండే గార్లపేటలోని దళిత కాలనీ అది. అక్కడికి వెళ్లే రహదారికి ఇరువైపులా దట్టంగా చిల్లచెట్లు పెరిగి చిట్టడవిని తలపించేది. వీధి దీపాలు కూడా లేకపోవడంతో రాత్రివేళ కాలనీకి భయం భయంగా వెళ్లాల్సి వచ్చేది. గత శాసనసభ ఎన్నికల సమయంలో కాలనీకి పక్కా రహదారిని ఏర్పాటు చేయి స్తానని అప్పటి శాసనసభ్యుడు, ప్రస్తుత రాష్ట్ర మంత్రి డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి హామీ ఇచ్చారు. దీంతో కాలనీవాసులు ఆయనకు సంపూర్ణ మద్దతు పలికారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీని మంత్రి స్వామి నిలబెట్టుకున్నారు. గార్లపేటలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నుంచి ఎస్సీ కాలనీ వరకు 600 మీటర్ల దూరం సీసీరోడ్డు నిర్మాణానికి పల్లె పండుగ కార్యక్రమంలో భాగంగా రూ.73లక్షలు మంజూరు చేయించారు. ఆ నిధులతో 3.75మీటర్ల వెడల్పుతో సీసీ రోడ్డును నిర్మించారు. రోడ్డుకు ఇరువైపులా మరో 1.75మీటర్ల చొప్పున వెడల్పుతో మార్జిన్‌లను ఏర్పాటు చేశారు. దీనికితోడు 20 విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేయించి ఎల్ఈడీ వీధి లైట్లను అమ ర్చారు. దీంతో ఎస్సీ కాలనీవాసుల ఆనందానికి అవ ధుల్లేకుండాపోయింది. శనివారం ఎన్టీఆర్ భరోసా పింఛన్‌లు పంపిణీ చేసేందుకు గ్రామానికి వస్తున్న మంత్రి స్వామి రహదారిని ప్రారంభించనున్నారు. ఎన్నో ఏళ్ల కలను సాకారం చేసిన మంత్రి స్వామికి కాలనీవాసులు కృతజ్ఞతలు తెలుపుతున్నారు. ఆయ నకు ఘన స్వాగతం పలికేందుకు సిద్ధమయ్యారు.



కొత్తగా విద్యుత్ స్తంభాలు వేసి వీధి దీపాలు కూడా బిగింపు

పెళ్లి పేరుతో గర్భవతిని చేశాడు..!

- పరారీలో ప్రేమికుడు
- పోలీసులను ఆశ్రయించిన బాధితురాలు

ఒంగోలు క్రైం, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి) : బంధువుల ద్వారా పరిచయం అయ్యాడు. ఆ పరి చయం చాటింగ్ వరకూ వెళ్లింది. నువ్వు అంటే ఇష్టమని, పెళ్లి చేసు కుంటానని చాట్ చేశాడు. స్నేహితు రాలి పుట్టినరోజుకు ఆహ్వానించి శారీరక వాంఛ తీర్చుకున్నాడు. దీంతో ఆ 18 ఏళ్ల యువతి మూడు నెలల గర్భవతి అయింది. అనం తరం ప్రేమించిన వాడు ఏకంగా ముఖం చాటేశాడు. ఫోన్ నంబరు బ్లాక్‌లిస్టులో పెట్టి తన నివాసం ఖాళీ చేసి వెళ్లిపోయాడు. పోలీసుల కథనం మేరకు.. ఒంగోలు నగరం బండ్లమిట్టలో నివాసం ఉంటున్న ఓ యువతి ఇంటర్మీడియట్ వరకు చదువుకుంది. ఒక సబ్జెక్ట్ ఫెయిల్ కావడంతో ఇంటివద్ద ఉండి పరీక్ష లకు సిద్ధమవుతోంది. ఈక్రమంలో తన బంధువుల ద్వారా ఆరీఫ్ అనే యువకుడు పరిచయం అయ్యాడు. తొలి పరిచయంలోనే నువ్వు అంటే నాకు ఇష్టం అంటూ ఆ యువతిని మాయ చేశాడు. తరువాత కొద్ది రోజులు తాను ప్రేమిస్తున్నానంటూ సోషల్ మీడియా ద్వారా చెప్పాడు. తన చదువు అయిపోయిన తరు వాత పెద్దలను అడిగి తన ఆలోచన చెబుతానని ఆ యువతి బదులి చ్చింది. అయితే గత ఏడాది డిసెం బరులో ఆ యువతి స్నేహితురాలు, ఆరీఫ్‌కు బంధువైన మరో యువతి పుట్టినరోజు పేరుతో బాధితురాలిని పేర్నమిట్టకు తీసుకెళ్లారు. అక్కడ కేక్ కటింగ్ చేసి భోజనం చేసేం దుకు ముగ్గురు కలిసి ఓ ఇంటికి వెళ్లారు. ఆ సమయంలో భోజనం తీసుకొస్తానని పుట్టినరోజు చేసుకుం టున్న యువతి బయటకు వెళ్లింది. అదే అదునుగా ఆరీఫ్ ఆ యువ తిపై లైంగిక దాడి చేశాడు. అయితే ఆరీఫ్‌కు అప్పటికే వివాహం అయిం దని, భార్యను వదిలేశాడని కూడా తెలిసిందని బాధితురాలు వాపో యింది. ఈ మేరకు యువతి శుక్ర వారం స్థానిక రిమ్స్‌లో వైద్య పరీ క్షలు చేసుకున్న తరువాత మూడు నెలల గర్భవతి అయినట్లు తేలింది. ఆరీఫ్ మాత్రం తాను నివాసం ఉండే ఇల్లు ఖాళీ చేసి యువతి ఫోన్ నంబరు బ్లాక్ చేశాడు. ఒంగోలు తాలుకా పోలీసులు విచా రణ చేస్తున్నారు.

ఊరట అంతంతే..!

(5వ పేజీ తరువాయి)

ప్రకటించారు. ఎన్నికల హామీలలో భాగంగా ప్రతి రైతుకు రూ.20వేల వంతున అన్నదాత సుఖీభవ, చదువు కునే ప్రతి విద్యార్థికి ఏడాదికి రూ.15వేల ప్రకారం తల్లికి వందనం పేరుతో తల్లుల ఖాతాలకు నగదు జమ, మత్స్యకారులకు చేపల వేట నిషేధ సమయంలో ఇచ్చే రూ.10వేల భృతి రూ20వేలకు పెంపు, ఎస్సీఎ స్టీలు, చేనేతపై ఆధారపడిన కుటుం బాలకు 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, బీసీలకు వివిధ స్వయం ఉపాధి పథకాల ద్వారా జిల్లాలోని ఆయా వర్గాల ప్రజలకు భారీగా లబ్ధి అందనుంది. ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహించడంతోపాటు విస్తారంగా మైక్రో ఇరిగేషన్ అమలు వల్ల జిల్లాలో ఆరకొర సాగునీటి వనరులతో అవ స్థలు పడుతున్న రైతులకు మేలు చేకూరనుంది. జలజీవన్ మిషన్‌ను 2028 వరకు పొడిగించడంతో పాటు భారీగా రాష్ట్రవాటా నిధులను సమకూ ర్చుకునేందుకు బడ్జెట్‌లో కేటాయిం పులు చూపడం జిల్లాలో నీటి కోసం అల్లాడుతున్న ప్రజానీకానికి ఊరట కలిగిస్తున్నాయి. దొనకొండ పారిశ్రా మిక కారిడార్ విషయం బడ్జెట్‌లో ప్రత్యేకంగా ప్రస్తావించడం ఉపశ మనం కలిగిస్తోంది.

వెలిగొండకు నిరాశే

బడ్జెట్‌లో వెలిగొండ ప్రాజెక్టుకు ఆశించిన స్థాయిలో కేటాయింపులు లేవు. కేవలం రూ.309 కోట్లను మాత్రమే కేటాయించారు. ఐదేళ్ల వైసీపీ కాలంలో రూ.వెయ్యి కోట్లు కేటాయించి రూ.850 కోట్లు మాత్రమే ఖర్చు చేశారు. చివరి ఏడాది అయిన 2023-24 లో ఆ ప్రభుత్వం అతి తక్కువగా రూ.101 కోట్లు కేటాయించి కేవలం రూ.26 కోట్లు మాత్రమే వెచ్చించింది. కూటమి ప్రభుత్వం అధికా రంలోకి వచ్చాక ప్రాజెక్టు పనుల్లో కదలిక వచ్చింది. 2024-25 బడ్జెట్‌లో సుమారు రూ.393.49 కోట్లు కేటాయిం చింది. అందులో పనుల కోసం సుమారు రూ.248 కోట్లు కేటాయించగా రూ.250కోట్లకుపైగా ఖర్చు చేశారు. దీంతో 2025-26 బడ్జెట్‌లో కేటాయింపులు భారీ ఉంటాయని, 2026 జూన్‌కు నీరు ఇస్తామన్న సంకేతాలు ప్రభుత్వ పెద్దలు ఇచ్చారు. అలా నీరు ఇవ్వాలంటే నిర్వాసితులకు కనీసం రూ.800 కోట్లు, పనుల కోసం రూ.300 నుంచి రూ.400 కోట్లు అవసరమని అధికారులు అంచనా వేశారు.

● ఇలాగైతే పనులు ముందుకెలా?

వెలిగొండకు బడ్జెట్‌లో ప్రాధాన్యం ఉంటుందని ప్రజలు ఆశించారు. కానీ ప్రాజెక్టుకు నిధుల కేటాయింపు అన్ని వర్గాలను నిరాశపరిచింది. కేవలం రూ.309.13 కోట్లు మాత్రమే కేటాయిం చింది. గత బడ్జెట్ కన్నా కూడా దాదాపు 25శాతం నిధులు తగ్గించి వేశారు. నిర్వాశితులకు గత బడ్జెట్‌లో కేటాయింపు చూపి ఖర్చుచేయని రూ.80 కోట్లు చూపించగా పనుల కోసం రూ.191 కోట్లు కేటాయించారు. అంత పెద్ద ప్రాజెక్టుకు కీలకమైన ప్రస్తుత తరుణంలో ఇంత తక్కువగా నిధులు కేటాయిస్తే పనులు ఎలా ముందుకు సాగుతాయి, నిర్దేశిత కాలంలో నీరు ఎలా ఇవ్వగలరు అన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ఇక గుండ్ల కమ్మ ప్రాజెక్టుకు గత బడ్జెట్‌లో రూ.13 కోట్లు కేటాయించగా ఈసారి రూ.15.50 కోట్లు కేటాయించారు. ఉమ్మడి జిల్లా లోని కొరిశ పాడు ఎత్తిపో తల పథకానికి గత బడ్జెట్‌లో రూ.1.50 కోట్లు మాత్రమే కేటా యించగా ఈ సారి రూ.8.65 కోట్లకు పెంచారు.

● గతేడాది కన్నా తక్కువే

పాలేరు రిజ ర్వాయర్‌కు ఏమాత్రం కేటా యింపులు లేక పోగా మధ్యత రహా ప్రాజెక్టు లైన రాళ్లపాడు, మోపాడు, కంభం ట్యాంకులు, ఒంగోలు సీఈ పరిధిలో ఉన్న పోతురాజు కాలువ అభివృద్ధి పనులకు నిధుల ఊసే కనిపించలేదు. మొత్తం ఇక్కడి సీఈ పరిధిలో బడ్జె ట్‌లో రూ.2వేల కోట్లు కోరుతూ అధికా రులు నివేదించగా ఇంచుమించు రూ.1,100 కోట్లు కేటాయింపు అవ కాశం ఉన్నట్లు సంకేతాలు తొలుత అందాయి. కానీ బడ్జెట్‌లో రూ.507.16 కోట్లు మాత్రమే ఇచ్చారు. అందు లోనూ సాగర్ కుడికాలువ మొత్తం, అలాగే ఎడమ కాలువ పరిధిలోని రాష్ట్రంలో ఉన్న ప్రాంత పర్యవేక్షణ ఇక్కడి సీఈ పరిధిలోనే ఉండగా వాటికి సంబంధించి కేటాయింపు రూ.137 కోట్లు మాత్రమే ఉంది. ఉమ్మడి జిల్లాలోని వెలిగొండ, గుండ్ల కమ్మ, కొరిశపాడు ఎత్తిపోతల ఇత రత్రా అన్నింటికి కలిపి రూ.369 కోట్లు మాత్రమే కేటాయించారు. అదే గతేడాది రూ.441.14 కోట్లు కేటా యింపు చేశారు.

బడ్జెట్‌లో అభివృద్ధి, సంక్షేమానికి ప్రాధాన్యం

ఎమ్మెల్యే దామచర్ల

ఒంగోలు, కార్పొరేషన్, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో అభివృద్ధి, సంక్షేమానికి సమ ప్రాధాన్యత కల్పించారని ఒంగోలు శాసనస భ్యులు దామచర్ల జనార్దన్ తెలి పారు. బడ్జెట్‌పై శుక్రవారం ఆయన మాట్లాడుతూ ఆదాయం, అప్పులు బేరీజు వేసుకుంటూ ప్రాధ్యానత క్రమంలో పథకాల అమలుకు శ్రీకారం చుట్టిందన్నారు. తల్లికి వందనం అమలుకు రూ.9.407 కోట్లు కేటాయించడం శుభపరి ణామం అన్నారు. బీసీల సంక్షేమా నికి రూ.47,456 కోట్లు కేటాయించిన కూటమి ప్రభుత్వం మరోసారి బీసీల పట్ల తనకున్న చిత్తశుద్ధిని నిరూపించుకుందని చెప్పారు. ఆంధ్రుల జీవనాడి పోలవరం ప్రాజెక్టు కోసం రూ.6,705 కోట్లు కేటాయించడం విశేషమన్నారు. అలాగే ఎస్సీ, ఎస్టీ, బీసీ, ముస్లిం మైనార్టీలు, మహిళా శిశు, దివ్యాం గులు, వృద్ధుల సంక్షేమాన్ని రాష్ట్ర ప్రభుత్వం పరిగణనలోకి తీసుకుంద న్నారు. విద్య, వైద్య ఆరోగ్య, పంచా యతీరాజ్, గృహ నిర్మాణ శాఖలకు అవసరాలకు అనుగుణంగా నిధులు కేటాయించడంపై హర్షం వ్యక్తం చేశారు. వ్యవసాయం, అనుబంధ రంగాలకు బడ్జెట్‌లో పెద్ద మొత్తంలో నిధులు కేటాయించిన ప్రభుత్వం రైతు పక్షపాతిగా నిలిచిందని తెలిపారు.

● సంక్షేమానికి పెద్దపీట

డాక్టర్ స్వామి, సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి

అన్ని వర్గాల ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా బడ్జెట్ ప్రతిపాదన ఉంది. ప్రత్యేకించి సంక్షేమానికి అందు లోనూ ఎస్సీలకు పెద్దపీట వేశారు. పేదల సంక్షేమానికి, అభివృద్ధికి కూటమి ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేస్తున్నదనడానికి ఈ బడ్జెట్ నిద ర్శనం.

● వెలిగొండకు తీవ్ర అన్యాయం

బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి, వైసీపీ జిల్లా అధ్యక్షుడు, దర్శి ఎమ్మెల్యే

వెలిగొండకు నిధుల కేటాయింపులో తీవ్ర అన్యాయం జరిగింది. నిర్వాసి తుల కోసం రూ.800 కోట్లు అవసరం. కానీ ఆ మేర నిధులు కేటాయించ లేదు. కూటమి ప్రభుత్వం వచ్చాక మంత్రులు ప్రాజెక్టును సందర్శించి త్వరగా పూర్తిచేస్తామని చెప్పారు అందుకు అనుగుణంగా ఇప్పుడు బడ్జె ట్‌లో కేటాయింపులు లేవు. ఇతర ప్రాజెక్టులకు కూడా ఇదే విధంగా కోత విధించింది.

● సంక్షేమానికి ప్రాధాన్యం

మాగుంట శ్రీనివాసులరెడ్డి, ఎంపీ

రాష్ట్ర బడ్జెట్‌లో ఆర్థికశాఖ మంత్రి పయ్యావుల కేశవ్ సంక్షేమానికి పెద్ద పీట వేశారు. వ్యవసాయానికి రూ.48,341 కోట్లు కేటాయించారు. మిగిలిన అన్ని రంగాలకు సముచిత స్థానం లభించింది. వైద్యశాఖకు రూ.19,264 కోట్లు, పాఠశాల విద్యకు రూ.31,805 కోట్లు, ఉన్నత విద్యకు రూ.2,506 కోట్లు, పరిశ్రమలకు రూ.3,156 కోట్లు, ఇంధన రంగానికి రూ.13,600 కోట్లు, రోడ్లు, భవనాలకు రూ.8,785 కోట్లు, యువజన శాఖకు 469 కోట్లు కేటాయించారు.

● ఇది దగాకోరు బడ్జెట్

షేక్ సైదా, డీసీసీ అధ్యక్షుడు

కూటమి ప్రభుత్వం పూర్తిస్థాయి తొలి బడ్జెట్ దగా కోరు, దివాళాకోరుగా ఉంది. సంక్షేమం కాదు సంక్షోభ బడ్జెట్ ఇది. పేదలు, రైతులు, మహిళలు, నిరుద్యోగుల వ్యతిరేక బడ్జెట్. అంతా అంకెల గారడీ, అభూతకల్పనగా ఉంది. సూపర్ సిక్స్ పథకాలకు పంగ నామాలు పెట్టారు.

యూనివర్సిటీకి రూ.104 కోట్లు కేటాయింపు

ఒంగోలు విద్య, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): ఒంగోలులోని ఆంధ్రకేసరి ప్రకాశం యూనివర్సిటీకి 2025-26 ఆర్థిక సంవత్సరానికి రూ.1.04 కోట్లు కేటా యించారు. శుక్రవారం అసెంబ్లీలో ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో ఈ విషయాన్ని ప్రకటించారు. యూనివర్సిటీకి 2023-24లో కేవలం రూ.74.41లక్షలు కేటా యించగా 2024-25లో ఆర్థిక సంవత్సరంలో కూటమి ప్రభుత్వం రూ.2.10కోట్లు వెచ్చించింది. వచ్చే సంవత్సరానికి బడ్జెట్‌లో రూ.1.04 కోట్లు కేటాయించారు.

వాహనదారులకు వాత

అవీఇవీ

(5వ పేజీ తరువాయి)

రూ.1,000కి పెంచారు. ముఖ్యంగా యువకులు సైలెన్సర్లు మార్చి రణగొణ ధ్వనులతో వాహనచోదన చేస్తూ పోలీసులకు పట్టుబడితే రూ.2వేల నుంచి రూ.4వేల వరకు జరిమానా విధిస్తారు. జరిమానాలు పడకుండా ఉండాలంటే అందరూ రోడ్డు నిబంధనలు పాటించాలని నగర ట్రాఫిక్ సీఐ పాండురంగారావు ఓ ప్రకటనలో కోరారు.

ఉల్లంఘన	జరిమానా
హెల్మెట్ లేకపోతే..	రూ.వెయ్యి
వెనక కూర్చున్న వ్యక్తికి హెల్మెట్ లేకపోతే..	రూ.వెయ్యి
లైసెన్స్ లేకుండా వాహనం నడిపితే..	రూ.10వేలు
వాహనానికి బీమా లేకపోతే..	రూ.వెయ్యి
బీమా లేకుండా రెండోసారి పట్టుబడితే..	రూ.2వేలు
శబ్ద, పొగ కాలుష్యం చేస్తే..	రూ.2వేల నుంచి రూ.4వేలు
డేంజరస్ పార్కింగ్	రూ.1,500 నుంచి రూ.3వేలు
అతివేగంతో నడిపితే	రూ.5వేలు
ప్రమాదకరంగా నడిపితే..	రూ.10వేలు
చిన్న పిల్లలు వాహన చోదన చేస్తే	రూ.వెయ్యి
ప్రయాణికులను రవాణా వాహనాల్లో ఎక్కిస్తే	(ఒక్కొక్కరికి) రూ.200

నేటి నుంచి ఇంటర్ పరీక్షలు

(5వ పేజీ తరువాయి)

అనుసంధానం చేశారు. పరీక్షలు జరిగే విధానాన్ని ఈ కేంద్రాల నుంచి నేరుగా వీక్షించేందుకు చర్యలు తీసుకున్నారు. ప్రతిరోజూ ఉదయం 9గంటలకు పరీక్ష ప్రారంభమవుతుంది. 8.30కు విద్యార్థులను కేంద్రాల్లోకి అనుమతిస్తారు. పరీక్ష మొదలైన తర్వాత నిమిషం లేటైనా విద్యార్థులను లోపలికి అనుమతించరు. జిల్లాలో కంభం, పెద్దారవీడు, అర్ధవీడు, ఎర్రగొండపాలెం, గిద్దలూరులోని కేంద్రాలను సమస్యాత్మక మైనవిగా గుర్తించారు. కాపీయింగ్‌ను నిరోధించేందుకు ప్రత్యేక దృష్టిని కేంద్రీకరించారు. పరీక్షా కేంద్రాలను ఆకస్మికంగా తనిఖీ చేసేందుకు మూడేసి చొప్పున ఫ్లైయింగ్, సిట్టింగ్ స్క్వాడ్లను ఏర్పాటు చేశారు. వీటికి అదనంగా ఆర్ఐవో, డీఈసీ సభ్యులు, జిల్లా పరిశీలకులు, బోర్డు అధికారులు, కలెక్టర్, జిల్లా అధికారులు కూడా కేంద్రాలను తనిఖీ చేయనున్నారు. పరీక్ష కేంద్రాల్లోకి సెల్‌ఫోన్లను నిషేధించారు. మరోవైపు ఆర్ఐవో కార్యాలయంలో కంట్రోలు రూంను కూడా ఏర్పాటు చేశారు. అందుకోసం 08592-281275 నెంబరును కేటాయించారు.

నేటి నుంచి రేషన్

(5వ పేజీ తరువాయి)

కందిపప్పు సరఫరా కావడం లేదు. దీంతో రేషన్ షాపుల ద్వారా కేవలం బియ్యం, పంచదార పంపిణీకే పరిమితమయ్యారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో కార్డుదారులకు కందిపప్పు సక్రమంగా ఇవ్వలేదు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక బియ్యం, పంచ దార, కందిపప్పుతోపాటు చిరుధాన్యాలను కూడా సరఫరా చేస్తామని ప్రకటించింది. ఆ ప్రకారం కొన్ని నెలలు కందిపప్పుతోపాటు జొన్నలు కూడా ఇచ్చారు. దీంతో కార్డుదారులు తమకు అన్నిరకాల వస్తువులు దొరకుతాయని ఆశించారు. నవంబరులో 70శాతం కందిపప్పును జిల్లాకు కేటాయించగా, డిసెంబరులో అసలు కేటాయించలేదు. జన వరి, ఫిబ్రవరిలో కూడా అదే పరిస్థితి నెలకొంది. మార్చి 1వతేదీ నుంచి జిల్లాలో రేషన్ పంపిణీ ప్రారంభమవుతుండగా జిల్లాకు కేవలం బియ్యం, పంచదారను మాత్రమే ప్రభుత్వం సరఫరా చేసింది. దీంతో జిల్లాలోని పౌరసరఫరాల గోడౌన్ల నుంచి రేషన్ షాపులకు ఆ రెండు రకాల సరుకులను మాత్రమే పంపారు.

జిల్లా అభివృద్ధికి నిధుల కేటాయింపులో విఫలం

ఒంగోలు కలెక్టరేట్, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర బడ్జెట్‌లో వెనుక బడిన జిల్లా అభివృద్ధికి తగిన నిధుల కేటాయింపులో నిర్లక్ష్యం చేశారని సీపీఎం జిల్లా కార్యదర్శి ఎస్‌కే మాబు ఆరోపించారు. వెలిగొండను పూర్తి చేసేందుకు నాలుగు వేల కోట్లు అవసరం అవుతాయని ఇటీవల ప్రాజె క్టును సందర్శించిన మంత్రి ప్రకటించారన్నారు. అందుకు అనుగుణంగా నిధుల కేటాయించలేదని చెప్పారు. తక్షణమే బడ్జెట్‌లో సవరణలు చేసి రూ.2వేల కోట్లు కేటాయించాలని డిమాండ్ చేశారు. గుండ్లకమ్మ, సంగమే శ్వరం, పాలేటిపల్లి తదితర ప్రాజెక్టులతో పాటు దొనకొండ కారిడార్, కని గిరి నిమ్జ్‌కు నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు.

జిల్లాను దగా చేసిన బడ్జెట్

కూటమి ప్రభుత్వం తొలి బడ్జెట్‌లో ప్రకాశం జిల్లాను దగా చేసిందని సీపీఐ జిల్లా కార్యదర్శి ఎంఎల్ నారాయణ మండిపడ్డారు. అసెంబ్లీలో ఆర్థికశాఖ మంత్రి పయ్యావుల కేశవ్ అసెంబ్లీలో ప్రవేశపెట్టిన బడ్జెట్ అంకెల గారడీ తప్ప ఏమి లేదన్నారు. ప్రాధాన్యత రంగాలకు కేటాయిం పులు తక్కువగా ఉన్నాయని చెప్పారు. వెలిగొండ ప్రాజెక్టు నిర్మాణానికి అవసరమైన మేరకు నిధులు కేటాయింపులు లేవన్నారు. కేవలం రూ.309 కోట్లుమాత్రమే కేటాయించడం దుర్మార్గం అని చెప్పారు. సంక్షేమ రంగానికి కోతలు విధించడంతోపాటు యువతకు బడ్జెట్‌లో మొండిచేయి చూపిందని ఆరోపించారు. దొనకొండ పారిశ్రామికఅభి వృద్ధి జరిగేలా చర్యలు తీసుకోవడంలో విఫలమైందని ఆరోపించారు.

అన్నివర్గాలు, అన్ని రంగాలకు ప్రాధాన్యం

మార్కాపురం, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): శాసన సభలో శుక్రవారం రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన వార్షిక బడ్జెట్ జనరంజకంగా ఉందని పలు పార్టీల నాయకులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. అన్ని వర్గా లకు, రంగాలకు సమ ప్రాధాన్యతమిస్తూ బడ్జెట్ రూపకల్పన చేయడం హర్షణీయమంటున్నారు. గత ప్రభుత్వ ఘోర తప్పిదాల వలన ఏర్పడిన అగా ధాన్ని పూడ్చేందుకు, రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపేందుకు బడ్జెట్ దోహదపడుతుందని అభిప్రా యాలను వ్యక్తం చేశారు.

● అన్ని వర్గాలు, రంగాలకు బడ్జెట్ ఉపయుక్తం

తాళ్లపల్లి వెంకటసత్యనారాయణ, టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి

అసెంబ్లీలో ఈ రోజు ప్రవేశపెట్టిన బడ్జెట్ అన్ని వర్గాలకు ఉపయుక్తంగా ఉంది. సంక్షేమం, అభివృద్ధికి సమ ప్రాధాన్యతమిస్తూ బడ్జెట్‌లో కేటాయింపులు చేశారు. వ్యవసాయం, విద్య, వైద్య రంగాలకు తగి నన్ని కేటాయింపులు చేశారు. రాష్ట్రాభివృద్ధి కేవలం కూటమి ప్రభుత్వంతోనే సాధ్యమని నమ్మి ఓట్లేసిన ప్రజల నమ్మకాన్ని ప్రస్తుత బడ్జెట్ నిలబెట్టింది. అన్ని వర్గాలు, రంగాలకు ప్రాధాన్యత ఇచ్చారు.

● మైనార్టీల అభివృద్ధికి కూటమి ప్రభుత్వం పెద్దపీట

సయ్యద్ సాధిక్, జిల్లా ప్రధాన కార్యదర్శి, జనసేన

ఆంధ్రప్రదేశ్ చరిత్రలో ఎన్నడూలేని విధంగా బడ్జె ట్‌లో అల్పసంఖ్యాక వర్గాల వారికి రూ.5,434 కేటా యించడం అభినందనీయం. ముఖ్యంగా మైనా ర్టీల అభివృద్ధికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని ఈ బడ్జెట్ తేటతెల్లం చేసింది. రాష్ట్ర అభివృ ద్ధికి కూటమి ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకుం టుందో ఈ బడ్జెట్ ప్రతిబింబిస్తోంది. అన్ని వర్గాలను సంతృప్తి పరిచేలా ఈ బడ్జెట్ ఉంది. రాష్ట్ర ముఖ్య మంత్రి చంద్రబాబునాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్, న్యాయశాఖామంత్రి ఎన్ఎండీ ఫరూక్ లకు కృతజ్ఞతలు.

● ముస్లింలకు టీడీపీతోనే అండ

పఠాన్ ఇబ్రహీంఖాన్, టీడీపీ మైనార్టీ సెల్ రాష్ట్ర కార్యదర్శి

ముస్లింలకు టీడీపీ ఎల్లవేళలా అండగా ఉంటుంది. గతంలో ఎన్నడూలేని విదంగా బడ్జెట్‌లో రూ.5,434 కోట్లు ముస్లింకు కేటాయించడం హర్ష ణీయం. రాష్ట్రంలోని యావత్ ముస్లిం సమాజం కూటమి ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలుపుతోంది. గతంలో కూడా ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ముస్లింలకు చంద్రబాబునాయుడు ఎన్నో సౌలభ్యాలు కల్పిం చారు. అప్పట్లో ఉర్దూ యూనివర్శిటీ, హజ్‌హౌస్ నిర్మాణాలు, ఇమామ్, మౌజన్‌లకు జీతాలు ఇవ్వడం టీడీపీ ప్రభుత్వమే చేపట్టింది. ఈ బడ్జెట్‌లో కేటా యింపుల ద్వారా షాదీఖానా, ఖబరస్థాన్‌ల అభివృ ద్ధికి మార్గం సుగమం అవుతుంది.

● ప్రజా సంక్షేమానికి ప్రాధాన్యతనిచ్చిన బడ్జెట్

పీవీ కృష్ణారావు, బీజేపీ అసెంబ్లీ కన్వీనర్, మార్కాపురం

గత ప్రభుత్వ తప్పిదాలతో రాష్ట్రం అభివృద్ధిలో గాడి తప్పింది. రూ.లక్షల కోట్ల అప్పులతో ఉన్నా, సంక్షేమానికి ఈ బడ్జెట్ పెద్దపీట వేసింది. అదే సమ యంలో అభివృద్ధికి కూడా సమ ప్రాధాన్యాన్ని ఇచ్చింది. ఎన్డీఏ కూటమి ప్రభుత్వం ఎల్లవేళలా ప్రజా సంక్షేమం కోసం పాటుపడుతుందని బడ్జెట్ నిరూపించింది. భవిష్యత్తులో కూడా కేంద్ర ప్రభుత్వ సహకారంతో రాష్ట్రం అభివృద్ధి పథంలో దూసుకుపో తుంది.

హరోంహర!



దర్శిలో రథాన్ని లాగుతున్న డాక్టర్ గొట్టిపాటి లక్ష్మీ, డాక్టర్ లలిత్‌సాగర్ దంపతులు

- కన్నులపండువగా రథోత్సవాలు
- దర్శిలో కాశీవిశ్వేశ్వరుడు, త్రిపురాంతకంలో త్రిపురాంతకేశ్వరుడి ఊరేగింపు

దర్శిలో కాశీవిశ్వేశ్వరుడి రథోత్సవంలో భక్తజనం

త్రిపురాంతకక్షేత్రంలో ఆదిదేవుడి రథోత్సవం శుక్రవారం కన్నులపండువగా సాగింది. కుంకుమార్చన, అభిషేకాల అనంతరం స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులను రథంపై ఊరేగించారు. టీడీపీ ఎర్రగొండపాలెం ఇన్‌చార్జి గూడూరి ఎరిక్షన్‌బాబు, తహసీల్దారు జి.శ్రీనివాస్, ఆలయ ఈవో డి.రజనీకుమారి ఆధ్వర్యంలో వేదపండితులు, అర్చకులు విశ్వం, ప్రసాద్ పూజలు నిర్వహించారు. దర్శి డీఎస్పీ బి.లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. దర్శిలో అన్నపూర్ణ సమేత కాశీవిశ్వేశ్వరస్వామి రథోత్సవం వైభవంగా జరిగింది. మూడో రోజు శివపార్వతులను రథంపై వైభవంగా ఊరేగించారు. టీడీపీ దర్శి నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మీ, డాక్టర్ లలిత్‌సాగర్ దంపతులు, మాజీ ఎమ్మెల్యే నారపుశెట్టి పాపారావు, దర్శి నగర పంచాయతీ చైర్మెన్ నారపుశెట్టి పిచ్చయ్య, జనసేన పార్టీ జిల్లా నాయకుడు నాగరాజు తదితరులు రథాన్ని లాగారు. దర్శి-అద్దంకి రోడ్డు మీదుగా గడియారస్తంభం సెంటర్ వరకు రథోత్సవం నిర్వహించారు. ఊరేగింపులో మహిళల కోలాటం అలరించింది. డీఎస్పీ బి.లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో సీఐ వై.రామారావు పర్యవేక్షణలో పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు. - త్రిపురాంతకం/దర్శి, ఆంధ్రజ్యోతి


త్రిపురాంతకంలో మహిళల కోలాటం

నేటి నుంచి విద్యార్థులకు కొత్త మెనూ

ఒంగోలు విద్య, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి) : పాఠశాల విద్యార్థులకు అందిస్తున్న డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజనం కొత్త మెనూ శనివారం నుంచి అమలులోకి రానుంది. ఆమేరకు జిల్లా విద్యాశాఖాధికారి కిరణ్‌కుమార్ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. విద్యార్థులకు రుచికరమైన భోజనం అందించేందుకు ఆయా ప్రాంతాల్లోని ప్రజల ఆహారపు అలవాట్లను దృష్టిలో ఉంచుకొని జోనల్ వారీగా కొత్తమెనూను రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదించింది. ఈ కొత్త మెనూను మార్చి 1 నుంచి ఈ విద్యా సంవత్సరం చివరి వరకు ప్రయోగాత్మకంగా అమలు చేస్తున్నారు. ఇది ఫలిస్తే వచ్చే విద్యా సంవత్సరంలో కూడా కొనసాగిస్తారు. విద్యార్థుల నుంచి సానుకూలత వ్యక్తం కాకపోతే మళ్లీ మెనూలో మార్పులు చోటు చేసుకోనున్నాయి. శనివారం నుంచి అమలయ్యే కొత్త మెనూ జోన్-3 పరిధిలోని ప్రకాశం, గుంటూరు, పల్నాడు, బాపట్ల, నెల్లూరు జిల్లాల్లోని పాఠశాలల్లో అమలు చేస్తారు.



ఏరోజు ఏ ఆహారమంటే..

సోమవారం: తెల్లఅన్నం, కూరగాయలతో సాంబారు, ఎగ్‌ఫ్రై, చిక్కీ
మంగళవారం: చింతపండు లేదా నిమ్మకాయ పులిహోర, టమెటా/పుదీనా చట్నీ, ఫ్రైడ్ ఎగ్, రాగిజావా
బుధవారం: తెల్లఅన్నం, మిక్స్‌డ్ వెజిటబుల్ కర్రీ, ఎగ్‌ఫ్రై, చిక్కీ
గురువారం: పలావు/కూరగాయల అన్నం, ఆలుకుర్మా, బాయిల్డ్ ఎగ్, రాగిజావా
శుక్రవారం: తెల్లఅన్నం, ఎగ్ కర్రీ, చిక్కీ
శనివారం: తెల్లన్నం, టమోటా పప్పు/పప్పుచారు, స్వీట్ పొంగల్, రాగిజావా

ప్రభుత్వ ఆస్తుల జోలికొస్తే కఠిన చర్యలు

కలెక్టర్ తమీమ్ అన్సారియా

మార్కాపురం, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ భూములను ఇష్టారీతిన ఆక్రమించే వారిపై రెవెన్యూ అధికారులు కొరడా ఝుళిపించి క్రిమినల్ కేసులు నమోదయ్యేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తమీమ్ అన్సారియా సూచించారు. స్థానిక సౌజన్య ఫంక్షన్ హాలులో శుక్రవారం డివిజన్‌స్థాయి రెవెన్యూ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ భూములు అన్యాక్రాంతం కాకుండా అధికారులు, సిబ్బంది గట్టి నిఘా పెట్టాలన్నారు. స్థానిక పరిస్థితులను వీఆర్వోలు, సర్వేయర్లు నిరంతరం గమనిస్తూ ఉండాలన్నారు. ఆక్రమణలకు గురైన ప్రభుత్వ భూములను విడిపించి కబ్జాదారులపై క్రిమినల్ కేసులు నమోదయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. మీకోసం, రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన అర్జీలను త్వరితగతిన పరిష్కరించాలన్నారు. రీసర్వే ప్రక్రియను రైతుల సమక్షంలోనే నిర్వహించాలన్నారు. సర్వే అనంతరం రైతులకు రసీదులు ఇవ్వాలన్నారు. రీసర్వే పురోగతిని తాను ప్రతిరోజూ సమీక్షిస్తానన్నారు. ఏమైనా అవకతవకలు ఉన్నట్లు గుర్తిస్తే బాధ్యులపై చర్యలు తప్పవన్నారు. క్షేత్రస్థాయిలో వాస్తవాలను తెలుసుకోవాలంటే తహసీల్దార్, సర్వేయర్, వీఆర్వోలు సమష్టిగా పనిచేయాల్సి ఉందన్నారు. మ్యుటేషన్ ప్రక్రియలో కచ్చితంగా నిబంధనలు పాటించాలన్నారు. ఆన్‌లైన్‌లో ఉన్న వ్యక్తులే ఫీల్డ్‌లో కూడా ఉండేలా సర్వేయర్లు కచ్చితంగా పరిశీలించాలన్నారు. వివరాలు సరిపోకపోతే తహసీల్దార్ దృష్టికి తీసుకెళ్లాలన్నారు. అటవీ భూముల పరిరక్షణపై ప్రత్యేక శ్రద్ధపెట్టాలని సూచించారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ గోపాలకృష్ణ, డీఆర్వో చిన్నఓబులేసు, మార్కాపురం సబ్‌కలెక్టర్ సహదిత్ వెంకట్ త్రివినాగ్, సర్వేశాఖ సహాయ సంచాలకులు గౌస్‌బాషా, హౌసింగ్ పీడీ శ్రీనివాసప్రసాద్, అన్ని మండలాల తహసీల్దార్‌లు, డీటీలు, సర్వేయర్లు, ఫుడ్ ఇన్‌స్పెక్టర్లు, అటవీశాఖ అధికారులు పాల్గొన్నారు.


సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ అన్సారియా

చిట్టి బుర్రల్లో.. గట్టి ఆలోచనలు

- స్ఫూర్తిమంతంగా సైన్స్ ప్రాజెక్టుల రూపకల్పన
- ఘనంగా జాతీయ సైన్స్ దినోత్సవం


విద్యార్థుల ప్రదర్శనలను పరిశీలిస్తున్న టీచర్లు



పొల్యూషన్ కంట్రోల్

ఫ్యాక్టరీ పొల్యూషన్ కంట్రోలర్ ప్రయోగాన్ని సిరి, ఈషిత, వేదశ్రీ తయారు చేశారు. పొగ వల్ల అతినీలలోహిత కిరణాలు విడుదలై క్యాన్సర్ వస్తుంది. ఈ ప్రయోగంతో పొల్యూషన్‌ను కంట్రోల్ చేయొచ్చు.

వారంతా చిన్నారి బాలబాలికలు. గురువుల బోధనలతో మేధో సంపత్తికి పదును పెట్టారు. అందరితో భళా అనిపించుకున్నారు. తోటి విద్యార్థులకు స్ఫూర్తిగా నిలిచారు. వారే చీరాలలోని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు. నియోజకవర్గ పరిధిలో శుక్రవారం పలు ప్రభుత్వ పాఠశాలల్లో జాతీయ సైన్స్ దినోత్సవం జరిగింది. ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు చిన్నారులకు సైన్స్ ప్రయోగాలతో పాటు వ్యాస రచన, వక్తృత్వం, ది రోల్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ ఇన్ ప్రజెంట్ వరల్డ్, ద గ్రేట్‌నెస్ ఆఫ్ ఎనీ సైంటిస్ట్ వంటి పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. ఈక్రమంలోనే వేటపాలెం మండల పరిధిలోని పందిళ్లపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సైన్స్ ప్రదర్శన, ప్రాజెక్టు, ముగ్గుల పోటీలు నిర్వహించారు. పర్యావరణ పరిరక్షణ, ఆరోగ్యం, వివిధరకాల ప్రాజెక్టులు తయారు చేసి ప్రదర్శన నిర్వహించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు శేఖరరావు, ఉపాధ్యాయులు నీలిమ, భవానీ దేవి, సంతోషం, మోహన్‌రావు, వేణుగోపాలరావు, రత్నం, నరసింహం, ప్రసన్నాంజనేయులు పాల్గొన్నారు.

- చీరాల, ఆంధ్రజ్యోతి



టెంపరేచర్ కంట్రోలర్

టెంపరేచర్ కంట్రోలర్‌ను 8వ తరగతి చదువుతున్న సిరివల్లి తయారు చేసింది. ఇంటి పరిసరాల విస్తీర్ణానికి అనుకూలంగా మొక్కలు పెంచడం వల్ల ఆరోగ్యంగా ఉంటారు. ఈ ప్రయోగంలో మొక్కలు, నీటి సాంద్రతపై అవగాహన పెంచుతుంది.

మల్టీ పర్పస్ ఓవెన్ ప్రయోగం

ఏడవ తరగతి చదువుతున్న జితేష్, నికేష్‌కుమార్ మల్టీ పర్పస్ ఓవెన్‌ను తయారు చేశారు. ఈ మల్టీ పర్పస్ ఓవెన్‌తో ఆహారం వండొచ్చు. నీళ్ల కాయొచ్చు. తద్వారా సమయం ఆదా అవుతుంది.



ఒంగోలులోనే ట్రిపుల్ ఐటీని నిర్మించాలి


వైస్ చాన్సలర్ విజయకుమార్‌కు వినతిపత్రం అందజేస్తున్న సిబ్బంది

ఒంగోలు కలెక్టరేట్, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): ఒంగోలు ట్రిపుల్ ఐటీ క్యాంపస్‌ను నగరంలోనే నిర్మించాలని కోరుతూ బోధన, బోధనేతర సిబ్బంది శుక్రవారం ఆర్జీయూకేటీ వైస్ చాన్స్‌లర్ విజయకుమార్‌ను కోరారు. ఈ మేరకు 114 మంది సిబ్బంది సంతకాలతో వీసీకి అందజేశారు. అన్ని సౌకర్యాలున్న ఒంగోలులోనే ట్రిపుల్ ఐటీని నిర్మించాలని, అంతర్జాతీయ సమావేశాలు, క్యాంపస్ నియామకాలు, ఇంక్యుబేషన్ సెంటరు, స్టార్టప్‌లు నెలకొల్పడానికి అనువుగా ఉంటుందని వినతిపత్రంలో పేర్కొన్నారు.


ప్రతిజ్ఞ చేస్తున్న విద్యార్థులు
మాట్లాడుతున్న ముఖ్యఅతిథి ఐఎంఏ రాష్ట్ర అధ్యక్షుడు నంద కిషోర్

కల సాకారం..

- పట్టా అందుకున్న మెడికల్ పీజీ విద్యార్థులు
- ఘనంగా మెడికల్ గ్రాడ్యుయేషన్

డాక్టర్ కావాలనేది ప్రతి ఒక్కరి కల. ఆ కల సాకారమైతే.. పట్టా చేతికొస్తే.. తల్లిదండ్రుల కళ్లముందు ఆ పట్టా అందుకుంటుంటే.. ఆ అనుభూతి అనిర్వచనీయం. ఆ సందర్భం అద్వితీయం. ఏడేళ్లపాటు పుస్తకాలతో పోరాడిన విద్యార్థులు ఎట్టకేలకు గమ్యాన్ని చేరుకున్నారు. వారే ఒంగోలులోని రిమ్స్ మెడికల్ కాలేజీ పీజీ విద్యార్థులు. స్థానిక జీజీహెచ్‌లోని ఆడిటోరియంలో 2019 మెడికల్ విద్యార్థుల పీజీ గ్రాడ్యుయేషన్ కార్యక్రమం శుక్రవారం ఘనంగా జరిగింది. కార్యక్రమానికి ఐఎంఏ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ జి.నందకిషోర్, జీజీహెచ్ ఇన్‌చార్జి సూపరింటెండెంట్ డాక్టర్ నామినేని కిరణ్ కుమార్, రిమ్స్ మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ వై.ఏడుకొండలు హాజరయ్యారు. ఈ సందర్భంగా విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ సుధాకర్, జిల్లా వైద్యాధికారి తెలగతోటి వెంకటేశ్వర్లు, నగర కమిషనర్ వెంకటేశ్వరరావు పాల్గొన్నారు. - ఒంగోలు కార్పొరేషన్, ఆంధ్రజ్యోతి

బడి ఈడు పిల్లలందరూ స్కూళ్లలోనే ఉండాలి : కలెక్టర్

ఒంగోలు కలెక్టరేట్, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి) : బడిఈడు పిల్లలందరూ స్కూళ్లలో ఉండేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తమీమ్ అన్సారియా ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్‌లోని కలెక్టర్ చాంబర్‌లో శుక్రవారం బంగారుబాల్యం కార్యక్రమంపై సమీక్షించారు. ముందుగా ఐసీడీఎస్ పీడీ హేనసుజన్ జిల్లాలో అమలు జరుగుతున్న బంగారుబాల్యం కార్యక్రమాన్ని వివరించారు. ఆయా అంశాలపై కలెక్టర్ మాట్లాడుతూ పిల్లలందరూ తప్పనిసరిగా పనిలో కాకుండా బడిలో ఉండే విధంగా చూడాలన్నారు. రిమ్స్ వైద్యశాలకు టీనేజ్ ప్రెగ్నెసీస్ ఎక్కువగా వస్తున్నాయని, దానిపై విచారణ చేసి నివేదికను అందజేయాలని సంబంధిత అధికారులను కలెక్టర్ ఆదేశించారు. అన్నిశాఖల అధికారులను సమన్వయం చేసుకొని పిల్లల పూర్తి సమాచారం తీసుకోవాలన్నారు. ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో పలు శాఖల అధికారులు వెంకటేశ్వర్లు, దినేష్‌కుమార్, శ్రీమన్నారాయణ పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణే ప్రభుత్వాల లక్ష్యం


రోడ్డును శుభ్రం చేస్తున్న విద్యార్థులు

ఒంగోలు కలెక్టరేట్, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): పర్యావరణ పరిరక్షణే ప్రధాన ధ్యేయంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పని చేస్తున్నాయని, అందుకోసం యువత శక్తి వంచన లేకుండా పని చేయాల్సిన అవసరం ఉందని ఆంధ్రకేసరి యూనివర్శిటీ ఎన్ఎస్ఎస్ కో ఆర్డినేటర్ డాక్టర్ మండే హర్షప్రీతం దేవ్ కుమార్ పేర్కొన్నారు. స్వచ్ఛభారత్ కార్యక్రమంలో భాగంగా యువజన సర్వీసులు- క్రీడావిభాగం మంత్రిత్వశాఖల ఆధ్వర్యంలో శుక్రవారం ఒంగోలు నగరంలోని పలు ప్రాంతాల్లో పారిశుధ్య పనులను చేపట్టారు. రోడ్లను శుభ్రం చేయడంతో పాటు ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా హర్షప్రీతందేవ్‌కుమార్ మాట్లాడుతూ పరిసరాలను ప్రతి ఒక్కరు పరిశుభ్రంగా ఉంచుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ఆర్టీ విభాగం ప్రతినిధి సంజయ్‌కుమార్, కోఆర్డినేటర్లు టి.రాజేంద్రబాబు, కె.రవితేజ, పి.నీలిమ, కె.రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

డ్వాక్రా రుణాలు చెల్లించని వారి వివరాలు సేకరించాలి

ఒంగోలు(రూరల్), ఫిబ్రవరి28(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో డ్వాక్రా రుణాలు తీసుకుని తిరిగి చెల్లించని వారి వివరాలు సేకరించి నివేదికలు రూపొందించాలని క్లస్టర్ లీగల్ కోఆర్డినేటర్ జి.వెంకటసుబ్బయ్య పేర్కొన్నారు. శుక్రవారం ఒంగోలు మండల పరిషత్ కార్యాలయ సమావేశ భవనంలో వెలుగు కమ్యూనిటీ రిసోర్స్‌పర్సన్‌లకు ఆడిట్‌పై శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకటసుబ్బయ్య మాట్లాడుతూ ఇప్పటివరకు రుణాలు తీసుకొని చెల్లించని వారి వివరాలను సేకరించాలన్నారు. వారంరోజుల్లో ఈ పరిశీలనలు పూర్తి చేసి వెలుగు కార్యాలయాల్లో నివేదికలు అందించాలని చెప్పారు. కార్యక్రమంలో ఎస్ఎన్‌పాడు ఏరియా కోఆర్డినేటర్ ఎం.విజయమ్మ, ఏపీఎం శ్రీనివాసప్రసాద్, పలు మండలాలకు చెందిన 36మంది సిబ్బంది పాల్గొన్నారు

ఇంటర్ పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి

కొండపి, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి) : ఇంటర్మీడియట్ పరీక్షలకు స్థానిక జూనియర్ కళాశాలలో ఏర్పాట్లు పూర్తయ్యాయి. శనివారం నుంచి పరీక్షలు ప్రారంభంకానున్నాయి. ఇక్కడి కేంద్రంలో తమ కళాశాల విద్యార్థులతోపాటు చాణక్య ఇంటర్ కళాశాల, అంబేడ్కర్ గురుకులం బాలికలు, కె.ఉప్పలపాడులోని జడ్పీహెచ్ఎస్ విద్యార్థులు పరీక్షలు రాయనున్నారని ప్రిన్సిపాల్ ఎం. వెంకటేశ్వర్లు తెలిపారు. ప్రథమ సంవత్సరం విద్యార్థులు 320 మంది, ద్వితీయ సంవత్సరం విద్యార్థులు 277 మంది హాజరవుతారని చెప్పారు. పరీక్షలను పకడ్బందీగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కళాశాలలో 15 సీసీ కెమెరాలు ఏర్పాటు చేశామన్నారు. విద్యార్థులు పరీక్షా కేంద్రానికి 9 గంటల లోపు చేరుకోవాలన్నారు. ఒక నిమిషం ఆలస్యమైనా అనుమతించబోమని స్పష్టం చేశారు.

వల్లూరమ్మ ఆలయంలో ఎంపీ కలిశెట్టి పూజలు


ఎంపీ అప్పలనాయుడును శేష వస్త్రంతో సత్కరిస్తున్న పూజారి

టంగుటూరు, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని వల్లూరమ్మ ఆలయంలో విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు శుక్రవారం పూజలు చేశారు. అనంతరం మొక్కు తీర్చుకున్నారు. ఆయనకు ఆలయ అధికారులు, అర్చకులు ఘన స్వాగతం పలికారు. టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ యువగళం పాదయాత్ర సమయంలో ఆయన వెంట సాధారణ కార్యకర్తగా వచ్చిన కలిశెట్టి వల్లూరమ్మను దర్శించుకున్నారు. చంద్రబాబు ముఖ్యమంత్రి కావాలని అమ్మవారికి మొక్కుకున్నారు. దాన్ని శుక్రవారం తీర్చుకున్నారు.

రౌడీషీటర్లకు కౌన్సెలింగ్

చీమకుర్తి, ఫిబ్రవరి28(ఆంధ్రజ్యోతి) : చీమకుర్తి పోలీస్‌స్టేషన్ పరిధిలోని రౌడీషీటర్లకు శుక్రవారం సీఐ సుబ్బారావు కౌన్సిలింగ్ ఇచ్చారు. మొత్తం పరిధిలో 25మంది వరకు రౌడీషీటర్లు ఉండగా వారిలో 10మందిని మండల మెజిస్ట్రేట్ వద్ద రూ.2లక్షల పూచికత్తుతో బైండోవర్ చేశారు. మిగతా వారిని కూడా బైండోవర్ చేస్తామని చెప్పారు. అదేవిధంగా సంఘ విద్రోహ చర్యలు, రౌడీయిజం చెలాయిస్తే కఠినచర్యలు తీసుకుంటామని సీఐ హెచ్చరించారు.

రుణాల సద్వినియోగంతో ఆర్థిక అభివృద్ధి


● ఎస్సీ కార్పొరేషన్ ఈడీ అర్జున్‌నాయక్


అవగాహన కల్పిస్తున్న ఈడీ అర్జున్‌నాయక్

నాగులుప్పలపాడు, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ కార్పొరేషన్ ద్వారా ప్రభుత్వం అందిస్తున్న రుణాలను లబ్ధిదారులు సక్రమంగా సద్వినియోగం చేసుకోవాలని ఈడీ కె.అర్జున్ నాయక్ సూచించారు. శుక్రవారం ఎం.ముప్పాళ్ల ఎస్సీ కాలనీలో జరిగిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడుతూ ఎస్సీల ఆర్థికాభివృద్ధికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎస్సీ కార్పొరేషన్ ద్వారా పలు రకాల రుణాలను అందిస్తుందని చెప్పారు. ఆసక్తి గల వారు తమకు నచ్చిన రంగంలో యూనిట్లను ఎంపిక చేసుకొని రుణాలను పొందవచ్చని తెలిపారు. తీసుకొన్న రుణాలను తిరిగి బ్యాంకులకు సక్రమంగా చెల్లించి మరిన్ని రుణాలను పొందాలని సూచించారు. జిల్లాలో ఇప్పటికి రుణాల రికవరీలో వెనకబడినట్లు చెప్పారు. జిల్లావ్యాప్తంగా డ్వాక్రా గ్రూపులకు త్వరలోనే 220 ఆటోలను ఎస్సీ కార్పొరేషన్ ద్వారా అందించేందుకు సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఈవో జి.నరసింహారావు, డీఎల్‌డీవో వై.మహాలక్ష్మి, టీడీపీ నాయకుడు వైకుంఠ వీరాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

క్యాన్సర్‌పై ప్రజలకు అవగాహన కల్పించాలి

● డీపీఎంవో వాణిశ్రీ


క్యాన్సర్ పరీక్షల సర్వేను పరిశీలిస్తున్న డీపీఎంవో వాణిశ్రీ

సింగరాయకొండ, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి) : క్యాన్సర్‌పై ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పించాలని డీపీఎంవో డాక్టర్ వాణిశ్రీ పీహెచ్‌సీ సిబ్బందికి సూచించారు. క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షల నిమిత్తం శుక్రవారం సింగరాయకొండలో నిర్వహిస్తున్న ఇంటింటి సర్వేను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రొమ్ము, నోటి, గర్భాశయ క్యాన్సర్‌పై అవగాహన కల్పించాలన్నారు. నోటిలో ఎరుపు, తెల్లమచ్చల రూపంలో పుండ్లు ఉండటం రెండు వారాలైన మానకపోవడం, ఆకస్మికంగా బరువుతగ్గడం, చంకలలో గడ్డలు ఉండటం, అసాధారణ రక్తస్రావం వంటి సమస్యలు ఉంటే వెంటనే పీహెచ్‌సీలో వైద్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో డాక్టర్ దీరేంద్రకుమార్, సయ్యద్ మసూద్ అలీ, రాజమ్మ, టి.శ్రీనివాసులు పాల్గొన్నారు.

ఖాళీగా నేకునంబాదు చెరువు

● సాగర్ నీటితో నింపాలని గ్రామస్థుల విజ్ఞప్తి

చీమకుర్తి, ఫిబ్రవరి28(ఆంధ్రజ్యోతి): మండలంలోని నేకునంబాదు చెరువును సాగర్ జలాలతో నింపాలని గ్రామస్థులు కోరుతున్నారు. చెరువులో ప్రస్తుతం జలాలు అడుగంటిపోయాయి. వేసవి సమీస్తున్న వేళ నీటి ఎద్దడిని నివారించాలంటే చెరువును జలాలతో నింపాల్సి ఉంది. చెరువులో నీరు ఉంటేనే చుట్టుపక్కల ప్రాంతాల్లో బోర్లు పని చేస్తుంటాయి. అంతేగాక మూగజీవాల దాహార్తిని వేసవిలో తీర్చాలంటే తప్పనిసరిగా సాగర్ జలాలను వెంటనే సరఫరా చేయాలని స్థానికులు కోరుతున్నారు.


చెరువులో అడుగంటిన జలాలు

క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు వేగవంతం

● డీఎంహెచ్‌వో వెంకటేశ్వర్లు

ఒంగోలు కలెక్టరేట్, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలను వేగవంతంగా నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని డీఎంహెచ్‌వో వెంకటేశ్వర్లు ఆదేశించారు. శుక్రవారం ఒంగోలు నగరం రాజీవ్ గృహకల్పన పట్టణ ప్రాథమిక ఆరోగ్యకేంద్రాన్ని ఆయన తనిఖీ చేశారు. అక్కడ జరుగుతున్న జాతీయ ఆరోగ్య కార్యక్రమాలను సమీక్షించి వైద్యులు, సిబ్బందికి దిశా నిర్దేశం చేశారు. రికార్డులు పరిశీలనతో పాటు వైద్యశాలకు వచ్చిన ప్రజలతో మాట్లాడారు. అనంతరం వైద్యాధికారులు, సిబ్బందితో డీఎంహెచ్‌వో మాట్లాడుతూ ప్రతిరోజు రెండు సర్వే బృందాల ద్వారా 18 ఏళ్లు పైబడిన 60 మందికి క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించాలన్నారు. వైద్య పరీక్షల సమయంలో అనుమానితులను గుర్తిస్తే వెంటనే జీజీహెచ్‌కు పంపేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. పట్టణ ఆరోగ్య కేంద్రాల్లో పనిచేసే ఉద్యోగులందరూ ముఖ ఆధారిత హాజరు తప్పనిసరిగా ఉండాలన్నారు. విధుల నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. వైద్యశాలకు వచ్చే రోగులతో మర్యాదగా నడుచుకోవడంతో పాటు అవసరమైన చికిత్సలు అందించాలని సూచించారు. అనంతరం సంతనూతలపాడులోని ప్రాథమిక ఆరోగ్యకేంద్రాన్ని సందర్శించి అక్కడ వైద్యులకు తగిన సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో పలువురు వైద్యాధికారులు పాల్గొన్నారు.


పట్టణ ప్రాథమిక ఆరోగ్యకేంద్రాన్ని తనిఖీ చేస్తున్న డీఎంహెచ్‌వో వెంకటేశ్వర్లు

గాలికుంటు వ్యాధి నివారణకు చర్యలు

● డీఏహెచ్‌వో బేబీరాణి


లబ్ధిదారులతో మాట్లాడుతున్న డీఏహెచ్‌వో బేబీరాణి

మద్దిపాడు, ఫిబ్రవరి 28(ఆంధ్రజ్యోతి): పశువుల్లో గాలికుంటు వ్యాధి నివారణకు టీకాల కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారి (డీఏహెచ్‌వో) డాక్టర్ బేబీరాణి తెలిపారు. శుక్రవారం మద్దిపాడులోని గోకుల్‌షెడ్‌లను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా బేబీరాణి మాట్లాడుతూ వ్యాధుల తీవ్రత వల్ల పాల దిగుబడి తగ్గుతుందని, రైతులు అప్రమత్తంగా ఉండి పశువైద్యుల సలహాలు తీసుకోవాలని చెప్పారు. గాలికుంటు వ్యాధి సోకితే జ్వరంతో పాటు నీరసం కనిపిస్తుందని, నోటి మధ్య, కాలిగిత్తల మధ్య పుండ్లు పడతాయని చెప్పారు. జిల్లాలో అన్ని పశు వైద్యశాలలో గాలికుంటు టీకాల కార్యక్రమం ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. స్థానిక పశువైద్యశాలలో 40శాతం సబ్సిడీపై పశుపోషకులకు అందిస్తున్న గడ్డి కత్తిరించే యంత్రాలను ఆమె ప్రారంభించారు. పశుపోషకులకు మినీ గోకులం షెడ్లు, షాప్ కట్టర్లు అందజేస్తున్నట్లు తెలిపారు. జిల్లావ్యాప్తంగా 20 చాప్ కట్టర్లు అందజేశామన్నారు. ఏడీఏ డాక్టర్ సుగన్యరావు, దొడ్డవరప్పాడు డాక్టర్ తిరుమలరెడ్డి, పశువైద్య సిబ్బంది వెంకట్రావు, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి పశువులకు టీకాలు

నాగులుప్పలపాడు: పశువులకు గాలికుంటు సోకకుండా ఉండేందుకు మార్చి 1 నుంచి 30వ తేదీ వరకు టీకాలు వేస్తున్నట్లు నాగులుప్పలపాడు ఏడీఏ నాగభూషణరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.

రాష్ట్ర బడ్జెట్‌తో బడుగు, బలహీన వర్గాలకు మేలు

● బీజేపీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసరావు

ఒంగోలు కలెక్టరేట్, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం అసెంబ్లీలో ప్రవేశపెట్టిన బడ్జెట్ బడుగు, బలహీనవర్గాల ప్రజలకు ఎంతో ఉపయుక్తంగా ఉందని బీజేపీ జిల్లా అధ్యక్షుడు శెగ్గం శ్రీనివాసరావు పేర్కొన్నారు. ఒంగోలులోని బీజేపీ కార్యాలయంలో శుక్రవారం సాయంత్రం ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక అన్ని వర్గాల ప్రజలకు సముచిత స్థానం కల్పించిందన్నారు. ఆర్థికశాఖ మంత్రి పయ్యావుల కేశవ్ అసెంబ్లీలో ప్రవేశపెట్టిన బడ్జెట్ అన్ని రంగాలకు సముచితస్థానం లభించిందన్నారు. మాజీ అధ్యక్షుడు పీవీ.కృష్ణారెడ్డి మాట్లాడుతూ వ్యవసాయ రంగానికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇచ్చిందన్నారు. సమావేశంలో నియోజకవర్గ ఇన్‌చార్జి యోగయ్యయాదవ్, బొద్దులూరి అంజనేయులు, డి.శివాజీ, దండు శ్రీనివాసరావు, మోజీ, వీరభద్రాచారి తదితరులు పాల్గొన్నారు.

ముస్లింల పక్షపాతి చంద్రబాబు

ఒంగోలు కార్పొరేషన్: ముస్లింల పక్షపాతి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అని టీడీపీ మైనార్టీ సెల్ రాష్ట్ర నాయకులు పఠాన్ హనీఫ్‌ఖాన్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర బడ్జెట్‌లో ముస్లిం, మైనార్టీలకు రూ. 5,434కోట్లు కేటాయించడంపై ఆయన హర్షం వ్యక్తం చేశారు.


మాట్లాడుతున్న జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసరావు

ప్లాస్టిక్ వినియోగంతో పర్యావరణానికి ముప్పు

● డీఎస్పీ శ్రీనివాసరావు

● ఘనంగా జాతీయ సైన్స్ దినోత్సవం


సింగరాయకొండలో డీఎస్పీ శ్రీనివాసరావుకు జూట్ సంచులను అందజేస్తున్న స్మార్ట్‌జెన్ విద్యార్థులు

సింగరాయకొండ, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): ప్లాస్టిక్ వినియోగం పర్యావరణానికి ముప్పు అని డీఎస్పీ రాయపాటి శ్రీనివాసరావు అన్నారు. ప్లాస్టిక్‌ను ఎవ్వరూ వినియోగించవద్దని ఆయన సూచించారు. నేషనల్ సైన్స్‌డే సందర్భంగా స్థానిక స్మార్ట్‌జెన్ గ్లోబల్ స్కూల్ ఆధ్వర్యంలో ప్లాస్టిక్ వినియోగం వల్ల కలిగే దుష్పరిణామాలను తెలియజేస్తూ శుక్రవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అందులో భాగంగా విద్యార్థులు స్థానిక పోలీస్ స్టేషన్, పలు కార్యాలయాలు, కూడళ్లలో జూట్ సంచులను పంపిణీ చేశారు. స్థానిక పోలీస్ స్టేషన్‌లో డీఎస్పీ శ్రీనివాసరావును విద్యార్థులు కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్లాస్టిక్ నిషేధం, హెల్మెట్ వాడకంపై తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలని విద్యార్థులకు సూచించారు.

స్థానిక రైల్వేస్టేషన్ రోడ్డులోని జడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలో సైన్స్‌డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. తొలుత హెచ్ఎం రవిచంద్ర, ఉపాధ్యాయులు సర్ సీవీరామన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం విద్యార్థులు తయారుచేసిన 100కు పైగా ప్రాజెక్టులను ప్రదర్శించారు.

ఒంగోలు నగరంలో..

ఒంగోలు కలెక్టరేట్: ఒంగోలు నగరం వీఐపీ రోడ్డులోని శ్రీచైతన్య ఒలంపియాడ్ స్కూలులో శుక్రవారం జాతీయ సైన్స్ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బ్రాంచి ప్రిన్సిపాల్ అపర్ణ శిరీష మాట్లాడుతూ సీవీ.రామన్ రామన్‌ఎఫెక్ట్ కనుగొన్నందుకు గాను గుర్తుగా ఏటా దేశంలో సైన్స్ దినోత్సవం కార్యక్రమాన్ని జరుపుతున్నట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు తయారు చేసిన సైన్స్ ప్రాజెక్టులకు ఆకట్టుకున్నాయి. రిమ్స్ డాక్టర్ హిమశిల్ప సందర్శించి విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో రీజనల్ ఇన్‌చార్జి అనిల్, కో ఆర్డినేటర్ వై.శ్రీనివాసరావు, డీన్ శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

- స్థానిక లాయర్‌పేటలోని శ్రీచైతన్య స్కూలులో సైన్స్ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన సైన్స్ ప్రాజెక్టులు ఆకట్టుకున్నాయి. వ్యవసాయ శాఖ సైంటిస్ట్ డాక్టర్ పి.వెంకటేశ్వరరావు ప్రాజెక్టులను సందర్శించి విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ జోసెఫ్ తంబి, డీన్ బాలసుబ్రహ్మణ్యం, వైస్ ప్రిన్సిపాల్ శివపార్వతి, ప్రైమరీ స్కూలు ఇన్‌చార్జి రజిని, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

- జాతీయ సైన్స్ దినోత్సవాన్ని పురస్కరించుకొని స్థానిక లాయర్‌పేటలోని నారాయణ సీవో అండ్ ఒలంపియాడ్ స్కూలులో శుక్రవారం విద్యార్థులు ఏర్పాటు చేసిన సైన్స్ ప్రాజెక్టులను తాలూకా సీఐ అజయ్‌కుమార్, నారాయణ స్కూల్స్ ఏజీఎం నర్రావుల పెద్దిరెడ్డి, ప్రిన్సిపాల్ సయ్యద్‌నాగూర్‌వలి పరిశీలించారు. అనంతరం విద్యార్థులు ప్రత్యేక వేషధారణలతో అలరించారు. కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

మద్దిపాడు మండలంలో..

మద్దిపాడు: విద్యార్థులు సైన్స్‌పై ఆసక్తి పెంచుకోవాలని ఎంఈవో ఆంజనేయులు కోరారు. శుక్రవారం మద్దిపాడు కడియాల యానాదయ్య ప్రభుత్వ ఉన్నత పాఠశాల, నారాయణ హైస్కూల్, నాగార్జున హైస్కూల్‌తో పాటు బసవన్నపాలెం ఉన్నత పాఠశాల, తెల్లబాడు, గుండ్లాపల్లి, లింగంగుంట, పెద్దకొత్తపల్లి, ఇనమనమెళ్లూరు నేతాజీ హైస్కూల్‌లో జాతీయ సైన్స్ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఆయా కార్యక్రమాలలో మద్దిపాడు కడియాల యానాదయ్య హైస్కూలు హెచ్ఎం పెద్దిరెడ్డి కోటిరెడ్డి, ఎస్సై బి.శివరామయ్య, హెచ్ఎం మండవ ప్రభాకర్, నాగార్జున హైస్కూల్ కరస్పాండెంట్ ఏవీ.సుబ్బారావు, మాధవి, సురేష్, ఎంఈవో-2 ఎం.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

నాగులుప్పలపాడు మండలంలో..

నాగులుప్పలపాడు: జాతీయ సైన్స్ దినోత్సవం మండల పరిధిలోని పలు పాఠశాలల్లో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. మద్దిరాలపాడులోని శ్రీసూర్య విద్యానికేతన్‌లో డైరెక్టర్ రామాల వెంకట్రామిరెడ్డి ఆధ్వర్యంలో జరిగిన సైన్స్‌ఫెయిర్‌ను ఎంఈవో తిరుమలశెట్టి రవి పరిశీలించారు. కార్తికేయ అనే విద్యార్థి నీటి వృథాను అరికట్టే విధానాన్ని ప్రదర్శించి ప్రశంసలు అందుకొన్నారు. ఉప్పుగుండూరు సరస్వతి స్కూల్‌లో విద్యార్థుల ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. అమ్మనబ్రోలు విజ్ఞానభారతి హైస్కూల్‌లో విద్యార్థుల ప్రయోగాలను కెనరాబ్యాంక్ మేనేజరు ఏడుకొండలు పరిశీలించారు.

ఘనంగా టైలర్స్‌డే



ఒంగోలులో కేక్ కట్ చేస్తున్న మహిళలు

ఒంగోలు(రూరల్), ఫిబ్రవరి28(ఆంధ్రజ్యోతి): ప్రజలకు అవసరమైన అధునాతన దుస్తుల తయారీపై శిక్షణ ఇస్తున్నట్లు జనశిక్షణ సంస్థాన్ ప్రోగ్రామ్ ప్రతినిధి శ్యామ్ సునీల్ పేర్కొన్నారు. ఒంగోలులోని జనశిక్షణ సంస్థాన్ కార్యాలయంలో శుక్రవారం టైలర్స్ డేను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు అవసరమైన మోడల్స్‌లో దుస్తులు తయారీపై శిక్షణ ఇస్తామని, అనంతరం స్వయంగా కుట్టుకేంద్రాలు ఏర్పాటు చేసుకుని స్వయం ఉపాధి పొందవచ్చని చెప్పారు. కార్యక్రమంలో ఇన్‌స్పెక్టర్ ఎం.నాగమల్లేశ్వరి, మహిళలు పాల్గొన్నారు.

నాగులుప్పలపాడు: ఉప్పుగుండూరులో శుక్రవారం టైలర్స్ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. టైలర్స్ యూనియన్ ఆధ్వర్యంలో బొడ్డురాయి సెంటర్ వద్ద జిల్లా ఉపాధ్యక్షుడు వల్లూరి వెంకట్రావు, రాచపూడి నరసింహారావు జెండాను ఎగురవేశారు. కుట్టుమిషన్, టైలర్స్‌డే సృష్టికర్తలు ఇలియస్ హోవే, కేఎం.స్వామి చిత్రపటాలకు నివాళులర్పించారు. కార్యక్రమంలో అమరా బాబు, ఉప్పుగుండూరి వెంకటేశ్వర్లు, దావులూరి సుబ్బారావు, ఇమ్మిశెట్టి రామస్వామి, పేరాల చెన్నకేశవులు, ఇమ్మిశెట్టి శ్రీనివాసరావు, పెనిగండ్ల వెంకటేశ్వర్లు, తెలగతోటి శామ్యూల్ పాల్గొన్నారు.

టంగుటూరు: టైలర్స్ డేను శుక్రవారం టంగుటూరులో ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా ర్యాలీ చేసి జెండాను ఆవిష్కరించారు. టైలర్ రాము తదితరులు పాల్గొన్నారు.

రీసర్వేతో భూసమస్యలకు పరిష్కారం

● ఆర్డీవో లక్ష్మీప్రసన్న


మాట్లాడుతున్న ఆర్డీవో లక్ష్మీప్రసన్న

మద్దిపాడు, ఫిబ్రవరి 28: ప్రభుత్వం చేపట్టిన భూసర్వేతో భూసమస్యలకు పరిష్కారం లభిస్తుందని ఆర్డీవో లక్ష్మీప్రసన్న పేర్కొన్నారు. శుక్రవారం మద్దిపాడు తహసీల్దార్ కార్యాలయంలో కొలచనకోట గ్రామంలో భూ సర్వేపై తహసీల్దార్ సృజన కుమార్‌తో ఆమె చర్చించారు. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ రెవెన్యూలో పలు సమస్యలు అధికంగా ఉన్నాయని, వాటి పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. రైతులు సర్వే టీం కొలతలు వేసేటప్పుడు తమ పొలాల వద్దకు వెళ్లి పట్టాదార్ పాస్ పుస్తకం, ఇతర ధృవపత్రాలు, లింక్ డాక్యుమెంట్లు, రిజిస్ట్రేషన్ స్టాంపులు అధికారులకు చూపాలని చెప్పారు. క్షేత్రస్థాయి సిబ్బంది నిర్లక్ష్యం విడిచి త్వరితగతిన సర్వే పూర్తి చేయాలని సూచించారు. సమన్వయంతో పనిచేసినప్పుడే మంచి గుర్తింపు వస్తుందన్నారు. కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

రెండు ఇసుక ట్రాక్టర్ల సీజ్

మద్దిపాడు, ఫిబ్రవరి 28(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలో అక్రమంగా ఇసుక తరలిస్తున్న రెండు ఇసుక ట్రాక్టర్లను శుక్రవారం పోలీసులు సీజ్ చేశారు. గుండ్లాపల్లి పారిశ్రామిక వాడలో ఇసుకను ఎటువంటి బిల్లులు లేకుండా తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను సీజ్ చేసి తదుపరి చర్యల నిమిత్తం డ్రైవర్లను తహసీల్దార్ సుజన్‌కుమార్ ముందు హాజరుపరిచారు.

పేదల సంక్షేమాన్ని విస్మరించిన ప్రభుత్వం

ఒంగోలు కలెక్టరేట్, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర శాసనసభలో ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో ప్రభుత్వం పేదల సంక్షేమాన్ని విస్మరించిందని సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ రాష్ట్ర అధికార ప్రతినిధి చిట్టిబాటి వెంకటేశ్వర్లు ఒక ప్రకటనలో ఆరోపించారు. గత ఎన్నికలముందు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఇచ్చిన అనేక హామీలకు ఎటువంటి కేటాయింపులు లేవన్నారు. రైతులు పండించిన పంటలకు ధరల స్థిరీకరణ నిధికి రూ.3వేల కోట్లు కేటాయించాల్సి ఉండగా కేవలం రూ.300 కోట్లు కేటాయించారని మండిపడ్డారు. వెలిగొండ ప్రాజెక్టుకు రూ.359 కోట్లు కేటాయించగా ఈ నిధులతో ఎప్పుడు పూర్తవుతుందని ఆయన ప్రశ్నించారు.

విద్యారంగానికి బడ్జెట్‌లో నిధుల కోత

ఒంగోలు కలెక్టరేట్, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీలో ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో విద్యారంగానికి కేవలం 10శాతం కేటాయింపులు చేయడం తగదని ఏపీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కేవీజీ.కీర్తి, రాష్ట్రమాజీ ఉపాధ్యక్షుడు వై.శ్రీనివాసులు, జిల్లా గౌరవాధ్యక్షుడు ఎ.అమ్మయ్య, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బివెంకట్రావు, బి.అశోక్‌కుమార్, ఐఫియా కౌన్సిలర్లు పీవీ.సుబ్బారావు, ఎం.రాఘవరావు ఒక ప్రకటనలో ఆరోపించారు. కొఠారి కమిషన్ సిఫార్సుల మేరకు 30శాతం కేటాయింపులు చేయాలని కోరారు.

పర్యావరణాన్ని పరిరక్షించుకోవాలి

ఒంగోలు కలెక్టరేట్, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): రోజు రోజుకు పెరుగుతున్న ఉష్ణోగ్రతలను, వాతావరణ మార్పులను అరికట్టకపోతే భూమిపై మానవ మనుగడ ప్రశ్నార్థకంగా మారుతుందని, అందువల్ల పర్యావరణాన్ని పరిరక్షించుకోవాలని జనవిజ్ఞాన వేదిక జిల్లాగౌరవ సహాలదారు ఏవీ.పుల్లారావు పేర్కొన్నారు. స్థానిక ప్రజాసంఘాల కార్యాలయంలో శుక్రవారం జేవీవీ 37వ ఆవిర్భావదినోత్సవం నిర్వహించారు. ముందుగా పతాకాన్ని పుల్లారావు ఆవిష్కరించారు. అనంతరం జిల్లా ప్రధానకార్యదర్శి జయప్రకాష్ అధ్యక్షతన జరిగిన సభలో నాయకులు డి.వీరాంజనేయులు, ఎస్‌వీ.రంగారావు, ఆర్.వెంకట్రావు, నల్లూరి వెంకటేశ్వరరావు, ఎన్‌టీ.వెంకటేష్, చంద్రశేఖర్, నాగేశ్వరరావు, మెజీషియన్ రామన్, జి.హరిబాబు, ఎం.చంద్రశేఖర్, కె.పద్మశ్రీ, దార్ల శ్రీను, కేఎఫ్‌బాబు, వీరస్వామి, ఎస్‌వీ.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

హెడ్‌కానిస్టేబుల్‌కు సత్కారం

ఒంగోలు క్రైం, ఫిబ్రవరి28(ఆంధ్రజ్యోతి): పోలీసుశాఖలో సుదీర్ఘ కాలం పనిచేసి శుక్రవారం ఉద్యోగ విరమణ చేసిన హెడ్‌కానిస్టేబుల్ కె.డేవిడ్‌రాజును ఎస్పీ ఏఆర్.దామోదర్ సత్కరించారు. స్థానిక జిల్లా పోలీసు కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఎస్పీ మాట్లాడుతూ డేవిడ్‌రాజు చేసిన సేవలను కొనియాడారు. 42 ఏళ్లుగా అనేక విధులు విజయవంతంగా నిర్వర్తించిన డేవిడ్‌రాజును పలువురు అభినందించారు కార్యక్రమంలో ఏఎస్పీ కె.నాగేశ్వరరావు, ఏఆర్ ఏఎస్పీ అశోక్‌బాబు, డీఎస్పీ ఆర్.శ్రీనివాసరావు, ఏఆర్ డీఎస్పీ శ్రీనివాసరావు, ఆర్‌ఐలు రమణారెడ్డి, సీతారామరెడ్డి, ఏఆర్ ఎస్సై తిరుపతిస్వామి తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా శ్రీఅంగాళపరమేశ్వరి ఉత్సవం

టంగుటూరు, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి) : టంగుటూరులోని రావూరి సోమయ్యనగర్‌లో ఉన్న శ్రీఅంగాళపరమేశ్వరి ఉత్సవం వైభవంగా జరిగింది. శుక్రవారం అమ్మవారు ప్రత్యేక అలంకరణలో దర్శనమిచ్చారు. మహాకుంభ నైవేద్యం సమర్పించారు. భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు.

కార్మికులను ప్రైవేటు ఏజెన్సీలకు అప్పగించొద్దు

ఒంగోలు కలెక్టరేట్, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): మునిసిపల్ కార్మికులను ప్రైవేటు ఏజెన్సీలకు అప్పగించకుండా చర్యలు తీసుకోవాలని ఏపీ మునిసిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ నాయకులు కోరారు. శుక్రవారం స్థానిక కలెక్టరేట్‌లో డీఆర్వో చినఓబులేషును కలిసి ఈమేరకు వినతిపత్రం అందజేశారు. జిల్లాలో సుమారు 3వేల మంది వరకు మునిసిపల్ కార్మికులు విధులు నిర్వహిస్తున్నారని, వారందరూ ఆప్కాస్‌లో ఎక్కువ మంది పని చేస్తున్నారన్నారు. అయితే ఆప్కాస్ నుంచి కార్మికులను ప్రైవేటు ఏజెన్సీలకు అప్పగించేందుకు కుట్రలు చేస్తున్నారని, అందువల్ల దీనిని అడ్డుకునేవిధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు కె.శ్రీనివాసరావు, కె.సామ్రాజ్యం, టి.విజయమ్మ, జి.నరసింహ, వై.రవికుమార్, ఆర్.శ్రీనివాసరావు, ఎం.బాబు, పి.దివ్య, భారతి, కుమారి పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యే తవనం చెంచయ్యకు నివాళి

సంతనూతలపాడు, ఫిబ్రవరి 28(ఆంధ్రజ్యోతి): మాజీ ఎమ్మెల్యే తవనం చెంచయ్య వర్ధంతిని శుక్రవారం పేర్నమిట్ట పరిధి లోని పీర్లమాన్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కార్యదర్శి షేక్ మాబు మాట్లాడుతూ చెంచయ్య వ్యవసాయ, కార్మిక ఉద్యమాన్ని జిల్లావ్యాప్తంగా నిర్మించడంలో ముఖ్యపాత్ర పోషించారని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు బి.సుబ్బారావు, పెద్దబ్బాయ్, రామక్రిష్టారెడ్డి, మీరావలి, మహమ్మద్, మస్తాన్‌బి తదితరులు పాల్గొన్నారు.

చెత్తసంపద కేంద్రాలను అందుబాటులోకి తేవాలి

సంతనూతలపాడు, ఫిబ్రవరి 28(ఆంధ్రజ్యోతి): మండలంలోని చెత్తసంపద కేంద్రాలను రెండువారాల్లోకి అందుబాటులోకి తీసుకురావాలని ఎంపీడీవో సురేష్‌బాబు ఆదేశించారు. శుక్రవారం సంతనూతలపాడు చెత్తసంపద కేంద్రం వద్ద ఆయన మొక్కలను నాటేందుకు గుంతలను తవ్వించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో ఇళ్ల వద్ద నుంచి సేకరించిన చెత్తను వర్మికంపోస్టును తయారుచేసేందుకు వినియోగిస్తారని తెలిపారు. క్లాప్‌మిత్రల ద్వారా చెత్తసేకరణ కార్యక్రమం ఉంటుందన్నారు. కార్యక్రమంలో పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

నేరాల నియంత్రణకు పటిష్ట చర్యలు : డీఎస్పీ

సింగరాయకొండ, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి) : నేరాల నియంత్రణకు పటిష్ట చర్యలు చేపట్టాలని పోలీసు సిబ్బందికి ఒంగోలు డీఎస్పీ రాయపాటి శ్రీనివాసరావు సూచించారు. వార్షిక తనిఖీల్లో భాగంగా ఆయన శుక్రవారం సింగరాయకొండ పోలీసే స్టేషన్‌ను సందర్శించారు. స్టేషన్‌లోని రికార్డులను, పరిసరాలను క్షుణ్ణంగా పరిశీలించారు. అనంతరం లాకప్, ప్రాపర్టీ, రికార్డులను భద్రపరిచే గదులను చూశారు. డీఎస్పీ వెంట ఎస్సై బి.మహేంద్ర, సీఐ చావా హాజరత్తయ్య ఉన్నారు.

అవీ..ఇవీ

డ్రగ్స్ రహిత రాష్ట్రమే ప్రభుత్వ లక్ష్యం

● సీఐ వెంకటరెడ్డి



డ్రగ్స్ వినియోగంతో కలిగే అనర్థాలపై అవగాహన ర్యాలీ ప్రారంభిస్తున్న సీఐ

మార్కాపురం రూరల్, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి). డ్రగ్స్ రహిత రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్ చేయడమే ప్రభుత్వ లక్ష్యమని ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ సీఐ వెంకటరెడ్డి తెలిపారు. మండలంలోని రాయవరం గ్రామంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన డ్రగ్స్ రహిత రాష్ట్రం కార్యక్రమంలో బాగంగా గ్రామంలో ర్యాలీ నిర్వహించి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ డ్రగ్స్, గంజాయి మీ పరసరాలలో ఎవరైనా సరఫరా చేస్తున్నట్లు తెలిస్తే వెంటనే తమకు తెలియజేయాలని కోరారు. మత్తు పదార్ధాల వాడకం వలన యువత తమ భవిష్యత్‌ను ప్రశ్నార్ధకం చేసుకుంటున్నారని అటువంటి వారి పై వారి తల్లిదండ్రులు జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. మత్తు పదార్ధాల వాడకం ద్వారా అనేక నేరాలు, అ సాంఘీక కార్యకలాపాలు అధిక మవుతున్నాయని ఆ కారణంగా కొన్ని కుటుంబాలు ఆర్థికంగా ఇబ్బందులను ఎదుర్కొంటున్నాయని తెలిపారు. డ్రగ్స్ సరఫరా చేస్తున్న వారి సమాచారం తెలిపిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎక్సైజ్‌శాఖ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వంతోనే ముస్లింలకు మేలు



షేక్ రసూల్ మహ్మద్

పొదిలి, ఫిబ్రవరి 28 ఆంధ్రజ్యోతి) : ముస్లింలకు ఎంతో అండగా కూటమి ప్రభుత్వం నిలిచిందని ముస్లిం మైనిరిటీ సెల్ జిల్లా అధ్యక్షులు షేక్ రసూల్ మహ్మద్ అన్నారు. శుక్రవారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. అసెంబ్లీలో ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో ఏపీ చరిత్రలో ఎన్నడు లేని విధంగా రూ.5434కోట్లు కేటాయించడంపై హర్షం వ్యక్తం చేశారు. అందుకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్‌కు కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపించేందుకు ఈ బడ్జెట్ ఎంతో ఉపయోగపడుతుందన్నారు. మైనారిటీల అభివృద్ధికి టీడీపీ ప్రభుత్వం ఎప్పుడు తోడ్పాటును అందిస్తుందన్నారు.

ఎస్సీల అభివృద్ధికి రూ.20,281కోట్లు

ఎస్సీల అభివృద్ధికి బడ్జెట్‌లో రూ.20281కోట్లు కేటాయించడం ఆనందంగా ఉందని నగరపంచాయతీ టీడీపీ ఎస్సీసెల్ అధ్యక్షులు జ్యోతిమల్లికార్జున్ అన్నారు. ఎస్సీలపట్ల కూటమి ప్రభుత్వం చూపిన ఆదరణను మరువలేమన్నారు. ఎస్సీల అభివృద్ధికి కృషి చేస్తున్న ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడికి, పవన్‌కల్యాణ్, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌లకు ఎస్సీల తరపున కృతజ్ఞతలు తెలిపారు.

విశిష్ట గుర్తింపుకార్డుతో రైతులకు మేలు



కార్యక్రమంలో మాట్లాడుతున్న దర్శి ఏడీఏ బాలాజీనాయక్

పొదిలి, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి) : ప్రతి రైతు తప్పకుండా ప్రభుత్వ విశిష్ట గుర్తింపు సంఖ్య పొందాలని దర్శి ఏడీఏ బాలాజీ నాయక్ కోరారు. శుక్రవారం కాటూరివారిపాలెం గ్రామంలో స్థానిక రైతుసేవ కేంద్రంలో రైతులకు ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వం ప్రవేశపెట్టే సంక్షేమ పథకాలు పొందేందుకు వ్యవసాయశాఖ నుంచి గుర్తింపు సంఖ్యను పొందాలన్నారు. కనుక ప్రతి ఒక్కరు పట్టాదార్ పాస్‌బుక్, ఆధార్‌కార్డు ఆధార్‌కార్డ్‌కు లింక్ అయిన ఫోన్ నెంబరుతో గుర్తింపు సంఖ్యను పొందవచ్చన్నారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కందిపంటకు ప్రభుత్వం కనీస మద్దతు ధరను రూ.7550గా ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో వ్యవసాయ ప్రాథమిక కొనుగోలు కేంద్రాల ద్వారా రైతుల నుండి కందుల కొనుగోలు చేస్తామన్నారు. అదేవిధంగా రబీలో సాగుచేసిన పంటలకు ఈ-క్రాప్, ఈకేవైసీ పూర్తి చేసుకోవాలని సూచించారు. తక్కువ పెట్టుబడితో పండించే వివిధరకాల పంటల గురించి ఆయన రైతులకు వివరించారు. కార్యక్రమంలో ఏవో షేక్ జైన్‌లాబ్దిన్, ఎంపీఈవో విజయకుమారి, రైతులు పాల్గొన్నారు.

రహదారికి మరమ్మతులు



రహదారికి మరమ్మతు చేస్తున్న స్థానికులు

గిద్దలూరు, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): సిమెంటు రోడ్డు మధ్యలో పడిన గుంతలను పూడ్చి ప్రమాదాల నుంచి కాపాడాలని పట్టణంలోని బ్రిటన్ రోడ్డులో నివసిస్తున్న ప్రజలు పలు పర్యాయాలు అధికారులకు విన్నవించుకున్నారు. అధికారులు పట్టించుకోకపోవడంతో ఆప్రాంతంలోని యువకులు నడుం బిగించి సిమెంటు రోడ్డు కుంగిన ప్రాంతంలో సొంతంగా గుంతలను సిమెంటు, కంకర, ఇసుక వేసి పూడ్చుకున్నారు. మేముసైతం ముందుకు వచ్చిన యువతను వాహన చోదకులు అభినందిస్తున్నారు.

నేడు రౌండ్ టేబుల్ సమావేశం

మార్కాపురం, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): పూలసుబ్బయ్య వెలిగొండ ప్రాజెక్టు జలాలు, మార్కాపురం జిల్లా సాధన కోసం మార్చి 1న శనివారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో రౌండ్ టేబుల్ సమావేశం జరుగనున్నట్లు నిర్వాహక కమిటీ నాయకులు పీవీ కృష్ణారావు, చెన్ను శివప్రసాదరావులు తెలిపారు. కార్యక్రమంలో రాజకీయ, ప్రజా సంఘాలు, పాల్గొంటారని తెలిపారు.

ల్యాబ్‌లను పరిశీలించిన డీఎంవో



ల్యాబ్‌ను పరిశీలిస్తున్న మధుసూదనరావు

పొదిలి, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): పొదిలి మండల కేంద్రంలోని పట్టణ ప్రాథమిక ఆరోగ్యకేంద్రం, ప్రాంతీయ వైద్యశాల, మండలంలోని ఉప్పలపాడులోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోని ల్యాబ్‌లను శుక్రవారం జిల్లా మలేరియా అధికారి మధుసూదనరావు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ల్యాబ్ టెక్నీషియన్‌ల వద్ద మలేరియాకు సంబంధించి ప్రతి రికార్డు ఉండాలన్నారు. అదే విధంగా ల్యాబ్‌లో జరిగే మలేరియా పరీక్షలు ఇతర పరీక్షలకు సంబంధించి ఎస్‌వోపీలు ఉండాలన్నారు. ప్రభు త్వం నిర్ధేశించిన రక్తపరీక్షలు అన్ని చేయాలన్నారు. కార్యక్రమంలో వైద్యులు డాక్టర్ ఎం.సుగుణ్‌కుమార్, డాక్టర్ శరత్‌చంద్ర, సీహెచ్‌సీ వైద్యులు, సబ్ యూనిట్ అధికారులు కృష్ణ, వెంకారెడ్డి, ల్యాబ్‌టెక్నీషియన్‌లు పాల్గొన్నారు.

శాస్త్రీయ దృక్పథంతోనే సమాజ వికాసం

- వివిధ పాఠశాలల్లో సైన్స్ ఫెయిర్
- ఆకట్టుకున్న విద్యార్థుల సైన్స్ ప్రదర్శనలు



మార్కాపురం, తర్లుపాడులో విద్యార్థులు తయారు చేసిన నమూనాలు

మార్కాపురం వన్‌టౌన్, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): శాస్త్రీయ దృక్పథంతోనే సమాజ వికాసం సాధ్యమని డీఎస్పీ నాగరాజు అన్నారు. స్థానిక రాక్‌వెల్ పాఠశాలలో సైన్స్‌డేను పురస్కరించుకుని శుక్రవారం సైన్స్ ఎక్స్‌పో నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు నిర్వహించిన వివిధ ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో ఎంఈఓ రాందాస్ నాయక్, పాఠశాల డైరెక్టర్ వెన్నా నాగార్జునరెడ్డి, ప్రిన్సిపాల్ నవీన్ కుమార్‌లు పాల్గొన్నారు. జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు ఎం.చంద్రశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో జాతీయ సైన్స్ దినోత్సవం నిర్వహించారు. మొట్టమొదటి భారతీయ నోబెల్ బహుమతి గ్రహిత సర్ సీవీ రామన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. వాసవీ పాఠశాలలో డైరెక్టర్ రంగయ్య ఆధ్వర్యంలో సీవీ.రామన్ చిత్రపటానికి నివాళులర్పించారు. జీఎంఆర్ పాఠశాలలో ప్రిన్సిపాల్ జి.మల్లికార్జునరెడ్డి ఆధ్వర్యంలో విద్యార్థులు ప్రదర్శించిన వివిధ ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. సాయి చైతన్య హైస్కూల్‌లో ప్రిన్సిపాల్ శ్రీనివాస్, కరస్పాండెంట్ చంద్రశేఖర్‌ల ఆధ్వర్యంలో సైన్స్‌ఫెయిర్ నిర్వహించారు. కమలా ఉన్నత పాఠశాలలో పాఠశాల వైస్ ఛైర్మన్ పెనుగొండ పవన్‌కుమార్ వైజ్ఞానిక ప్రదర్శన ప్రారంభించారు. ప్రిన్సిపాల్ పుల్లయ్య, పాఠశాల అకడమిక్ డైరెక్టర్ సింధూజ పాల్గొన్నారు. శ్రీ చైతన్య పాఠశాలలో ఏ1 గ్లోబల్ ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ శ్రీధర్ సైన్సుప్రదర్శన ప్రారంభించారు. ప్రిన్సిపాల్ ఏ.ఆదినారాయణ, డీన్ శ్రీనివాసులు, ఏట కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పెద్దదోర్నాల : స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ సావిత్రీ ఆధ్వర్యంలో, చిన్నదోర్నాల మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలో ప్రధానోపాధాయులు మండ్ల శ్రీనివాసులు అధ్యక్షతన జాతీయ సైన్స్ దినోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. వేడుకల్లో భాగంగా సీవీ.రామన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం భౌతికశాస్త్ర అధ్యాపకులు కే.విజయబాబు మాట్లాడు తూ సీవీ.రామన్ ప్రపంచానికి చేసిన సేవలను గుర్తు చేశారు. ఈ క్రమంలో 1929లో బ్రిటీష్ ప్రభుత్వం నైట్‌హుడ్ బిరుదును ప్రధానం చేశారన్నారు. 1930లో నోబెల్ బహుమతి, 1954లో భారతదేశ అత్యున్నత పురస్కారం భారతరత్నతో గౌరవించారన్నారు. సైన్స్‌లో విద్యార్థులు అద్భుతాలు సృష్టించవచ్చన్నారు. ఆయా కార్యక్రమాల్లో ఐక్యూ ఏసీ కో-ఆర్డినేటర్ శ్రీనివాసాచార్యులు, అధ్యాపక సిబ్బంది, ఉపాధ్యాయ సిబ్బంది కెజియారాణి, పాఠశాల ఛైర్మన్ సుబ్బారావు పాల్గొన్నారు.

శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించాలి

పొదిలి : విద్యార్థులలో చిన్నతనం నుంచే శాస్త్రీయ దృక్పథాన్ని ప్రశ్నించేతత్వాన్ని పెంపొందించాలని జన విజ్ఞాన వేదిక రాష్ట్ర నాయకులు కే.సుబ్రహ్మణ్యం అన్నారు. జేవీవీ ఆవిర్భవ దినోత్సవం సందర్భంగా బాలుర ఉన్నత పాఠశాలలో జెండా ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రజలలో ఉన్న మూఢనమ్మకాలను రూపుమాపడానికి జేవీవీ కార్యకర్తలు కృషి చేయాలన్నారు. కొనకనమిట్ల వైద్యాధికారి బాలయ్య మాట్లాడుతూ సైన్స్‌ద్వారానే సమాజ అభివృద్ధి సాధ్యమన్నారు. దాని వలన అంతరాలు లేని సమాజాన్ని నిర్మించుకోవచ్చన్నారు. కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా అధ్యక్షులు అబ్దుల్‌హై నాయకులు బాలవెంకటేశ్వర్లు, జేవీవీ నాయకులు తోట శ్రీనివాసులు, గోనే శ్రీను, జె వెంకటేశ్వర్లు, అంజనేయ చౌదరి, ఎన్జీవో సంఘ నాయకులు శ్రీనివాసరెడ్డి, మదార్‌వలి, బేగ్ తదితరులు పాల్గొన్నారు.



పొదిలిలో జెండా ఆవిష్కరిస్తున్న జనవిజ్ఞాన వేదిక నాయకులు

సైన్స్ దినోత్సవ వేడుకలు

గిద్దలూరు : పట్టణంలోని విశ్వభారతి పాఠశాలలో సైన్స్‌దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు రూపొందించి ప్రదర్శించిన సైన్స్ ప్రాజెక్టులు ఆలోచింపజేశాయి. కార్యక్రమంలో కరస్పాండెంట్ జి.రంగస్వామిరెడ్డి, ప్రిన్సిపాల్ ఆదిలక్ష్మి, బీజేపీ నాయకులు పిడతల రమేష్‌రెడ్డి, దూదేకుల బాదుల్లా, తదితరులు పాల్గొన్నారు. రాచర్లలోని స్పందన విద్యాసంస్థల్లో సైన్స్ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. 35కు పైగా సైన్స్ ప్రాజెక్టులను విద్యార్థులు ప్రదర్శించారు.

తర్లుపాడు జడ్పీ ఉన్నత పాఠశాలలో..

తర్లుపాడు : తర్లుపాడులోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో, లింగారెడ్డి కాలనీ ప్రాథమిక పాఠశాలలో సైన్సు దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు పలు నమోనాలను తయారు చేసి ప్రదర్శించారు. లింగారెడ్డి కాలనీలోని ప్రాథమిక పాఠశాలలో 100 రాకెట్ల నమూనాను విద్యార్థులతో తయారు చేయించి ప్రదర్శించారు. ఈ నామూనాలను నవోదయ పాఠశాల ప్రిన్సిపాల్ గణేష్‌కుమార్ పరిశీలించి విద్యార్థులకు సైన్సుపట్ల అవగాహన కల్పించి పలు సందేహాలను నివృత్తి చేశారు. విద్యార్థులకు మంచి భవిష్యత్తుకు గుణాత్మక విద్యకు నవోదయ పాఠశాలలో చేరాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం షేక్ మౌలాలి, ఎం.సుధాకర్ బాబు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఘనంగా జాతీయ సైన్స్ దినోత్సవం

కంభం : దైనందిన జీవితంలో సైన్స్ ప్రాముఖ్యతను వివరించేందుకు జాతీయ సైన్స్ దినోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఇన్‌చార్జ్ హెచ్‌ఎం శ్రీనివాసరావు తెలిపారు. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శుక్రవారం జాతీయ సైన్స్ దినోత్సవ సంబరాలను స్ఫూర్తిదాయకంగా నిర్వహించారు. ముందుగా సీవీ.రామన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో సైన్స్ ఉపాధ్యాయులు కిరణ్‌కుమార్, పాండు రంగబాబు, పలువురు ఉపాధ్యాములు పాల్గొన్నారు.

ఉత్సాహంగా ఎడ్ల బలప్రదర్శన పోటీలు

ప్రారంభించిన టీడీపీ ఇన్‌చార్జ్ ఎరిక్షన్‌బాబు



పోటీలను ప్రారంభిస్తున్న ఎరిక్షన్‌బాబు

త్రిపురాంతకం, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి) : మహాశివరాత్రి ఉత్సవాల్లో భాగంగా రథోత్సవం సందర్భంగా త్రిపురాంతకంలోని ఆలయాల సమీపంలో శుక్రవారం ఒంగోలు జాతి ఎడ్లబలప్రదర్శన పోటీలు నిర్వహించారు. పోటీలను ఎర్రగొండపాలెం టీడీపీ ఇన్‌చార్జ్ గూడూరి ఎరిక్షన్‌బాబు ప్రారంభించారు. అనంతరం జరిగిన పోటీలలో ప్రొద్దుటూరుకు చెందిన డి.గురివిరెడ్డి, రమేష్‌బాబుయాదవ్‌ల ఎడ్ల జతకు మొదటి బహుమతి, జిల్లెలకు చెందిన జి.ధనుష్‌రెడ్డి బుల్స్ రెండో బహుమతి, పీవీఎస్ఆర్ వీరాస్వామి చౌదరి జత మూడో బహుమతి, పెసరవాయికి చెందిన సయ్యద్ కలాం బాషా ఎడ్ల జత నాలుగో బహుమతి సాధించాయి. బొడిచర్లకు చెందిన తండి నక్షత్రరెడ్డి ఎడ్లజత ఐదో బహుమతి, వైపాలెంకు చెందిన నజీర్‌భాషా జత ఆరో బహుమతి, పీవీఎస్ఆర్ వీరాస్వామి(2) జత ఏడో బహుమతి, జెనీ.అగ్రహారంకు చెందిన లక్కు మునీశ్వరయ్య జత ఎనిమిదో బహుమతి సాధించాయి. అనంతరం విజేతలకు బహుమతులు అందజేశారు.

దర్జీలను ప్రభుత్వం ఆదుకోవాలి



జెండాను ఆవిష్కరిస్తున్న దర్జీలు

పొదిలి, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి) : దర్జీలను ప్రభుత్వం అన్నివిధాల ఆదుకోవాలని దర్జీల సంఘం నాయకులు అన్నారు. దర్జీల దినోత్సవం సందర్భంగా పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు పుల్లయ్య మాట్లాడుతూ చేతివృత్తులపై ఆధారపడి జీవనం సాగిస్తున్నామన్నారు. దర్జీల అభివృద్ధికి ప్రభుత్వం చేయూత అందించాలని కోరారు. అదేవిధంగా అర్హులైన దర్జీల జీవనోపాధి కోసం రుణాలు మంజూరు చేయాలన్నారు. వారి అభివృద్ధికి నైపుణ్య శిక్షణ ఇప్పించాలన్నారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి సుధాకర్, కోశాధికారి మస్తాన్‌వలి, నాయకులు ఖలీల్, బికారి, ఖాశింపీర, వెంకటేశ్వర్లు, వెంకట్రావు, అల్లాభక్షు పాల్గొన్నారు.

టైలర్స్ కార్పొరేషన్ ఏర్పాటుకు కృషి

ఎర్రగొండపాలెం రూరల్ : టైలర్స్ కార్పొరేషన్ ఏర్పాటుకు తనవంతు కృషి చేస్తానని ఎర్రగొండపాలెం టీడీపీ ఇన్‌చార్జ్ గూడూరి ఎరిక్షన్ బాబు అన్నారు. శుక్రవారం టైలర్స్‌డే సందర్భంగా స్థానిక టైలర్స్ కార్యాలయంలో వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు ముఖ్య అతిథిగా ఎరిక్షన్‌బాబు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మనిషిని ఆందంగా తీర్చిదిద్దేవి దుస్తులే అన్నారు. ఎంతో ఆందంగా కుట్టి హుందాగా కనిపించే విధంగా చేస్తారన్నారు. అలాంటి దుస్తులను తయారు చేసే దర్జీల బతుకులు దుర్భరంగా ఉన్నాయన్నారు. వారి సంక్షేమానికి కార్పొరేషన్ ఏర్పాటు, ఆరోగ్య బీమా, రాయితీ తదితర అంశాలపై రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, మంత్రి నారాలోకేష్ దృష్టికి తీసుకెళతానన్నారు. భవన నిర్మాణం కోసం తనవంతుగా లక్ష రూపాయలు నిధులు అందిస్తానన్నారు. అలాగే నివేశన స్థలాలు ఏర్పాటుకు కృషి చేస్తానన్నారు. నివాసాలలో టైలరింగ్ చేస్తున్న మహిళలను గుర్తించాలని వారికి ఉచిత శిక్షణ, ఉచిత కుట్టు మిషన్‌లను అందజేస్తామన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షులు కే.మల్లికార్జున, పట్టణ అధ్యక్షులు జి.వెంకటాచారీ, షేక్ ఇస్మాయిల్, షేక్ మస్తాన్ వలి, ఎస్.రామయ్య, ఓ వెంకటేశ్వర్లు, టీడీపీ మండల అధ్యక్షులు చేకూరి సుబ్బారావు, కంచర్ల సత్యనారాయణ గౌడ్, వేగినాటి శ్రీను, మంత్రునాయక్, మహేష్‌నాయుడు, వెంగళ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మిరపతోటలో కొండచిలువ కలకలం



పామును పట్టుకున్న స్నేక్ క్యాచర్

ఎర్రగొండపాలెం రూరల్, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పాత గోళ్ల విడిపి గ్రామంలోని శ్రీను అనే రైతు మిరప తోటలో కొండ చిలువ కలకలం రేపింది. ఈ ఘటన శుక్రవారం చోటు చేసుకొంది. రైతు తెలిపిన వివరాల మేరకు మిరపతోట పక్కన చెట్ల పొదల్లో శబ్దం రావడంతో ఆ ప్రాంతంలో పరిశీలించారు. కొండచిలువ కదులుతు కనిపించడంతో భయాందోళనకు గురై స్నేక్‌క్యాచర్ మల్లికార్జునకు సమాచారం అందించారు. అక్కడికి చేరుకున్న మల్లికార్జున కొండ చిలువను పట్టుకున్నాడు. 10 అడుగులు ఉందని అటవీ ప్రాంతంలో వదిలేయనున్నట్లు ఆయన తెలిపారు.

రైతుసేవా కేంద్రాల సందర్శన



యంత్రపరికరాలను పరిశీలిస్తున్న అధికారులు

కంభం, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ఇచ్చిన వ్యవసాయ ఉపకరణాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ఆత్మ పీడీ విజయనిర్మల, ఏవో శ్రీనివాసనాయక్‌లు సూచించారు. శుక్రవారం సాయంత్రం కంభం మండలంలోని 12 గ్రామాలలో రైతుసేవా కేంద్రాలలోని వ్యవసాయ ఉపకరణాలను పరిశీలించారు. కార్యక్రమంలో ఏవో స్వరూప, వ్యవసాయ విస్తరణాధికారి శివగంగ ప్రసాద్, వ్యవసాయ సహాయకులు, గ్రూపు సభ్యులు పాల్గొన్నారు.

ఘనంగా వీరభద్రుని కల్యాణం



కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

తర్లుపాడు, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): తర్లుపాడులో వెలసిన శ్రీ భద్రకాళి సమేత వీరభద్ర స్వామివారి కల్యాణం శుక్రవారం వైభవంగా నిర్వహించారు. వేద పండితులు మైలుటూరి రంగనాథశర్మ, కృష్ణశర్మ, దేవులపల్లి పవన్‌కుమార్‌శర్మ, భార్గవ్‌శర్మల ఆధ్వర్యంలో స్వామివారికి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. స్వామి అమ్మవార్లకు శాస్త్రోక్తంగా కల్యాణం నిర్వహించారు. ముందుగా గణపతి పూజ, నవగ్రహ, సుదర్శన సహిత రుద్రహోమం, పూర్ణాహుతి కార్యక్రమాలు నిర్వహించారు. అమ్మ వారిని వీరభద్ర స్వామి విగ్రహాలను కళ్యాణ మండపం నుంచి పైకి తీసు కొచ్చి కల్యాణ మహోత్సవం చేశారు. భక్తులు భారీగా తరలివచ్చి ఉత్సవాన్ని తిలకిం చారు. ఉభయ దాతలు నేరెళ్ల వెంకట్ కుమార్, నేరెళ్ల పవన్‌కుమార్ దంపతులు పీటలపై కూర్చొని కల్యాణం నిర్వహించారు. భక్తులకు అన్న ప్రసాద వితరణ చేశారు. కార్యక్రమంలో ఆలయ సింగల్ ట్రస్ట్ చైర్మన్ నేరెళ్ల సాంబశివరావు, మల్లికార్జునరావు, భక్తులు పాల్గొన్నారు. సాయంత్ర ఉత్సవ మూర్తులకు తర్లుపాడు వీధుల్లో అంగరంగ వైభవంగా గ్రామోత్సవం నిర్వహించారు. భక్తులు వార్లు పోసి కాయకర్పూరాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. గ్రామోత్సవానికి ముందు పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.



గజవాహనంపై గంగాదరుడు

గంగాధరునికి గజ వాహన సేవ

మార్కాపురం వన్‌టౌన్: పట్టణంలోని జగదాంబ సమేత మార్కండేశ్వరస్వామి ఆలయంలో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఈ సందర్భంగా ఆలయ ప్రధాన అర్చకులు ఏలూరి ఆంజనేయ శర్మ, రెంటచింతల వరుణ్‌తేజ శర్మలు మార్కండేశ్వర స్వామికి, జగదాంబకు ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. శుక్రవారం సాయంత్రం సార్వభౌమ అలంకారంలో గంగాధరునికి గజతోత్సవం నిర్వహించారు. గజవాహనంపై ఊరేగుతున్న స్వామిని దర్శించుకుని భక్తులు పూజలు చేశారు. ఈవో చెన్నకేశరెడ్డి కార్యక్రమాలు పర్యవేక్షించారు.

నేటి నుంచి ఇంటర్ పరీక్షలు

● నాలుగు పరీక్ష కేంద్రాలలో నిర్వహణ



ప్రభుత్వ జూనియర్ కళాశాల

ఎర్రగొండపాలెం రూరల్, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): ఇంటర్ పరీక్షలకు అధికారులు తగు ఏర్పాట్లు చేశారు. మండలంలో మొత్తం నాలుగు సెంటర్ల లో పరీక్షలు నిర్వహించనున్నారు. వాటిలో ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 285 మంది, విజ్ఞాన్ కళాశాలలో 390 మంది, ఏపీ గురుకుల కళాశాల, గౌతమి కళాశాలలో 391 మంది చొప్పున పరీక్షలు రాయనున్నారు. ఆయా పరీక్ష కేంద్రాల వద్ద విద్యార్థులకు అన్ని సౌకర్యాలు ఏర్పాటు చేశారు.

విద్యార్థులు సృజనాత్మకతను పెంపొందించుకోవాలి



చిన్నారులు రూపొందించిన ప్రాజెక్టులను పరిశీలిస్తున్న మాజీ మంత్రి సురేష్

పొదిలి, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి) : విదార్థులు చిన్నతనం నుండే సృజనాత్మకతను పెంపొందించుకోవాలని మాజీ మంత్రి ఆదిమూలపు సురేష్ అన్నారు. శుక్రవారం స్థానిక నిర్మలా కాన్వెంట్ స్కూల్లో ఏర్పాటు చేసిన సైన్స్‌ఫేర్ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. పాఠశాల స్థాయి నుండి విద్యార్థులు ఆటలు, పాటలతోపాటు సృజనాత్మక ఆలోచన సరళిని అలవాటు చేయాలన్నారు. వారి వారి రంగాల్లో నైపుణ్యాన్ని ప్రదర్శిస్తేనే మంచి గుర్తింపు ఉంటుందన్నారు. అనంతరం విద్యార్థులు తయారు చేసిన పలు రకాల ప్రాజెక్టులను పరిశీలించారు.

గోసంరక్షణకు చర్యలు తీసుకోవాలని వినతి



వినతిపత్రం అందజేస్తున్న బీజేపీ నాయకులు

మార్కాపురం, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో విచ్చలవిడిగా తిరుగుతున్న గోవుల సంరక్షణకు చర్యలు తీసుకోవాలని మార్కాపురం టౌన్ ఎస్సై ఎమ్.సైదుబాబుకు శుక్రవారం బీజేపీ నాయకులు వినతిపత్రం అందజేశారు. ప్రధానంగా పట్టణంలో యథేచ్ఛగా తిరుగుతున్న గోవులను స్థానిక మున్సిపాలిటీ కార్యాలయం పక్కన నీళ్లట్యాంకు వద్దకు చేర్చినా అక్కడ నిర్వహణ సక్రమంగా ఉండడం లేదన్నారు. దీంతో గోవులు చనిపోతున్నాయన్నారు. వాటిని పట్టణానికి దూరంగా గోశాలలకు తరలిస్తేనే రక్షణ ఉంటుందన్నారు. మండలంలోని రాయవరం గ్రామ సమీపంలో మాజీ సర్పంచ్ ఏర్పాటు చేసిన గోశాలకు వాటిని తరలిస్తే ఎలాంటి ఇబ్బందులు ఉండవని సూచించారు. వినతిపత్రం అందజేసిన వారిలో జిల్లా కిసాన్‌మోర్చా అధ్యక్షులు బొంతల కృష్ణ, జిల్లా కార్యదర్శి మొర్రిబోయిన చిన్నయ్య, జిల్లా మహిళా మోర్చా ప్రధాన కార్యదర్శి మద్దెల లక్ష్మి, సీనియర్ నాయకులు సుబ్బారావు పాల్గొన్నారు.

పీడీ మురళీకృష్ణకు ఘనసన్మానం

కంభం, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): కంభం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పనిచేస్తున్న ఫిజికల్ డైరెక్టర్ మురళీకృష్ణ శుక్రవారం ఉద్యోగ విరమణ చేస్తున్న సందర్భంగా సీఎల్ఆర్ విద్యాసంస్థల అధ్యాపకులు ఘనంగా సన్మానించారు. డైరెక్టర్ శిరిగిరి బ్రహ్మం మాట్లాడుతూ విద్యార్థుల శ్రేయస్సుకు మురళీకృష్ణ పాటుపడ్డారన్నారు. అనంతరం మురళీకృష్ణను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో అధ్యాపకులు వెంకటనారాయణ, ముక్తేశ్వరరావు, రవికుమార్, శ్రీనివాసరరెడ్డి, జేవీవీ నాయకులు రమణరెడ్డి, అధ్యాపకుల బృందం పాల్గొంది.

హుండీ ఆదాయం రూ.5.99లక్షలు

పొదిలి, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): శ్రీపార్వతీ సమేత నిర్మమహేశ్వరస్వామి హుండీ ఆదాయం రూ.5.99లక్షల వచ్చినట్లు దేవస్థాన ఈవో నర్రా నారాయణరెడ్డి తెలిపారు. రథోత్సవం అనంతరం గురువారం రాత్రి అర్చకులు, దేవాదాయశాఖ సిబ్బంది, గ్రామ పెద్దల సమక్షంలో హుండీని లెక్కించారు. గత ఏడాది రూ.5.17లక్షలు రాగా, ఈ ఏడాది రూ.82వేలు పెరిగిందన్నారు. బ్రహ్మోత్సవాలకు సహకరించిన అధికారులకు ధన్యవాదాలు తెలిపారు.

ముఖాముఖి

21 పంచాయతీల్లో 32 గోకులం షెడ్లు

కె.నాగరాజు, ఏపీవో, ముండ్లమూరు



ప్రశ్న: మండలంలో ఎన్ని గోకులం షెడ్లు నిర్మించారు?

జవాబు: 21 పంచాయతీల పరిధిలో 32 గోకులం షెడ్లు నిర్మించాం. ఒక్కో షెడ్డు నిర్మాణం కోసం రూ 2.30 లక్షలు మంజూరు చేశాం. ఇంకా పశు పోషకులు ముందుకువచ్చినట్లయితే మరికొన్నింటిని మంజూరుచేస్తాం.

ప్ర: ఫారం పాండ్స్ ఎన్ని ఏర్పాటుచేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు?

జ: 21 గ్రామ పంచాయతీల పరిధిలో సన్న, చిన్నకారు రైతులకు వెయ్యి ఫారం పాండ్స్ లక్ష్యంగా నిర్ణయించాం. పెద్దవి రూ.మూడు లక్షలు, చిన్నవి రూ. రెండు లక్షలుగా నిర్ణయించాం.

ప్ర: ఫారం పాండ్స్‌తో రైతులకు ఎలాంటి మేలు జరుగుతుంది?

జ: ఫారం పాండ్స్‌తో ఆరు తడి పంటలైన మామిడి, సపోట, జామ, బత్తాయి దీర్ఘకాలిక పంటలకు నీటి ఎద్దడిని నివారించవచ్చు.

ప్ర: కూటమి ప్రభుత్వంలో ఎన్ని కోట్లతో సిమెంట్ రోడ్లు, మురుగు కాలువలు నిర్మించారు?

జ: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఎనిమిది నెలల కాలంలో ఉపాధి హామి నిధులతో రూ. 3 కోట్లు నిధులు వెచ్చించి సిమెంట్ రోడ్లు, మురుగు కాలువలు నిర్మించాం. ఇంకా కొన్ని పంచాయతీల్లో పనులు జరుగుతున్నాయి.

ప్ర: ఉపాధి హామి పథకం కూలీలకు ఎలాంటి ఇన్సూరెన్స్ పథకం వర్తిస్తుంది?

జ: ఈశ్రమ పథకం కింద జాబ్ కార్డు ఉన్న ప్రతి ఉపాధి కూలీ రూ.130 చెల్లించాలి. వీరికి ఏదైనా ప్రమాదం సంభవిస్తే రూ.2 లక్షలు ప్రమాద బీమా కింద అందుతుంది.

పసుపుగల్లులో ముమ్మరంగా పారిశుధ్య కార్యక్రమాలు

ముండ్లమూరు, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పసుపుగల్లులో ముమ్మరంగా పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టారు. గ్రామంలో లోపించిన పారిశుధ్యం శీర్షికన శుక్రవారం ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనానికి పంచాయతీ అధికారులు స్పందించారు. గ్రామంలోని పలు వీధులను పంచాయతీ కార్మికులతో శుభ్రపరిచారు. ప్రధాన వీధుల్లో పేరుకుపోయిన మురుగునీరు, గడ్డిని తొలగించారు. ఇంకా పలు వీధుల్లో పారిశుధ్య కార్యక్రమాలు నిర్వహిస్తామని పంచాయతీ కార్యదర్శి మౌలాలి తెలిపారు.

ఘనంగా సైన్స్‌డే వేడుకలు

పామూరు, ఫిబ్రవరి 28(ఆంధ్రజ్యోతి): స్థానిక సెయింట్ మార్క్స్ పాఠశాలలో శుక్రవారం జాతీయ సైన్స్ డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా సీవీ రామన్ చిత్రపటానికి కరస్పాండెంట్ ఎం.జయకుమార్ పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు. అలాగే సీఎస్‌పురం మండలంలోని ఉప్పలపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సైన్స్‌డే వేడుకలు నిర్వహించారు. విద్యార్థులు ప్రతి విషయాన్ని పరిశీలించి విషయ అవగాహన పెంచుకోవాలని హెచ్‌ఎం షేక్ నాయబ్‌రసూల్ సూచించారు. కార్యక్రమంలో కమ్మనేతి వెంకటేశ్వర్లు, ఎల్.ఆంథోని, రామయ్య, జేఎస్ ఆనంద్‌బాబు, డి.పున్నమ్మ, తదితరులు పాల్గొన్నారు.

నేడు అడివి పేరంటాలమ్మ తిరునాళ్ల

పీసీపల్లి, ఫిబ్రవరి 28(ఆంధ్రజ్యోతి): మండలంలోని మురుగుమ్మి గ్రామంలో శనివారం అడివి పేరంటాలమ్మ తిరునాళ్ల నిర్వహిస్తున్నారు. రాత్రికి గ్రామోత్సవం నిర్వహిస్తారు. ఈ తిరునాళ్లను మురుగుమ్మి గ్రామస్థులతోపాటు జంగాలపల్లి, నేరేడుపల్లి గ్రామాల్లోనూ అత్యంత వైభవంగా జరుపుకునేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

చలివేంద్రం ప్రారంభం

దర్శి, ఫిబ్రవరి 28(ఆంధ్రజ్యోతి): దర్శి పట్టణంలోని పోలేరమ్మ గుడి వద్ద ఎస్‌ఎంఎస్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో దివంగత జిల్లా జనసేన నాయకుడు షేక్ ఇర్షాద్ జ్ఞాపకార్థం శుక్రవారం మంచినీటి చలివేంద్రాన్ని ఏర్పాటుచేశారు. టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి చలివేంద్రాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో టీడీపీ నియోజకవర్గ నాయకుడు డాక్టర్ లలిత్‌సాగర్, దర్శి నగర పంచాయతీ చైర్మన్ నారపుశెట్టి పిచ్చయ్య, జిల్లా జనసేన నాయకుడు వి.నాగరాజు పాల్గొన్నారు.

మార్చి 31లోగా విశిష్ట సంఖ్యను నమోదు చేయించుకోవాలి

సీఎస్‌పురం(పామూరు), ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): ఫార్మర్ రిజిస్ట్రీ నమోదు చేసుకొనేందకు ప్రభుత్వం మార్చి 31వరకు గడువు పెంచినట్లు ఏవో బి.సంపత్‌కుమార్ తెలిపారు. మండలంలోని అంబవరం, కొత్తపల్లి గ్రామాల్లో శుక్రవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతు విశిష్ట సంఖ్యతో కలిగే ప్రయోజనాల గురించి రైతులకు వివరించారు. కార్యక్రమంలో వ్యవసాయవిస్తరణాధికారి పావలి శ్రీనివాసులు, రైతులు పాల్గొన్నారు.

నూరు శాతం ఉత్తీర్ణతే లక్ష్యం

- ఆదిశగా విద్యార్థులకు తర్ఫీదు ఇవ్వాలి
- పదో తరగతిలో మెరుగైన ఫలితాలు సాధించాలి
- ఉపాధ్యాయులకు డీఈవో కిరణ్‌కుమార్ సూచన



కేజీబీవీలో పదో తరగతి విద్యార్థినులతో మాట్లాడుతున్న డీఈవో కిరణ్‌కుమార్

ముండ్లమూరు, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి పరీక్షల్లో నూరు శాతం ఉత్తీర్ణతే లక్ష్యంగా విద్యార్థులకు తర్ఫీదు ఇవ్వాలని డీఈవో కిరణ్‌కుమార్ ఉపాధ్యాయులకు సూచించారు. శుక్రవారం ముండ్లమూరులోని కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయం, ఏపీ మోడల్ స్కూల్, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను ఆయన సందర్శించారు. ఆయా పాఠశాలల్లో పదో తరగతి చదువుతున్న విద్యార్థులతో మాట్లాడారు. మార్చి 17 నుంచి జరిగే పబ్లిక్ పరీక్షల్లో ప్రతి విద్యార్థి కష్టపడి చదివి ఉత్తీర్ణత సాధించాలన్నారు. మెరుగైన ఫలితాలు సాధించి తల్లిదండ్రులు, ఉపాధ్యాయులకు మంచిపేరు తీసుకురావాలన్నారు. ఈసందర్భంగా విద్యార్థుల శక్తి సామర్థ్యాలను పరిశీలించారు.

అనంతరం ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులతో మాట్లాడారు. తక్కువగా ఉన్న సమయాన్ని సద్వినియోగపరుచుకొని ప్రతి పాఠశాలలో అదనంగా తరగతులు నిర్వహించి నూరు శాతం ఉతీర్ణతే లక్ష్యంగా చూడాలన్నారు. అందుకు ప్రత్యేక తరగతులు తీసుకోవాల్సిన అవసరం కూడా ఉందన్నారు. విద్యార్థులు, తల్లిదండ్రుల కష్టసుఖాలను తెలుసుకోవటంతో పాటు వారు మీపై పెట్టుకున్న నమ్మకాన్ని నిలబెట్టాలన్నారు. ప్రతి పాఠశాల నుంచి ఎక్కువ మంది విద్యార్థులు ట్రిపుల్‌ఐటీకి ఎంపికయ్యేవిధంగా చదివించాలన్నారు. ప్రైవేట్ పాఠశాలల కంటే ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులే ఎక్కువ మార్కులు సాధించాలన్నారు. మండలంలో మొత్తం ఎనిమిది పాఠశాలకు సంబంధించి 450 మంది విద్యార్థులు పదో తరగతి పరీక్షలు రాస్తున్నారని ఆయన తెలిపారు. అనంతరం పాఠశాలల పరిసరాలను, వంట గదులను పరిశీలించారు.

కార్యక్రమంలో కేజీబీవీ ప్రిన్సిపాల్ ఆవుల సునీత, ఏపీ మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ కె.పూర్ణచంద్రరావు, ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు మాధవీలత, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

చెత్త సంపద కేంద్రాల ద్వారా పంచాయతీల అభివృద్ధి

- డీఎల్‌పీవో పద్మ



తాళ్లూరులో చెత్తసంపద తయారీ కేంద్రాన్ని పరిశీలిస్తున్న డీఎల్‌పీవో పద్మ

ముండ్లమూరు, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): చెత్త సంపద కేంద్రాల ద్వారా వచ్చే ఆదాయంతో గ్రామాల్లో మౌలిక వసతులు సమకూరుతాయని డీఎల్‌పీవో ఆర్. పద్మ అన్నారు. శుక్రవారం మండలంలోని పూరిమెట్ల, ఉమామహేశ్వర అగ్రహారం గ్రామాలను సందర్శించారు. చెత్తసంపద కేంద్రాలను పరిశీలించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ ప్రతి గ్రామ పంచాయతీలో గ్రీన్ అంబాసిడర్ల ద్వారా వీధుల్లో ఉన్న చెత్తాచెదారాన్ని సేకరించి చెత్త సంపద కేంద్రాల్లో వేయాలన్నారు. దీనిద్వారా వచ్చే ఎరువుతో ఆదాయం సమకూరుతుందన్నారు. తద్వార గ్రామాభివృద్ధికి అవసరమైన వసతులను ఏర్పాటుచేసుకోవచ్చునని చెప్పారు. గ్రామాల్లో పచ్చదనం, పరిశుభ్రత ఎంతో ముఖ్యమన్నారు. పరిశుభ్రత లోపిస్తే వ్యాధులు సంభవిస్తాయన్నారు. గ్రీన్ అంబాసిడర్లు తడి చెత్త, పొడి చెత్త వేర్వేరుగా సేకరించి చెత్త సంపద కేంద్రాలకు తరలించాలన్నారు. వర్మి కంపోస్టు ఏర్పడిన తరువాత ఆ ఎరువును ఎక్కువ మంది రైతులు కొనుగోలుచేసి పండ్ల తోటలకు, వివిధ రకాల పంటలకు వినియోగించుకుంటారన్నారు. అనంతరం గ్రామ సచివాలయాలను సందర్శించి సిబ్బందితో మాట్లాడారు. సిబ్బంది సక్రమంగా విధులు నిర్వహించాలన్నారు. రానున్న వేసవి కాలాన్ని దృష్టిలో పెట్టుకొని గ్రామాల్లో తాగునీటి ఎద్దడి సమస్య లేకుండా చూడాలని పంచాయతీ కార్యదర్శులను ఆదేశించారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు ఒగులూరి రామాంజీ, వేముల శ్రీనివాసులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

'కేంద్రాలను వినియోగంలోకి తీసుకొస్తున్నాం'

తాళ్లూరు, ఫిబ్రవరి 28(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లోని చెత్తసంపద తయారీ కేంద్రాలకు మరమ్మతులు చేయించి వినియోగంలోకి తీసుకొస్తున్నట్టు డీఎల్‌పీవో పద్మ తెలిపారు. తాళ్లూరు గ్రామంలో మరమ్మతులు చేస్తున్న చెత్తసంపద తయారీ కేంద్రాన్ని శుక్రవారం ఆమె పరిశీలించారు.

ఈసందర్భంగా మాట్లాడుతూ చెత్తసంపద తయారీ కేంద్రాలు వాడుకలో లేనందున పూర్తిగా దెబ్బతిన్నాయన్నారు. నిధులు సమకూర్చి చెత్తసంపద కేంద్రాలకు మరమ్మతులు చేస్తున్నట్టు చెప్పారు. త్వరలో వాటిల్లో సేంద్రియ ఎరువును తయారుచేసి విక్రయిస్తే పంచాయతీకి ఆదాయవనరుగా ఉంటుందన్నారు. గ్రామాల్లో ఇంటి పన్నులను వేగవంతంగా వసూళ్లు చేయాలన్నారు. పారిశుధ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. అనంతరం ఎంపీడీవో కార్యాలయం, తాళ్లూరు సచివాలయాన్ని సందర్శించారు. కార్యక్రమంలో సర్పంచ్ మేకల చార్లెస్ సర్జన్, పంచాయతీ కార్యదర్శి ఐవీ రమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పొదుపు మహిళలు సకాలంలో రుణాలు చెల్లించాలి



మాట్లాడుతున్న ఏపీఎం దేవరాజ్

తాళ్లూరు, ఫిబ్రవరి 28(ఆంధ్రజ్యోతి): పొదుపు మహిళలు రుణాలు తిరిగి చెల్లించాలని ఏపీఎం దేవరాజ్ పేర్కొన్నారు. స్థానిక స్త్రీశక్తి భవనంలో శుక్రవారం జరిగిన మండల మహిళా సమాఖ్య సమావేశానికి ఎంఎంఎస్ అధ్యక్షురాలు ఎం.సుజాత అధ్యక్షత వహించారు. దేవరాజ్ మాట్లాడుతూ తీసుకున్న రుణాలను సక్రమంగా చెల్లిస్తున్న పొదుపు మహిళలకు బ్యాంక్‌లు తిరిగి రుణాలు ఇస్తున్నట్టు చెప్పారు. ఒక్కో గ్రూపునకు రూ.15 లక్షల నుంచి రూ.20 లక్షల వరకు ఇస్తున్నట్టు చెప్పారు. మండలంలో 148 మహిళారైతు పొదుపు గ్రూపులు ఉన్నాయన్నారు. ఆగ్రూపులకు ప్రభుత్వం బ్యాంక్‌ల ద్వారా రుణాలు మంజూరు చేస్తుందని చెప్పారు. కొందరు పొదుపు మహిళలు సీఐఎఫ్, స్త్రీనిధి, ఎస్‌హెచ్‌జీ రుణాలు తీసుకుని చెల్లించకపోవడంతో మొండి బకాయిలుగా ఉన్నాయన్నారు. గ్రూపు సభ్యులు సమిష్టి బాధ్యతగా తీసుకుని బాకీలు వసూలు చేయించాలన్నారు. దర్శి ఏరియా కోఆర్డినేటర్ వసుంధరాదేవి మాట్లాడుతూ బ్యాంక్‌ల ద్వారా పలురకాల రుణాలను ప్రభుత్వం అందజేస్తుందని చెప్పారు. రుణాలు సక్రమంగా చెల్లిస్తున్నందున పొదుపు గ్రూపులకు బ్యాంక్‌లు ఎలాంటి హామీ పత్రం లేకుండా లక్షలాది రూపాయల రుణాలు ఇస్తున్నాయన్నారు. వాటిని సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా వృద్ధి చెందాలన్నారు. కార్యక్రమంలో సీసీలు మోహన్‌రావు, సుచిత్ర, సీవో కుమారి తదితరులు పాల్గొన్నారు.

మహిళలు ఆర్థిక స్వావలంబన సాధించాలి



కేకు కట్ చేసిన మహిళలు

కనిగిరి, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): స్వయం ఉపాధి కల్పనతో పాటు ఆర్థిక స్వావలంబన దిశగా మహిళలు ఎదిగేందుకు ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర చూపించిన చొరవ, పాత్ర మరువలేనిదని తెలుగు మహిళా నాయకురాలు కరణం అరుణమ్మ అన్నారు. శుక్రవారం ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి నిర్వహిస్తున్న కుట్టుమిషన్ శిక్షణ కేంద్రంలో టైలర్స్ డే సందర్భంగా వేడుకలు నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళలు స్వయం ఉపాధి వైపు సాగేందుకు ఉచిత కుట్టుమిషన్ శిక్షణ ఎంతో ఉపయోగపడుతుందన్నారు. మహిళలకు ఉచితంగా కుట్టుమిషన్ నేర్పించటమే కాకుండా వారికి ఉచితంగా కుట్టు మిషన్‌ను ఇచ్చి వారి ఆర్థిక పురోగతికి డాక్టర్ ఉగ్ర బాటలు వేస్తున్నారన్నారు. ఆయన ఆశయానికి ప్రతి ఒక్కరూ వారి స్వయం శక్తిపై ఎదిగి ఎమ్మెల్యేకు రుణపడి ఉండాలన్నారు. కార్యక్రమంలో కుట్టుమిషన్ శిక్షకులు ధనలక్ష్మి, అరుణ, యాస్మిన్, తెలుగుమహిళలు షేక్ వాజిదా బేగం, తులసి, దొరసాని, నారాయణమ్మ, తదితరులు పాల్గొన్నారు.

ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా బడ్జెట్



దర్శి, ఫిబ్రవరి 28(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా కూటమి ప్రభుత్వం ప్రజారంజక బడ్జెట్‌ను ప్రవేశపెట్టిందని టీడీపీ నియోజకవర్గ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. అమరావతి, పోలవరం నిర్మాణాలకు, వ్యవసాయ రంగానికి అధిక ప్రాధాన్యత ఇచ్చి అధిక నిధులు కేటాయించటం సంతోషదాయకమన్నారు. రాష్ట్రం ఆర్థికంగా ఎన్నో ఇబ్బందుల్లో ఉన్నప్పటికీ సుదీర్ఘ అనుభవం కలిగిన సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ సారథ్యంలో ఆర్థికశాఖ మంత్రి పయ్యావుల కేశవ్ అద్భుతమైన బడ్జెట్ రూపొందించారని ప్రశంసించారు. గతంలో ఎన్నడూలేని విధంగా రూ.3.22 లక్షల కోట్ల భారీ బడ్జెట్‌ను ప్రవేశపెట్టి అన్నివర్గాల ప్రజల అభ్యున్నతికి ప్రాతినిధ్యం కల్పించారని వివరించారు.

జామాయిల్ కర్ర లారీ స్వాధీనం



పోలీసులు స్వాధీనం చేసుకున్న జామాయిల్ కర్ర లారీ

వెలిగండ్ల, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి) మండలంలోని అక్షయ గోల్డ్ భూముల్లో ఉన్న జామాయిల్ తోటల్లో గుర్తు తెలియని వ్యక్తులు యథేచ్ఛగా కర్రను నరికి లారీల్లో తరలిస్తూ లక్షలు దండుకుంటున్నారు. వెలిగండ్ల గ్రామ శివారు ప్రాంతలో సర్వే నెంబర్ 138, 140, 150, 1509 సర్వే నెంబర్‌ల్లో అక్షయ గోల్డ్ భూములు ఉన్నాయి. శుక్రవారం గుర్తు తెలియని వ్యక్తులు జామాయిల్ నరికి లారికి లోడ్ చేస్తుండగా వెలిగండ్ల గ్రామస్థులు 100కు డయల్ చేశారు. సీఐ భీమానాయక్ ఆదేశాలతో ఏఎస్ఐ జిలాని భాషా సిబ్బందితో కలిసి సంఘటనాస్థలానికి చేరుకున్నారు. జామాయిల్ కర్రను లోడ్ చేస్తున్న లారీని, పదిమంది కూలీలను అదుపులోకి తీసుకొని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ జామాయిల్ కర్ర నరికివేతలో ఎవరెవరి హస్తం ఉందో విచారణ చేపట్టి కేసు నమోదు చేస్తామని ఎస్సై మధుసూదన్ రావు తెలిపారు

పరిసరాల పరిశుభ్రతతోనే వ్యాధులు దూరం

కనిగిరి, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): పరిసరాల పరిశుభ్రతతో వ్యాధులు దరిచేరవని జిల్లా వైద్యఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ టి.వెంకటేశ్వర్లు అన్నారు. శనివారం పట్టణంలోని శంకవరంలో ఇంటింటి సర్వే నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన ఆప్రాంతాన్ని పరిశీలించారు. వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలకు దోమల నివారణకు తీసుకోవాల్సిన చర్యలపై అవగాహన కల్పించారు. ఇంటి నివేశ ప్రాంతాల్లో నీటి నిల్వలు ఉన్నట్లయితే మున్సిపల్ పారిశుధ్య సిబ్బందిని పిలిపించి శుభ్రం చేయించాలన్నారు. చెడిపోయిన కూలర్లు, పాడైన టైర్లు, కొబ్బరి బొండాలు, నీటినిల్వ తొట్టెలను పరిశీలించి వాటిని తొలగించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా మలేరియా నివారణాధికారి మధుసూదన్ రావు, సిబ్బంది రామాంజనేయులు, సూపర్‌వైజర్ ఉమామహేశ్వరరావు, శానిటరీ సెక్రటరీ రమణయ్య, ఏఎన్‌ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

దర్శి పట్టణాభివృద్ధికి కృషి

దర్శి, ఫిబ్రవరి 28(ఆంధ్రజ్యోతి): దర్శి పట్టణ అభివృద్ధికి సమగ్రమైన బడ్జెట్‌ను పెట్టినట్టు నగర పంచాయతీ చైర్మన్ నారపుశెట్టి పిచ్చయ్య తెలిపారు. శుక్రవారం స్థానిక నగర పంచాయతీ కార్యాలయంలో జరిగిన కౌన్సిల్ సమావేశంలో 2024-25 వార్షిక బడ్జెట్‌ను ప్రవేశపెట్టారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్నివార్డుల అభివృద్ధి, మౌలిక వసతుల ఏర్పాటును దృష్టిలో ఉంచుకొని బడ్జెట్‌ను రూపొందించినట్టు చెప్పారు. ఈ బడ్జెట్‌లో రూ.7,38,77,500 కోట్ల ఆదాయం వస్తున్నట్లు అంచనా వేశారు. వివిధ పనులకు వ్యయం చేసేందుకు రూ.5,11,30,000 బడ్జెట్‌ను కేటాయించారు. బడ్జెట్ తీర్మానాన్ని సభ్యులు ఏకగ్రీవంగా ఆమోదించారు. కార్యక్రమంలో కమిషనర్ వై.మహేశ్వరరావు, వైస్‌చైర్మన్లు జి.స్టీవెన్, తలారి కోటయ్య, సభ్యులు పాల్గొన్నారు.

ట్రాక్టర్ ఢీకొని వృద్ధుడికి తీవ్రగాయాలు

కనిగిరి, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): మోపెడ్‌పై వెళ్తున్న వృద్ధుడిని ట్రాక్టర్ ఢీకొట్టడంతో తీవ్రగాయాలైన ఘటన మండలపరిధిలోని కంచర్లవారిపల్లి వద్ద జరిగింది. లింగారెడ్డి కొత్తపల్లికి చెందిన కొండా ఆదినారాయణరెడ్డి బల్లిపల్లి అడ్డరోడ్డు నుంచి స్వగ్రామానికి వెళుతున్నాడు. ఈక్రమంలో వెనుకనుంచి ట్రాక్టర్ ఢీ కొట్టడంతో తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు అందించిన సమాచారంతో 108 వాహనం ద్వారా కనిగిరి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడినుంచి మెరుగైన వైద్యం కోసం స్థానిక ప్రయివేటు ఆసుపత్రిలో చేర్పించి చికిత్స అందిస్తున్నారు. ఈవిషయంపై తమకు ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.



టీడీపీ సభ్యత్వ కార్డులను అందజేస్తున్న పువ్వాడి

టీడీపీ కార్డుతో కార్యకర్త కుటుంబానికి భరోసా

పామూరు, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): సభ్యత్వాలతో కార్యకర్తల కుటుంబాలకు భరోసా కల్పిస్తున్న ఏకైక పార్టీ టీడీపీయేనని ఆపార్టీ మండల అధ్యక్షుడు పువ్వాడి వెంకటేశ్వర్లు అన్నారు. శనివారం స్థానిక టీడీపీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మండలంలో 85 సంవత్సరాల వయసు కలిగిన ధనేంకుల వెంకటరామయ్య టీడీపీ సభ్యత్వాన్ని రెన్యూవల్ చేసుకోవడం అభినందనీయమన్నారు. ఈసందర్భంగా సభ్యత్వ కార్డును అయనకు అందజేశారు. సభ్యత్వాల నమోదులో టీడీపీ కార్యకర్తలు చేసిన కృషి ఫలితంగా రాష్ట్రంలో కనిగిరి నియోజకవర్గం 4వ ర్యాంక్ సాధించిందన్నారు. కార్యక్రమంలో నాయకులు అడుసుమల్లి ప్రభాకర్‌చౌదరి, సయ్యద్ అమీర్‌బాబు, బొల్లా నరసింహారావు, షేక్ ఖాజారహంతుల్లా, మల్లెబోయిన బాలబ్రహ్మయ్య, నల్లబోతుల వెంకటేశ్వర్లు, పందిటి హరీష్, బి.సత్యం, బి.మార్కు, వీరబాబు, జి.శ్రీను, షత్తు మస్తాన్, బీవీ నారాయణ, రసూల్, జి.మహేష్, ఆవుల రమణమ్మ, ఎం.రమాదేవి, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా టైలర్స్ డే వేడుకలు

పామూరు, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని టైలర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం టైలర్స్ డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. స్థానిక అయ్యప్ప స్వామి దేవస్థానం వద్ద సలాం కాలేషా, షేక్ నాగూర్, జి.రాజేష్‌లు జండాను ఆవిష్కరించారు. ఈసందర్భంగా యూనియన్ నాయకులు నెట్టూరి ఏసురత్నం మాట్లాడుతూ దర్జీలందరికీ ఇళ్ల స్థలాలతోపాటు టైలర్స్ కార్పొరేషన్ ఏర్పాటుచేసి రుణాలిచ్చి ఆదుకోవాలన్నారు. 50 సంవత్సరాలు దాటిన టైలర్స్‌కు పింఛన్లు మంజూరు చేయాలని కోరారు. కార్యక్రమంలో నెట్టూరి ఏసురత్నం, పిక్కిలి ప్రసాద్, శ్రీను పాల్గొన్నారు.

కురిచేడు: టైలర్స్ డే వేడుకలు శుక్రవారం కురిచేడు మండలంలో ఘనంగా జరిగాయి. కురిచేడు ప్రధాన కూడలిలో జండాను ఆవిష్కరించి అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో దర్జీల యూనియన్ మండల అధ్యక్షుడు దానం, ఉపాధ్యక్షుడు హుస్సేన్, కోశాధికారి శ్రీను, షేక్ మీరావలి, మహ్మద్ చాంద్, పీవీ చెన్నయ్య, అంజి, పిల్లావలి, వలి, బాందు, నాగూర్, బ్రహ్మం తదితరులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో వ్యక్తికి గాయాలు

పామూరు, ఫిబ్రవరి 28(ఆంధ్రజ్యోతి): బోర్ పాయింట్ వేసేందుకు ప్రయత్నిస్తుండగా ప్రమాదశాత్తు విద్యుత్ తీగలు తగిలి వ్యక్తికి గాయాలయ్యాయి. మండలంలోని బొట్లగూడూరు గ్రామంలోని బీసీ కాలనిలో శుక్రవారం బోరు వేస్తున్న సమయంలో బోరు మిషన్‌కు పైన ఉన్న 33 కేవీ లైన్ విద్యుత్ తీగలు ప్రమాదవశాత్తు తగిలాయి. ఈప్రమాదంలో బాలాజీ నాయక్ అనే బోర్ పాయింట్ కార్మికుడికి షాక్‌కు గురై గాయపడ్డాడు. స్థానిక ప్రభుత్వ వైద్యశాలలో ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం 108 వాహనం ద్వారా కందుకూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

నారాయణస్వామి హుండీ ఆదాయం రూ.28 లక్షలు

సీఎస్‌పురం (పామూరు) ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): సీఎస్‌పురం మండలంలో ప్రముఖ పుణ్యక్షేత్రమైన మిట్టపాలెం శ్రీనారాయణస్వామి దేవస్థానానికి మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల సందర్భంగా రూ.27,95,012 ఆదాయం వచ్చినట్లు ఈవో నరసింహాబాబు తెలిపారు. గత ఏడాది కంటే ఈఏడాది అదనంగా రూ.4,02,555 వచ్చినట్లు తెలిపారు. హుండీల ద్వారా రూ.16,86,692, టిక్కెట్ల అమ్మకం ద్వారా రూ.2,83,280, లడ్డూ ప్రసాదం అమ్మకం ద్వారా రూ.2,42,910, అన్నదానం విరాళాల ద్వారా రూ.2,93,717, మహాప్రాకార నిర్మాణానికి విరాళాలద్వారా రూ.1,07,717, ఉభయదాతల విరాళాలు రూ.1,80,696లు వచ్చాయని తెలిపారు.

టీడీపీ నేత వెంగయ్యకు సన్మానం

సీఎస్‌పురం(పామూరు), ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): టీడీపీ మండల అధ్యక్షుడు బొమ్మనబోయిన వెంగయ్య న్యాయవృత్తిలో డాక్టరేట్ సాధించారు. ఈసందర్భంగా మిట్టపాలెం శ్రీనారాయణస్వామి కాకతీయ అన్నదాన కమ్మ సత్రం కమిటీ తరుపున శుక్రవారం ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో అన్నదానసత్ర ప్రధాన కార్యదర్శి పాములపాటి మాధవప్రసాద్, ఉపాధ్యక్షులు చావా లక్ష్మీనారాయణ, చావా తిరుపాలు, పిన్నెకల లక్ష్మయ్య, పాలపర్తి నారాయణరావు, చావా వెంకటసుబ్బయ్య నాయుడు, గుదె నారాయణ, టి.వెంకటయ్య, గుర్రం వెంకటేశ్వర్లు, వల్లూరి త్రిపురాంతకం పాల్గొన్నారు.

మహనీయుల ఆశయ సాధనకు కృషిచేయాలి

పామూరు, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): మహనీయుల ఆశయ సాధనకు కృషి చేయాలని సీపీఎం నేత సయ్యద్ హనీఫ్ పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక సుందరయ్య భవన్‌లో సీపీఎం మాజీ ఎమ్మెల్యేలు నూరా పాపిరెడ్డి, తవనం చెంచయ్య, పమిటి కోటయ్య వర్ధంతి కార్యక్రమాలు నిర్వహించారు. వారి చిత్ర పటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. నాయకులు కె.మాల్యాద్రి, షేక్ పాపిరెడ్డిపల్లి మిరావలి, కె.శంకర్, సీహెచ్ వెంకటేశ్వర్లు, వై.వీరనారాయణ, షేక్ అల్లాభక్ష్, ఎస్.పిచ్చిరెడ్డి, రామయ్య, తదితరులు పాల్గొన్నారు.

మోడల్ స్కూల్‌లో సైన్స్ దినోత్సవం

ముండ్లమూరు, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): ముండ్లమూరులోని ఏపీ మోడల్ స్కూల్‌లో శుక్రవారం సైన్స్ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు సైన్స్ నమూనాలను ప్రదర్శించారు. డీఈవో కిరణ్‌కుమార్ నమూనాలను పరిశీలించి విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ పూర్ణచంద్రరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కష్టపడి చదివి ఉన్నతస్థాయికి చేరుకోవాలి

తాళ్లూరు, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నతస్థాయికి చేరుకోవాలని ఏబీసీ హైస్కూల్ ప్రిన్సిపాల్ కె.వెంకట్రావు అన్నారు. శుక్రవారం స్థానిక ఏబీసీ ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు వీడ్కోలు సభ నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు ఏకాగ్రతతో చదివి పదో తరగతిలో మంచి మార్కులు సాధించాలన్నారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ టి.శ్రీనివాసరెడ్డి, డైరెక్టర్ కె.కాలేషా బాబు, ఎస్ఏ చిన్నయ్య, కొండలరావు, వెంకట్రావు, విక్రమ్, పాల్గొన్నారు.

చట్టాలపై ప్రతిఒక్కరూ అవగాహన కలిగిఉండాలి

ముండ్లమూరు, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): చట్టాలపై ప్రతిఒక్కరూ అవగాహన కలిగిఉండాలని తహసీల్దార్ ఎల్.లక్ష్మీనారాయణ అన్నారు. ఆయన శుక్రవారం రాత్రి ముండ్లమూరు ఎస్సీ కాలనీలో సివిల్స్ రైట్స్ డే కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఆర్ఐ పీఎస్ఆర్ మూర్తి, వీఆర్వో కె.దయానందం, తదితరులు పాల్గొన్నారు.

పశువైద్య విద్యార్థుల సమస్యలను పరిష్కరించాలి

కనిగిరి, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): వెటర్నరీ వైద్య విద్యార్థుల సమస్యలను పరిష్కరించాలని ఏఐవైఎఫ్, ఏఐఎస్ఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. ఈమేరకు శుక్రవారం ఆర్డీవోకు వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ 2013 నుంచి పశువైద్య విద్యార్థులను చెల్లిస్తున్న స్టైఫండ్‌ను జనరల్ మెడిసిన్ చదివే విద్యార్థులతో సమానంగా పెంచాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏఐవైఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పి.ప్రభాకర్, జిల్లా ఉపాధ్యక్షుడు సుబ్బారావు, పూర్ణచంద్రరాజు, పవన్‌కుమార్, గూడూరి సురేష్, ఖాసీం పీరా తదితరులు పాల్గొన్నారు.

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

బాపట్ల జిల్లా వార్తలు

5

శనివారం 1 మార్చి 2025





మంగళగిరి ఎయిమ్స్ ఆస్పత్రిలో శుక్రవారం కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ తనిఖీలు చేశారు. ఇన్‌పేషెంట్, అవుట్ పేషెంట్, ఎమర్జెన్సీ, ఆపరేషన్ థియేటర్లను ఆయన పరిశీలించారు. రోగులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు.

- మంగళగిరి సిటీ

అమరావతికి అగ్రతాంబూలం





















రూ.కోట్లలో కేటాయింపులు.. గతంలో నిలిచిపోయిన ప్రాజెక్టులతో పాటు కొత్త ప్రాజెక్టులకు నిధుల వరద. శుక్రవారం కూటమి ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో అమరావతికి అగ్రతాంబూలం దక్కింది. వైసీపీ ప్రభుత్వ హయాంలో అమరావతి అన్న పేరుకు.. రాజధాని పనుల అంశాలకే చోటు ఇవ్వకుండా సరిపెట్టారు. ఈ పరిస్థితుల్లో కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే అమరావతిపై దృష్టి పెట్టడంతో పాటు నిధులు కేటాయించింది. తొలిబడ్జెట్‌లో రూ.3 వేల కోట్లు కేటాయించగా తాజా బడ్జెట్‌లో రాజధాని పనులకు రూ.6 వేల కోట్లను ప్రత్యేకంగా కేటాయించింది. అంతేగాకుండా రాజధానిలోని వివిధ ప్రాజెక్టులకు నిధులు.. గతంలో నిలిచిపోయిన భూసేకరణకు కూడా ప్రత్యేకంగా నిధులు కేటాయింపులు జరగడంతో ఉమ్మడి గుంటూరు జిల్లావాసులతో పాటు రాజధాని రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

- గతంలో కంటే రాజధానికి రెట్టింపు నిధులు
- మార్చి 15 నుంచి జోరందుకోనున్న నిర్మాణ పనులు
- గుంటూరు ఛానల్ భూసేకరణకు రూ.100 కోట్లు
- ఆచార్య ఎన్జీ రంగా అగ్రి వర్సిటీకి రూ.507 కోట్లు
- గోదావరి - పెన్నా నదుల అనుసంధానానికి రూ.200 కోట్ల
- కూటమి ప్రభుత్వం బడ్జెట్ కేటాయింపులపై హర్షం

నదుల అనుసంధానికి ఊతం

గోదావరి - పెన్నా నదుల అనుసంధానం ప్రాజెక్టుని ముందుకు తీసుకెళ్లేందుకు కూటమి ప్రభుత్వం బడ్జెట్‌లో కేటాయింపులు జరిపింది. 2025-26 ఆర్థిక సంవత్సరానికి ఏకంగా రూ.200 కోట్ల మూలధనాన్ని కేటాయించి సాగునీటి రంగంపై తన చిత్తశుద్ధిని చాటుకున్నది. దీంతో వైసీపీ ప్రభుత్వ హయాంలో ఎక్కడికక్కడ నిలిచిపోయిన ఈ ప్రాజెక్టు పనులు మరికొద్ది రోజుల్లో పట్టాలెక్కి పరుగులు పెట్టనున్నాయి. ప్రాజెక్టు తొలిదశలో భాగంగా కృష్ణానది నుంచి నకరికల్లు వరకు గోదావరి వరద జలాలను ఎత్తిపోసి నాగార్జునసాగర్ కుడి కాల్వలో కలుపుతారు. పోలవరం ప్రాజెక్టుని 2027కి పూర్తి చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం చిత్తశుద్ధితో ఉన్నది. ఈ క్రమంలో పట్టిసీమ ఎత్తిపోతల పథకంతో సంబంధం లేకుండా గ్రావిటీ ద్వారా గోదావరి వరద నీటిని ప్రకాశం బ్యారేజ్‌కు తరలించనున్నారు. అక్కడి నుంచి ఐదు దశల్లో ఎత్తిపోతల పథకాలు, గ్రావిటీ ద్వారా ఏడు వేల క్యూసెక్కుల నీటిని నకరికల్లుకు తరలించి సాగర్ కాల్వలో కలిపేలా ప్రణాళిక రూపొందించారు. 2018లో సీఎంగా చంద్రబాబు ఉన్న సమయంలో రూ.6020.15 కోట్లకు పరిపాలన అనుమతులు మంజూరు చేసిన విషయం తెలిసిందే. తొలిదశ పనులకు సంబంధించి టీడీపీ హయాంలోనే భూసేకరణ పూర్తి చేసి, పనులు ప్రారంభించింది. అయితే వైసీపీ 2019లో అధికారంలోకి వస్తూనే వాటిని నిలిపేసి పల్నాడు కరువు దుర్భిక్ష పథకం అంటూ పేరు మార్చి మూలన పడేసింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక మళ్లీ పనులు ప్రారంభమయ్యాయి. వాటిని ముందుకు తీసుకెళ్లేందుకు ఈ బడ్జెట్‌లో నిధులు కేటాయించడంపై రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



గుంటూరు, సిటీ, విద్య, బాపట్ల, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం కొలువుదీరిన తర్వాత ప్రకటించిన పూర్తి స్థాయి బడ్జెట్ ఇదే కావడంతో అన్ని వర్గాల ప్రజలు ఎన్నో ఆశలు పెట్టుకున్నారు. అయితే వారి ఆశలు, ఆకాంక్షలకు అద్దం పట్టేలా ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ బడుగుల సంక్షేమానికి పెద్దపీట వేశారు. గుంటూరు, బాపట్ల, పల్నాడు జిల్లాలకు సంబంధించి పలు ప్రాజెక్టులకు పెద్దపీట వేస్తూ మంత్రి పయ్యావుల కేశవ్ బడ్జెట్‌ను ప్రవేశపెట్టారు. బడుగులపై బడ్జెట్లో ప్రభుత్వం వరాల వర్షం కురిపించడంపై కూడా ఆయా వర్గాల నుంచి హర్షం వ్యక్తమవుతోంది. పాఠశాలల్లో మౌలిక వసతులు, తల్లికి వందనం, డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం, విద్యాకిట్లు తదితర పథకాల కోసం పెద్దఎత్తున కేటాయింపులపై విద్యావేత్తలతో పాటు విద్యార్థుల తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఉమ్మడి గుంటూరు జిల్లాలో వందల సంఖ్యలో తరగతి గదుల నిర్మాణం నిలిచిపోగా, వాటి పునః ప్రారంభించడానికి బడ్జెట్ కేటాయింపులు చేయనున్నారు. ప్రధానంగా నాడు నేడు పేరుతో అసంపూర్తిగా ఉన్న భవనాల నిర్మాణం, తాగునీటి కోసం కొనుగోలు చేసిన ప్లాంట్స్ ఇన్‌స్టలేషన్, నూతన భవనాల నిర్మాణం తదితరాలకు నిధులు ఉపయోగించనున్నారు. ఇప్పటికే ఏర్పాటైన డిజిటల్ తరగతుల్ని మరింత ఆధునికంగా తీర్చిదిద్దడానికి ఏర్పాట్లు చేయనున్నారు. గత ప్రభుత్వ హయాంలో సంక్షేమ పథకాలు నిర్వీర్యమయ్యాయి. ఈ నేపథ్యంలో ప్రభుత్వం సంక్షేమానికి పెద్దఎత్తున బడ్జెట్‌లో నిధులు కేటాయించింది.

అమరావతికి.. రూ.6 వేల కోట్లు

నవ్యాంధ్ర కలల రాజధాని అమరావతికి రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేసింది. రాజధాని అభివృద్ధి కోసం కిందటి బడ్జెట్లో కేటాయించిన నిధుల కంటే ఈ బడ్జెట్లో రెట్టింపు కేటాయించింది. రాజధానిపై కూటమి ప్రభుత్వం చిత్తశుద్ధిని మరోమారు ప్రకటించింది. గత ఐదేళ్లుగా వైసీపీ ప్రభుత్వ నిర్లక్ష్యానికి గురై బడ్జెట్లో ప్రస్తావనకు కూడా నోచుకోని రాజధాని అమరావతి, కూటమి ప్రభుత్వ బడ్జెట్లలో అగ్రతాంబూలం అందుకుంది. కిందటి బడ్జెట్లో రూ.3వేల కోట్లు కేటాయించగా ఈసారి అమరావతి కేపిటల్ సిటీ డెవలప్మెంట్ ప్రాజెక్టుల కింద ఆ మొత్తాన్ని రూ.6 వేల కోట్లకు పెంచింది. ఇప్పటికే ఐకానిక్ టవర్స్‌గా ఉన్న సచివాలయ భవన సముదాయం, అసెంబ్లీ, హైకోర్టు భవనాల నిర్మాణ పనులు జోరందుకోనున్నాయి.

ఇప్పటికే ఆ పనులకు సంబంధించిన టెండర్ల ప్రక్రియ తుది దశకు చేరింది. అన్నీ సకాలంలో జరిగితే మార్చి 15 నుంచి రాజధాని నిర్మాణ పనులు మరింత జోరందుకోనున్నాయి. 2014- 19ల మధ్య ప్రాధాన్యతను సంతరించుకున్న మెట్రో రైలు ప్రాజెక్టు వైసీపీ హయాంలో ప్రస్తావనకు కూడా నోచుకోలేదు. తాజా బడ్జెట్లో భారీ కేటాయింపుల నేపథ్యంలో మెట్రో ఆశలకు రెక్కలు వచ్చాయి. అమరావతి నిర్మాణంలో కీలకమైన భూ సమీకరణకు బడ్జెట్లో నిధులు కేటాయించారు. తాజాగా రాజధాని పరిధిలోని కీలక రహదారులను జాతీయ రహదారి ఎన్‌హెచ్- 16కు అనుసంధానించే ప్రక్రియ తెరమీదకి వచ్చింది. కరకట్ట రహదారి విస్తరణ ప్రక్రియ కూడా కొనసాగుతోంది. ఈ నేపథ్యంలో భూసమీకరణ జరగాల్సి ఉంది. అలాగే గతంలో కొన్ని గ్రామాల్లో రైతులు రాజధాని నిర్మాణానికి భూములు ఇచ్చేందుకు నిరాకరించారు. ఇప్పుడు వారంతా భూములు ఇచ్చేందుకు ముందుకు వస్తున్నారు. ఇలా భూసమీకరణ (మిగతా 6వ పేజీలో)

రంగా వర్సిటీకి పూర్వ వైభవం



గత ప్రభుత్వ హయాంలో నిర్లక్ష్యం చేయబడిన ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం పూర్వ వైభవం దిశగా అడుగులు వేసేందుకు కూటమి ప్రభుత్వం బడ్జెట్‌లో నిధులు కేటాయింపు జరిపారు. రాష్ట్ర ఆహార భద్రతకు భరోసా ఇస్తున్న ఆచార్య ఎన్జీ రంగా యూనివర్సిటీకి ప్రభుత్వం బడ్జెట్‌లో పెద్దపీట వేసింది. యూనివర్సిటీ ఆధ్వర్యంలో కుప్పం, బాపట్ల, పల్నాడు, విజయనగరం లలో 4 కొత్త కృషి విజ్ఞాన కేంద్రాల ఏర్పాటు చేస్తున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. కొత్త పరిశోధనలు, నూతన వంగడాల సృష్టించేందుకు భారీగా కేటాయింపు లు జరిపారు. వర్సిటీకి రూ.507.01 కోట్లు నిధులు కేటాయించారు. వర్సిటీలోని డ్రోన్ శిక్షణా సంస్థకు డీజీసీఏ గుర్తింపు ఉన్నట్లు ప్రభుత్వం వెల్లడించింది.


బాపట్లలో కృషి విజ్ఞానకేంద్రం

కృషి విజ్ఞాన కేంద్రాన్ని బాపట్లలో ఏర్పాటు చేయడానికి శుక్రవారం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో ప్రభుత్వం పచ్చజెండా ఊపింది. 13 మంది సిబ్బందితో ఇది ఏర్పాటు కావడంతో పాటు శాస్త్రవేత్తలు కూడా రైతులకు జిల్లా కేంద్రంలో అందుబాటులో ఉండనున్నారు. తద్వారా రైతులు సాగులో సమస్యలతో పాటు మట్టి సారం, వాతావరణ అంచనాలు ఇవన్నీ కూడా సకాలంలో రైతులకు చేరే అవకాశాలు ఉంటాయి.

కృష్ణా డెల్టాలో సాగునీటి ప్రాజెక్టులను పురోగతిలోకి తీసుకొచ్చేందుకు బడ్జెట్‌లో కేటాయింపులు

కృష్ణా డెల్టాకు రూ.400 కోట్లు

జరిపింది. గుంటూరు ఛానల్ విస్తరణ, పొడిగింపునకు రూ.100 కోట్లు కేటాయించే అవకాశం ఉంది. దీంతో కొన్నేళ్లుగా కాగితాల్లోనే ఉన్న గుంటూరు ఛానల్ పనులు పట్టాలెక్కుతాయి. ఈ ప్రాజెక్టు కూడా గత టీడీపీ హయాంలోనే రూపుదిద్దుకొన్నది. ఛానల్ పొడిగింపు కోసం కొన్ని దశాబ్దాలుగా పెదనందిపాడు ప్రాంత రైతులు పోరాటాలు జరుపుతున్నారు. దాంతో అప్పటి ఇరిగేషన్ శాఖ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు ఈ ప్రాజెక్టుని మంజూరు చేశారు. ఆ తర్వాత వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి టెండర్లను రద్దు చేసింది. సరైన సమయంలో నిర్ణయం తీసుకుంటామంటూ వైసీపీ ఐదేళ్ల కాలయాపన చేసింది. గత ఏడాది వరదల సమయంలో గుంటూరు ఛానల్‌కి గండ్లు పడటం వల్ల చాలారోజుల పాటు పొలాలు నీట మునిగాయి. దాంతో కేంద్ర మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ ఢిల్లీ నుంచి ఒక బృందాన్ని రప్పించి ఇక్కడ అధ్యయనం చేయించారు. నిధుల కోసం ప్రతిపాదనలు కూడా పంపించారు. ఇప్పుడు బడ్జెట్‌లో నిధులు కేటాయించడంపై ఆయన, ఎమ్మెల్యేలు ధూళిపాళ్ల నరేంద్రకుమార్, బూర్ల రామాంజనేయులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



గుంటూరు ఛానల్

రీసర్వేను వేగవంతం చేయాలి

● రమణాయపాలెంలో కలెక్టర్ వెంకటమురళి

పర్చూరు, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి) భూముల రీ సర్వేని వేగవంతం చేయాలని కలెక్టర్ జె.వెంకటమురళి తెలిపారు. పర్చూరు మండల పరిధిలోని రమణాయపాలెంలో శుక్రవారం నిర్వహించిన భూముల రీసర్వేను రైతు సమక్షంలో కలెక్టర్ స్వయంగా పరిశీలించి సమస్య అడిగి తెలుసుకున్నారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో పైలెట్ ప్రాజెక్టు కింద భూముల రీసర్వేకి ఎంపిక చేసిన గ్రామాల్లో కార్యక్రమాన్ని పారదర్శకంగా చేపట్టాలన్నారు. రీసర్వే చేపట్టే ముందు రైతులకు నోటీసులు జారీ చేయాలని తహసీల్దార్ బ్రహ్మయ్యను ఆదేశించారు. గ్రామంలో 5,120 మంది రైతులకి సంబంధించి 6,227 ఎకరాల భూమి రీ సర్వే చేస్తున్నారన్నారు. బాపట్ల, పర్చూరు ఆర్‌అండ్‌బీ రహదారిలో 13వ కిలోమీటర్ వద్ద రోడ్డు మరమ్మతులకి చర్యలు తీసుకుంటామని తెలిపారు.

పొగాకు రైతుల మొర

తాము పండించిన పంటకు గిట్టుబాటు ధరలేదని, కొనుగోలుకు ఎవరూ ముందుకు రావడం లేదని రమణాయపాలెంలోని వైట్ బర్లీ పొగాకు రైతులు కలెక్టర్‌కు విన్నవించారు. గత ఏడాది క్వింటా రూ.12 వేలు ఉంటే ప్రస్తుతం రూ.4 వేలు మాత్రమే ధర పలుకుందని వాపోయారు. ఇలా అయితే తాము పూర్తిగా నష్టపోవాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఐటీసీ ప్రతినిధులతో మాట్లాడి పొగాకు కొనుగోలుకి చర్యలు తీసుకుంటామని కలెక్టర్ రైతులకు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సర్వేశాఖ ఏడీ ప్రసాదరావు, ఆర్డీవో పి.గ్లోరియా తదితరులు పాల్గొన్నారు.




అధికారుల సమక్షంలో రైతుల సమస్యలు అడిగి తెలుసుకుంటున్న కలెక్టర్ వెంకటమురళి

రెవెన్యూ సవరణలు

భూ సమస్యల దిద్దుబాటుపై దృష్టి

- వైసీపీ హయాంలో భూ రికార్డులు తారుమారు
- మూడేళ్లుగా కార్యాలయాల చుట్టూ రైతుల ప్రదక్షిణలు
- ఒక్కో గ్రామం ప్రాతిపదికగా సమస్యలకు వినూత్నంగా పరిష్కారం
- ఇప్పటి వరకు వేల ఎకరాలకు చెందిన 5800 మంది రైతులకు ఊరట
- రీ సర్వే కంటే ముందే సమస్యలు గాడిన పెట్టే ప్రయత్నంలో అధికారులు
- తెనాలి తరహాలో మిగిలిన మండలాల్లో ప్రయత్నిస్తే చిక్కులు వీడినట్టే



బుర్రిపాలెం గ్రామం ఏరియల్ వ్యూ

తెనాలి, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): ఒకరి భూమి మరొకరి ఖాతాలోకి మారిపోతే.. దశాబ్దాలుగా హక్కు కల్గిన భూమి నిషేధిత జాబితాలోకి వెళ్లిపోతే.. భూమి, పత్రాలు సక్రమంగానే ఉన్నా రికార్డులు మార్చేస్తే.. ఇలా ఒకటి.. రెండు కాదు. వందల్లో సమస్యలతో వేలల్లో రైతులు ప్రతీ గ్రామంలోనూ అల్లాడిపోతున్నారు. ప్రతి గ్రామంలోనూ 90 శాతానికిపైగా రైతుల భూముల చరిత్రే మారిపోయి ఎటూపాలుపోని పరిస్థితుల్లో ఉన్నారు. చేసిన తప్పును చక్కదిద్దే చర్యలే లేకపోగా, రైతులను నానా అవస్థలకు గురిచేస్తున్నారు. పైగా వారు చేసిన తప్పు సరిచేయడానికి రైతుల నుంచే రూ.లక్షల్లో లంచాలు దండుకుంటున్న దారుణాలున్నాయి. అయితే తెనాలిలో దీనికి పూర్తిభిన్నంగా ఓ అధికారి విధులు సక్రమంగా నిర్వహిస్తే ఎలా ఉంటుందనేందుకు ఉదాహరణగా నిలిచారు. సంవత్సరాల తరబడి కార్యాలయాల చుట్టూ తిరుగుతున్న రైతులకు ఊహించని పెద్ద ఊరటే ఇస్తున్నారు. మా వల్ల జరిగిన పొరపాటును మేమే సరిచేస్తామని, అర్జీ కూడా అవసరం లేకుండా, కార్యాలయానికి రానవసరం లేకుండా భూమికి సంబంధించిన ప్రతి పొరపాటును చక్కదిద్దే కార్యక్రమం చేపట్టారు. మిగిలిన అధికారులకు ఆదర్శంగా నిలిచారు.

రీ సర్వే లోపే చక్కదిద్దేలా..

వైసీపీ హయాంలో జరిగిన రీ సర్వేలో జరిగిన పొరపాట్లు, తాజాగా జరుగుతున్న రీ సర్వేకు ముందే సరిచెయ్యాలనే లక్ష్యాన్ని తెనాలి అధికారులు పెట్టుకున్నారు. దీనికోసం ఒక్కో గ్రామాన్ని ప్రాతిపదికగా తీసుకుని సవరణలకు శ్రీకారం చుట్టారు. గత వైసీపీ ప్రభుత్వ కాలంలో కొందరు నేతలు రైతుల భూములను కొట్టేసేందుకు రీ సర్వేను అవకాశంగా చేసుకున్నారు. నేరుగా పొలాలకు వెళ్లి పరిశీలించాల్సిన సిబ్బంది ఎక్కడో ఉండి ఆ భూముల యాజమాన్య హక్కులను తిరగరాశారు. దీంతో తమ భూమిని అమ్ముకునేందుకు సిద్ధపడిన రైతులకు రిజిస్ట్రేషన్ కార్యాలయంలో కొర్రీలు చూపడంతో అడ్డుకట్ట పడుతూ వచ్చింది. అసలు పొరపాటు ఎక్కడ జరిగిందనే విషయాన్ని తెలుసుకునేందుకు కూడా ఒక్క అధికారి శ్రద్ధ చూపలేదు. తమ భూముల పరిస్థితి పరిశీలించి అన్ని పత్రాలను చూపించినా అధికారుల్లో గత ప్రభుత్వ కాలంలో చలనమే లేకుండాపోయింది.

తెనాలి తహసీల్దారు దృష్టి

కూటమి ప్రభుత్వం వచ్చాక తెనాలి తహసీల్దారుగా బాధ్యతలు చేపట్టిన గోపాలకృష్ణ గత రీసర్వేలో జరిగిన తప్పులపై దృష్టిపెట్టారు. భూ స్వభావం, పేరు వంటి వివరాలు నమోదు కావాల్సిన కాలం 6లో జరిగిన లోపాలతో భూముల అమ్మకాలు జరగక అవస్థలు పడుతున్న రైతులు నేరుగా సీఎం చంద్రబాబు దగ్గరకే వెళ్లి మొరపెట్టుకున్నారు. ఈ క్రమంలో వీటిని వెంటనే సరిచెయ్యాలనే లక్ష్యాన్ని నిర్దేశించుకున్న రెవెన్యూ సిబ్బంది దీనిపై కసరత్తు చేసి, 5800 మంది రైతులకు సంబంధించి వేల ఎకరాల సమస్యకు పరిష్కారం చూపారు. అయితే ఇదొక్కటే కాకుండా, భూములకు సంబంధించి అనేక లోపాలు (మిగతా 6వ పేజీలో)

బొబ్బేపల్లి సొసైటీ మాజీ అధ్యక్షుడి మృతి

మార్టూరు, ఫిబ్రవరి28(ఆంధ్రజ్యోతి): మండలంలోని బొబ్బేపల్లి సొసైటీ మాజీ అధ్యక్షుడు గంగా బసవయ్య (80) అనారోగ్యంతో గురువారం రాత్రి స్వగృహంలో మృతిచెందారు.ఆయనకు భార్య,ఇద్దరు కుమారులు, ఒక కుమారుడు ఉన్నారు. శుక్రవారం గ్రామంలో అంత్యక్రియలు నిర్వహించారు. బసవయ్య మృతి పట్ల పర్చూరు శాసనసభ్యులు ఏలూరి సాంబ శివరావు ఓ ప్రకటనలో సంతాపం తెలియచేశారు.వారి కుటుంబ సభ్యులను ఫోన్‌లో పరామర్శించారు. ఇసుకదర్శిలోని ఏలూరి క్యాంపు కార్యాలయం నుంచి టీడీపీ నాయకులు కామేపల్లి హరిబాబు, మిన్నెకంటి రవికుమార్, తేలప్రోలు సాంబ శివరావులు బసవయ్య మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.

గుండెలు ఆగుతున్నాయ్..

నిన్నొకరు..నేడొకరు పట్టణంలో మృతి

చీరాల, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి) : ఇటీవల కాలంలో గుండెపోటు మృతుల సంఖ్య విపరీతంగా పెరుగుతోంది. వయసుతో సంబంధం లేకుండా ప్రజలు మృత్యువాత పడుతున్నారు. అయితే మృతుల్లో అందరూ పురుషులు కావడం గమనార్హం. గురువారం రాత్రి స్థానిక మునిసిపల్ కార్యాలయం ఎదురుగా గుర్తుతెలియని సుమారు 45 సంవత్సరములు కలిగిన వ్యక్తి మృతి చెంది పడి ఉన్నాడు. అయితే అతని వద్ద ఎటువంటి ఆధారాలు లభించలేదు. అలాగే ఎటువంటి భిన్న వాతావరణం లేకుండా సాధారణంగా మృతి చెంది ఉండటంతో గుండెపోటు మరణంగా వన్‌టౌన్ పోలీసులు భావిస్తున్నారు. ఈక్రమంలోనే ఘటనపై కేసు నమోదు చేసుకుని మృతదేహాన్ని చీరాల ఏరియా వైద్యశాలకు తరలించారు. అలాగే శుక్రవారం ఉదయం పట్టణంలోని ఓ లాడ్జి సమీపంలో స్థానిక నవాబ్‌పేట జేమ్స్ స్కూల్ సమీప ప్రాంతానికి చెందిన కోడూరి వెంకట రవి కుమార్(45) మృతి చెందాడు. ఈఘటనపై కూడా వన్‌టౌన్ పోలీసులు కేసు నమోదు చేసుకుని మృతదేహాన్ని పోస్ట్‌మార్టం అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించారు. ఇటీవల కాలంలో చీరాల పరిధిలో గుండె పోటు మృతుల సంఖ్య అధికంగా నమోదు అవుతోంది.

ఘనంగా టైలర్స్ డే వేడుకలు

మార్టూరు,ఫిబ్రవరి28(ఆంధ్రజ్యోతి):టైలర్స్ డే వేడుకలను శుక్రవారం మార్టూరులో ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా పాత సొసైటీ బ్యాంక్ రోడ్డులో టైలర్స్ జండాను ఎగురవేశారు. తరువాత జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో తమ సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని టైలర్లు కోరారు. ఈ కార్యక్రమంలో పఠాన్ ఖాదర్‌వలి తదితరులు పాల్గొన్నారు.

పావులూరులో నేత్రదానం

ఇంకొల్లు,ఫిబ్రవరి28,(ఆంధ్రజ్యోతి): మండలంలోని పావులూరులో గురువారం నేత్రదానం జరిగింది. గ్రామానికి చెందిన సింహాద్రి వెంకటేశ్వరరెడ్డి మృతి చెందగా ఇంకొల్లు రోటరీ అవయవదాన కమిటీ ఆధ్వర్యంలో గుంటూరు శంకర నేత్రాలయం వైద్యులు నేత్రాలను సేకరించారు. నేత్రదానానికి సహకరించిన మృతుని కుటుంబసభ్యులు వెంకాయమ్మ, శ్రీనివాసరెడ్డి, ఇందిర, నాగేశ్వరమ్మలను రోటరీ అవయవదాన కమిటీ సభ్యులు సోమేపల్లి రామ్మోహనరావు, జెట్టి వెంకటేశ్వర్లు, పులఖండం బద్రిరెడ్డి, రోటరీ సభ్యులు అభినందించారు.

పేదలకు అన్నదానం



అన్నదానం చేస్తున్న అయ్యప్ప సేవాసమితి సభ్యులు

అద్దంకి, ఫిబ్రవరి28(ఆంధ్రజ్యోతి):అఖిల భారత అయ్యప్ప దీక్షా ప్రచార సమితి ఆధ్వర్యంలో అమావాస్య సందర్భంగా శుక్రవారం అన్నసంతర్పణ నిర్వహించారు. టీడీపీ అద్దంకి పట్టణ అధ్యక్షుడు, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ చిన్ని లక్ష్మీ శ్రీనివాసరావు సహకారంతో స్థానిక పొట్టిశ్రీరాములు బొమ్మ వద్ద ఈ కార్యక్రమం నిర్వహించారు. వాసు గురుస్వామి,చెన్నా వెంకటేశ్వర్లు, కురిచేటి వెంకటసుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

పారదర్శకంగా రేషన్ పంపిణీ

- ఆర్డీవో చంద్రశేఖర్‌నాయుడు

చీరాల, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి) : నిరుపేదలకు రేషన్ పంపిణీ పారదర్శకంగా జరగాలని ఆర్డీవో చంద్రశేఖర్‌నాయుడు అన్నారు. శుక్రవారం వేటపాలెం లోని దేశాయిపేటలోగల ఎంఎల్ఎస్ స్టాకు పాయింట్‌ను సందర్శించారు. ఈసందర్భంగా రికార్డులను నిశితంగా పరిశీలించారు. ఆర్డీవో వెంట తహసీల్దార్ పార్వతి, రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.



రికార్డులు పరిశీలిస్తున్న ఆర్డీవో

ఘనంగా జాతీయ సైన్స్ దినోత్సవం

అద్దంకిటౌన్, ఫిబ్రవరి 28(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు సైన్స్ ప్రయోగాల పట్ల ఆసక్తిని పెంచుకునేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని ఎంఈవో బి.సుధాకరరావు అన్నారు. శుక్రవారం స్థానిక కట్టకిందపాలెంలోని ప్రాథమిక పాఠశాలలో జాతీయసైన్స్ దినోత్సవం సందర్భంగా విద్యార్థులు వివిధ సైన్స్ ప్రయోగాలను చేసి ప్రదర్శించారు. ఈ కార్యక్రమాన్ని ఎంఈవో సుధాకరరావు, హెచ్‌ఎం ఎంవీ సుబ్బారావు, ఏఎంసీ చైర్మన్ రవి, మున్నంగి చిన్న బాపూజి, సీఆర్‌పీ, ఉపాధ్యాయులు పరిశీలించి విద్యార్థులను అభినందించారు. కేఆర్‌కే ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శుక్రవారం సైన్స్ విభాగాల ఆధ్వర్యంలో జాతీయ సైన్స్ దినోత్సవం-2025 వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సీవీ రామన్ చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ ఎంవీ సత్యనారాయణ, అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.



విద్యార్థుల సైన్స్ ప్రయోగాలను పరిశీలిస్తున్న ఉపాధ్యాయులు

చినగంజాంలో...

చినగంజాం : మండలంలోని పెద గంజాం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జాతీయ సైన్సు దినోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఇన్‌చార్జ్ హెచ్‌ఎం నారాయణరెడ్డి ఆధ్వర్యంలో సీవీరామన్ చిత్రపటానికి ఉపాధ్యాయులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పాఠశాలలోని విద్యార్థులు సైన్సు ప్రదర్శనలు ఏర్పాటు చేశారు. సైన్సు వేడుకలను సైన్సు ఉపాధ్యాయులు డి.ఆషాలత, డి.సుబ్బారావు, హెచ్‌ఎం ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఎ.వీరాచారి, కే.నాగరాజు, ఎన్.శ్రీరమణ, ఎన్.రమణమూర్తి, టి.వినయ్‌కుమార్, ఎం.రవి చంద్రరామ్, ఎ.సుబ్బరాజు, షేక్.సుభానిభాష, ఎం.కుమార్, విద్యార్థులు పాల్గొన్నారు.

ఇంకొల్లులో...

ఇంకొల్లు: మండలంలో జాతీయ సైన్సు దినోత్సవాన్ని వివిధ పాఠశాలల్లో ఘనంగా నిర్వహించారు. స్థానిక ఎంఆర్‌ఆర్ హైస్కూల్, ఆదర్శ, నివేదిత, గౌతమి, ఇడుపులపాడు విద్యాపరిషత్ ఉన్నత పాఠశాలల్లో ఉపాధ్యాయులు సీవీ రామన్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన సైన్సు ప్రాజెక్టులు అబ్బురపరిచాయి. ఈ కార్యక్రమంలో ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు,డైరెక్టర్లు,ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

రెవెన్యూ సవరణలు

(5వ పేజీ తరువాయి)

ఉండటంతో వాటి దిద్దుబాటు చేపట్టారు.

అర్జీ అవసరం లేకుండా.. రైతులను తిప్పుకోకుండా..

గడచిన శతాబ్దకాలంగా పదిలంగా ఉన్న ఎందరో భూముల హక్కులు ఒక్క సంవత్సరంలో మారిపోయాయి. ఉదాహరణకు పొన్నూరు పట్టణ పరిధిలో 220 ఎకరాల భూమి కేవలం ఐదుగురు వ్యక్తుల పేరుపై నమోదు చేయడం తెలిసిందే. ఇదే తీరులో ప్రతి గ్రామంలోనూ పదుల సంఖ్యలో పేర్ల మార్పులు జరిగాయి. పొన్నూరులో జరిగిన లోపాలను నేటికీ సరిచేస్తూనే ఉన్నారు. అయితే తెనాలిలో మాత్రం రైతు దరఖాస్తు చేసుకోవడం, కార్యాలయం చుట్టూ తిరగడం, లంచాల రూపంలో చదివించుకోవడం వంటివి లేకుండానే తప్పులు సరిచేస్తున్నారు. ఇప్పటికే సంగంజాగర్లమూడి, కఠెవరం, నందివెలుగు, గుడివాడ, మల్లెపాడు, దేవరపల్లి అగ్రహారం వంటి గ్రామాల్లో రికార్డులను సరిచేశారు. ప్రస్తుతం బుర్రిపాలెం గ్రామాన్ని ఎంపిక చేసుకున్నారు. 291 సర్వే నంబర్లలో మొత్తం 1732 ఎకరాల భూమి ఉంటే యాజమాన్య హక్కులు మారినవి, లెగసీ కేసుల వంటివి ఎక్కువ గుర్తించారు. ఈ గ్రామంలో ఇటీవల రెవెన్యూ సదస్సు పెడితే అధికారులకు భూమి సమస్యలకు సంబంధించి అందిన దరఖాస్తులు కేవలం 2 మాత్రమే. అయితే ఇక్కడ సమస్యలు మాత్రం 100కుపైనే ఉన్నాయి. అంటే ఇద్దరికి మినహా మిగిలిన రైతులకు వారి భూమికి సంబంధించి సమస్య ఉందనే విషయం కూడా తెలియదు. అయితే ఈ మొత్తాన్ని



తెనాలి తహసీల్దార్ గోపాలకృష్ణ

పరిష్కరించి, వాటిని సరిచెయ్యాలని అధికారులు నిర్ణయించారు.

సమస్యలన్నీ పరిష్కరించేలా

ఇకపై ఏ రైతూ అంతుబట్టని చిక్కులతో హక్కుల కోసం పోరాడాల్సిన అవసరంలేదు. గతంలో మా వల్ల జరిగిన భూముల తప్పులు మేమే సరిదిద్దాలని నిర్ణయించుకున్నాం. రీ సర్వేలో లోపాలు మళ్లీ కనిపించకుండా, రైతులకు ఏ ఇబ్బంది లేకుండా పరిష్కారం చూపదలిచాం. ఏ ఒక్క రైతు నుంచి భూ సమస్యలపై అర్జీ రాకూడదనే లక్ష్యంతో పని చేస్తున్నాం. ఒక్కో గ్రామాన్ని ఎంపిక చేసుకుని మోడల్‌గా తీర్చిదిద్దాలని ప్రయత్నిస్తున్నాం. మా ప్రయత్నానికి జేసీ, సబ్‌కలెక్టర్ పూర్తి సహకారం అందిస్తున్నారు. తప్పులను సరిదిద్దేందుకు ఏ రైతూ లంచం ఇవ్వాల్సిన అవసరంలేదు. - గోపాలకృష్ణ, తహసీల్దార్, తెనాలి

విస్తు కలిగించే విషయాలెన్నో!

- బుర్రిపాలెంలో జగనన్న కాలనీ కోసం మూడేళ్ల క్రితం 198.22 ఎకరాల భూమిని ప్రభుత్వం రైతుల నుంచి కొనుగోలు చేసింది. ఇక్కడ ఇళ్ల నిర్మాణం చేపట్టినా ఇంకా రైతుల పేరుపైనే భూమి ఉంది. ప్రభుత్వ భూమిగా మార్చాల్సిన భూమినీ అధికారులు మార్చలేదంటే ఎంత నిర్లక్ష్యమో అర్థమవుతుంది.
- 9999, 99999 ఖాతా నంబర్లలో 196 సర్వే నంబర్లను చేర్చారు. భూ విస్తీర్ణం 460 ఎకరాలపైనే. అయితే ఈ విషయం రైతులకు తెలియదు. దీనిని అధికారులే గుర్తించారు.
- రైతుల పేరు బదులు '0' అని నమోదు చేశారు. దీనివల్ల రైతు తన భూమిని అమ్ముకోడానికి వీలు లేని పరిస్థితి.
- లెగసీ కేసులు కూడా చాలానే ఉన్నాయి. ఒక రైతుపేరుపై ఉండాల్సిన వాస్తవ విస్తీర్ణం కాకుండా దానికి మించి కానీ, తక్కువగా కానీ చూపడం, వాటిని మరొకరి పేరుకు చేర్చడం వంటి వాటిని గుర్తించారు.
- 80కిపైగా సర్వే నంబర్లలో అసలు రైతు పేరు కాకుండా ఇతరుల పేర్లు నమోదు చేశారు. రైతు పేరుపై పట్టా, ఇతర హక్కు పత్రాలన్నీ కచ్చితంగా ఉన్నా, వాటిని గతంలో సరిచేసిందేలేదు.
- గ్రామంలో 291 సర్వే నంబర్లుంటే, వీటిలో 60 ఆన్‌లైన్‌లో కనిపించడంలేదు. అవి ఏ రైతులకు సంబంధించినవో అంతుబట్టని విషయం.

ఉపాధి పనుల్లో దొంగ మస్టర్‌లపై విచారణ

కమిషనర్ ఆదేశాలతో అధికారులు, సిబ్బందిలో వణుకు

ఇప్పటికే రికార్డులు సరిచేసే పనిలో నిమగ్నం

అవినీతి వెలుగు చూడకుండా చేసుకునేందుకు నాయకుల చుట్టూ ప్రదక్షిణలు

అద్దంకి/బల్లికురవ, ఫిబ్రవరి28(ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పథకం పనులలో దొంగ మస్టర్‌లపై విచారణకు పంచాయతీ రాజ్ కమిషనర్ ఆదేశించటంతో సంతమాగులూరు, బల్లికురవ మండలాలలోని ఉపాధి హామీ పథకం అధికారులు, సిబ్బందిలో వణుకు మొదలైంది. ఈ క్రమంలో ఇప్పటికే రికార్డులు సరిచేసే పనిలో అధికారులు, సిబ్బంది నిమగ్నమైనట్లు తెలుస్తోంది. 4 రోజులుగా మస్టర్లకు సంబంధించిన రికార్డులు ఎక్కడికక్కడ సరి చేసే పనిలో ఉన్నారు. అదే సమయంలో తమను ఏదో ఒక విధంగా బయట పడేలా చేయాలని అధికారులు, సిబ్బంది తమకు అనుకూలంగా ఉండే మండల, గ్రామ స్థాయి నాయకుల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. అయితే కొంత మంది నేతలు హామీ ఇస్తున్నప్పటికి ఎక్కువ మంది నేతలు మాత్రం తగిన శాస్తి జరగాలిలే అంటున్నారు. ప్రధానంగా సంతమాగులూరు మండలంలోని అత్యధిక గ్రామాలలో పెద్ద ఎత్తున దొంగ మస్టర్‌లు ఉన్నట్లు తెలుస్తోంది. ఈ క్రమంలో సిబ్బంది, ఫీల్డ్ అసిస్టెంట్‌లలో ఆందోళన నెలకొనగా, పర్యవేక్షణ చేసే మండల స్థాయి అధికారి మాత్రం మేకపోతు గాంభీర్యం ప్రదర్శిస్తూ.., అన్నీ నేను చూసుకుంటాను... మీరు ధైర్యంగా ఉండండి అని భరోసా ఇస్తున్నట్లు సమాచారం. అవసరమైతే విజిలెన్స్ విచారణ కూడా రాకుండా చూసుకుంటానని కూడా చెప్తున్నట్లు తెలుస్తోంది. శుక్రవారం ఉపాధిహామీ పథకం పీడీ విజయలక్ష్మి సంతమాగులూరు మండలంలో పనులు పరిశీలన చేయటంతో ఆందోళన మరింత పెరిగినట్లు తెలుస్తోంది. విచారణకు విజిలెన్స్ అధికారులు సోమవారం తరువాత ఎప్పుడైనా రావచ్చని, ఈ నేపథ్యంలో ఎంత మేర సరిచేస్తారో, ఎంత మేర దొరుకుతారో వేచి చూడాల్సి ఉంది. లోతుగా పరిశీలిస్తే సాఫ్ట్‌వేర్ ఉద్యోగులతో పాటు సుదూర ప్రాంతాలలో నివాసం ఉంటున్న వారి పేర్లతో వేసిన మస్టర్‌లు వెలుగులోకి వచ్చే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. ఉపాధి పనుల కంటే మిర్చి కోతలకు ఎక్కువ మంది కూలీలు వెళ్తున్న తరుణంలో పెద్ద ఎత్తున మస్టర్‌లు నమోదు కావటం కూడా అనుమానాలకు మరింత తావిస్తున్నది.

హరహరమహాదేవ శంభో...



రథోత్సవంలో ఎమ్మెల్యే జనార్దన్ దంపతులు

వైభవంగా శ్రీరామలింగేశ్వరస్వామి రథోత్సవం

కొత్తపట్నం, ఫిబ్రవరి 28(ఆంధ్రజ్యోతి) : మండలంలో జంట గ్రామాలైన మడనూరు-ఈతముక్కలలో వేంచేసి ఉన్న శ్రీరామ లింగేశ్వరస్వామికి శివరాత్రి మహోత్సవాల సందర్భంగా శుక్రవారం సాయంత్రం రథోత్సవం వైభవంగా జరిగింది. ఆలయ అర్చకుల మంత్రోచ్చారణల మధ్య రథోత్సవం మడనూరులోని ఆలయ ప్రాంగణం నుంచి ప్రారంభమైంది. ఈ కార్యక్రమానికి శాసనసభ్యులు దామచర్ల జనార్దన్, అతని కుటుంబ సభ్యులు, ఎంఆర్‌వో పిన్నిక మధుసూదనరావులు హాజరయ్యారు. రథోత్సవాన్ని తిలకించేందుకు మండలంలోని పలు గ్రామాలతోపాటు జిల్లాలోని ఇతరప్రాంతాల నుంచి కూడా భక్తులు వేల సంఖ్యలో తరలివచ్చారు. భక్తులు ముక్తకంఠంతో శివనామస్మరణ చేస్తూ రథాన్ని ముందుకు లాగారు. హరహర మహాదేవశంభోశంకర అంటూ భక్తులు నామస్మరణ చేశారు. గ్రామ ప్రధాన మార్గాల ద్వారా రథోత్సవం కొనసాగింది. శుక్రవారం రాత్రి పొద్దుపోయిన తర్వాత రథోత్సవాన్ని ఈతముక్కల గ్రామానికి చేర్చారు. శనివారం ఈతముక్కల గ్రామం నుంచి రథోత్సవం ప్రారంభమై మడనూరులోని శ్రీరామలింగేశ్వరస్వామి ఆలయానికి చేరుకోనుంది. ఈ సందర్భంగా భక్తులు అడుగడుగునా పూజలు చేస్తూ శివనామస్మరణ చేస్తూ ముందుకు సాగారు.

అమరావతికి అగ్రతాంబూలం

(5వ పేజీ తరువాయి)

కూటమి ప్రభుత్వం బడ్జెట్ కేటాయింపుతో హర్షం

అవసరాల నిమిత్తం తాజాగా బడ్జెట్లో మరో 297.82 కోట్లు కేటాయించారు.

నేతన్నలకు ఉచిత విద్యుత్

నేతన్నలు, నాయీబ్రాహ్మణులకు విద్యుత్ భారం తగ్గించే దిశగా చర్యలు చేపట్టింది. ఎస్సీ, ఎస్టీ కుటుంబాలకు నెలకు 200 యూనిట్లు ఉచితంగా ఇస్తున్నట్లుగానే నేతన్నలకు, నాయీ బ్రాహ్మణులకు ఉచితంగా విద్యుత్ అందజేస్తామని ప్రభుత్వం ప్రకటించింది. ఈ పథకం అందుబాటులోకి వస్తే గుంటూరు జిల్లాలో 10 వేలు, బాపట్ల జిల్లాలో 17 వేలు, పల్నాడు జిల్లాలో 3 వేల చేనేత కుటుంబాలకు భారీ ఊరట లభించనుంది. గతంలో టీడీపీ ప్రభుత్వంలో ప్రారంభించిన ఆదరణ పథకాన్ని వైసీపీ ప్రభుత్వం నిర్వీర్యం చేయగా, తాజాగా ఆ పథకాన్ని పునఃప్రారంభిస్తున్నట్లు రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. ఈ పథకం పునరుద్ధరిస్తే నాయీబ్రాహ్మణ, రజక, చేనేత, కల్లుగీత కార్మికులు, కుమ్మరి, కమ్మరి ఇతర కుల, చేతి వృత్తులవారికి వృత్తిపరమైన భరోసా లభిస్తుంది.

దీపం- 2లో14 లక్షల మందికి లబ్ధి

దీపం- 2 పథకాన్ని ఇప్పటికే ప్రారంభించిన ప్రభుత్వం గత బడ్జెట్లో ఒక సిలిండరును లబ్ధిదారులకు ఉచితంగా పంపిణీ చేసింది. తాజా బడ్జెట్లో ఈ పథకానికి రూ.2,601 కోట్లు కేటాయించడంతో ఈ ఏడాది మూడు గ్యాసు సిలిండర్లు ఉచితంగా అందనున్నాయి. మూడు జిల్లాల్లోని 14 లక్షల మంది లబ్ధిదారులకు ఈ ఏడాది రూ.357 కోట్ల మేర లబ్ధి చేకూరనుంది.

అవ్వాతాతల కళ్లలో ఆనందం

అవ్వాతాతలు, వితంతువులు, వంటరి మహిళలు, దివ్యాంగులకు చేయూతనిచ్చే ఎన్టీఆర్ భరోసా పెన్షన్‌కు భారీగా నిధులు కేటాయించారు. సూపర్ సిక్సులో హామీల్లో కీలకమైన హామీని అధికారంలోకి వచ్చిన తొలి నెలలోనే పింఛను మొత్తాన్ని రూ.4 వేలకు పెంచిన ప్రభుత్వం బడ్జెట్లోనూ అదే ప్రాథాన్యాన్ని కల్పించింది. బడ్జెట్‌లో గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాల్లోని 7లక్షల 40వేల మంది లబ్ధిదారులకు రూ.3,880 కోట్లు కేటాయించింది. బడ్జెట్లోనే కేటాయింపులతో ఏడాది పాటు అవ్వాతాతల పింఛనుకు ఎలాంటి ఢోకా లేకుండా పోయింది.

ప్రసన్నాంజనేయుడికి కదళీఫలార్చన

అవీఐవీ



శింగరకొండలో ప్రసన్నాంజనేయస్వామికి అరటి పండ్ల పూజ అనంతరం ప్రత్యేక అలంకరణలో స్వామి

అద్దంకి, ఫిబ్రవరి28(ఆంధ్రజ్యోతి): శింగరకొండ ప్రసన్నాంజనేయ స్వామి దేవాలయంలో శుక్రవారం దశ సహస్ర కదళీ ఫలార్చన వైభవంగా జరిగింది. అమావాస్య సందర్భంగా వేదపండితులు, అర్చకులు 11 ఆవృత్తములుగా 10 వేల అరటి పండ్లతో ప్రత్యేక పూజ నిర్వహించి అలంకరించారు. ఉభయదాతలుగా గుంటూరుకు చెందిన న్యూ మార్నింగ్ స్టార్ ట్రావెల్స్ అధినేత పొనకాల శ్రీనివాసరావు, యశోద దంపతులు పాల్గొన్నారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

నిబద్ధతతో పనిచేసిన లక్ష్మీకుమారి

అధికారులు, ప్రజాప్రతినిధుల కితాబు



లక్ష్మీకుమారిని సత్కరిస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులు

పంగులూరు, ఫిబ్రవరి 28(ఆంధ్రజ్యోతి):పంగులూరుకు చెందిన బాచిన లక్ష్మీకుమారి ప్రభుత్వ ఉద్యోగిగా విధి నిర్వహణలో నిబద్ధతతో పనిచేసి ఉత్తమ సేవలందించారని మండల ప్రజా ప్రతినిధులు, అధికారులు కొనియాడారు. పంగులూరు మండల పరిషత్ కార్యాలయ సబార్డినేట్‌గా పనిచేస్తూ శుక్రవారం ఉద్యోగ విరమణ చేసిన బాచిన లక్ష్మీకుమారిని పరిషత్ అధ్యక్షురాలు తేళ్ళ నాగమ్మ, జడ్పీటీసీ రాయిణి ప్రమీల, ఎంపీడీవో స్వరూపారాణిలు ఘనంగా సత్కరించారు. ప్రభుత్వ ఉద్యోగిగా మూడు దశాబ్దాలకు పైగా పనిచేసి పలువురి మన్ననలు పొందారన్నారు. కార్యక్రమంలో మండల పరిషత్ ఉపాధ్యక్షుడు ఎర్రం శ్రీనివాసరెడ్డి, టీడీపీ మండల అధ్యక్షుడు రావూరి రమేష్, రాయిణి వెంకట సుబ్బారావు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రతి విద్యార్థి మధ్యాహ్న భోజనం చేయాలి



భోజనాన్ని తనిఖీ చేస్తున్న ఎంఈవో రమేష్

బల్లికురవ, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి) : ప్రతి విద్యార్థి పాఠశాలలో మధ్యాహ్న భోజనం తినేలా ఉపాధ్యాయులు శుచిగా, రుచిగా తయారు చేయించాలని ఎంఈవో కె. రమేష్ కోరారు. శుక్రవారం మండలంలోని కొప్పెరపాడు ఉన్నత పాఠశాలలో ఎంఈవో మధ్యాహ్న భోజనాన్ని తనిఖీ చేశారు. ఈసందర్భంగా అయన మాట్లాడుతూ పదో తరగతి విద్యార్థులకు పరీక్షలు ముగిసే వరకు సెలవు రోజుల్లో కూడా భోజన పథకాన్ని నిర్వహిస్తున్నామని, విద్యార్థులందరూ పాఠశాలకు రావాలని అయన కోరారు.ఈ తనిఖీలో హెచ్‌ఎం శ్రీనివాసరావు పాల్గొన్నారు.

పశువుల్లో గాలికుంటు రాకుండా వ్యాక్సిన్‌లు



మాట్లాడుతున్న డాక్టర్ మాధవి

పర్చూరు, ఫిబ్రవరి 28(ఆంధ్రజ్యోతి) ప్రస్తుత వాతావరణ పరిస్థితుల నేపథ్యంలో పశువులకు గాలికుంటు వ్యాధి, బ్రుసెల్లోసిస్ వ్యాధి రాకుండా ముందస్తు చర్యల్లో భాగంగా టీకాలు వేయించాలని పశువైద్యశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ మాధవి అన్నారు. శుక్రవారం స్థానిక పశువైద్యశాలలో ఆమె మాట్లాడారు. జాతీయ పశువ్యాధి నియంత్రణ పథకంలో భాగంగా మార్చి 1 నుంచి 30తేదీ వరకు అన్నీ గ్రామాల్లో పశువులకు ఉచితంగా టీకాలువేస్తామన్నారు. ఈ అవకాశాన్ని పశుపోషకులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

సీఏ హైదరాబాద్ శాఖ కార్యదర్శిగా కారుమంచి



రామారావు

అడుసుమల్లి(పర్చూరు) ఫిబ్రవరి 28(ఆంధ్రజ్యోతి) : ది ఇనిస్టిట్యూట్ ఆఫ్ చార్టర్డ్ అకౌంట్స్ ఆఫ్ ఇండియా హైదరాబాద్ శాఖ కార్యదర్శిగా పర్చూరు మండలం అడుసుమల్లి గ్రామానికి చెందిన కారుమంచి రామారావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. హైదరాబాద్‌లోని రెడ్ హిల్స్ సంస్థ కార్యాలయంలో నిర్వహించిన కార్యవర్గ ఎన్నికలో అడుసుమల్లిని ఏకగ్రీవంగాఎన్నుకున్నారు. ఈసందర్భంగా శుక్రవారం పర్చూరు నియోజకవర్గంలోని పలురురు ప్రముఖులు అభినందనలు తెలిపారు.

బస్టాండ్ స్థలంలో వ్యర్థాలు వేస్తే చర్యలు

బల్లికురవ. ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి) : బస్‌స్టేషన్ స్థలంలో దుకాణదారులు వ్యర్థాలను పడవేస్తే చర్యలు తీసుకుంటామని పంచాయతీ కార్యదర్శి చంద్రశేఖర్ హెచ్చరించారు. సోమవారం ఆంధ్రజ్యోతిలో 'ఈ చెత్త కనిపించదా' అన్న కథనం ప్రచురితం కావటంతో ఉన్నతాధికారుల సూచనల మేరకు పంచాయతీ అధికారులు స్పందించారు. శుక్రవారం ఎక్స్‌కవేటర్‌తో బస్‌స్టేషన్ ఆవరణలో ఉన్న వ్యర్థాలను తొలగించి గ్రామానికి దూరంగా పడవేశారు. ఈసందర్భంగా చిరు దుకాణదారులతో అయన మాట్లాడుతూ కొబ్బరి బొండాలను, ఖాళీ గ్లాసులను చికెన్ దుకాణ వ్యర్థాలను పడవేయటం వలన ప్రజలకు ఇబ్బందిగా ఉందని, ఎవరైనా వ్యర్థాలను ఇష్టానుసారంగా పడవేస్తే జరిమానాలు వేస్తామని అయన తెలిపారు.



వ్యర్థాలు తొలగించాక పరిశుభ్రంగా ఉన్న బస్ స్టేషన్ స్థలం

అవీ..ఇవీ

చెన్నకేశవుడికి సూర్యకిరణాభిషేకం


చెన్నకేశవుడిని అభిషేకిస్తున్న భానుడి కిరణాలు

పంగులూరు, ఫిబ్రవరి 28(ఆంధ్రజ్యోతి): మండలంలోని చందలూరు గ్రామంలో శ్రీ చెన్నకేశవస్వామి ఆలయంలో మూలవిరాట్‌ను భానుడి కిరణాలు అభిషేకించాయి. ఫిబ్రవరి 27, 28 తేదీలలో ఉదయం 6.30 నిముషాల నుంచి 6.50 నిముషాల వ్యవధిలో ఈ అపూర్వ ఘట్టం ఆవిష్కృతమయింది. ఈ విశేషాన్ని గ్రామంలోని పలువురు భక్తులు తిలకించారు. సౌరమానాన్ని అనుసరించి ప్రతి సంవత్సరం ఉత్తరాయణం కుంభ సంక్రమణంలో శతభిషం కార్తెలో రెండు రోజులు అనగా ఏటా ఫిబ్రవరి 27, 28 తేదీలలో ఉదయం 6.30 నిముషాల నుంచి 6.50 నిముషాల వరకు, మళ్లీ దక్షిణాయణంలో కన్యా సంక్రమణంలో చిత్తకార్తెలో రెండు రోజుల పాటు అక్టోబరు 14, 15 తేదీలలో ఉదయం 6.10 నిముషాల నుంచి 6.30 నిముషాల వరకు ఆపాదమస్తకం సూర్య కిరణాలు మూలవిరాట్‌ను స్పృశిస్తాయని అర్చకస్వామి రఘునాథాచార్యులు తెలిపారు.


బల్లికురవలో గ్రౌండ్ వాటర్‌లెవల్‌ను తనిఖీ చేస్తున్న జిల్లా అధికారులు


గ్రౌండ్ వాటర్ లెవల్స్ తనిఖీ

బల్లికురవ. ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి) : రానున్న వేసవిని దృష్టిలో ఉంచుకొని గ్రామాలలో ఉన్న గ్రౌండ్ వాటర్ లెవల్స్‌పై శుక్రవారం జిల్లా భూగర్భ జలవనరుల శాఖ అధికారులు తనిఖీలు చేశారు. బల్లికురవ ఉన్నత పాఠశాల, కొణిదెన గ్రామాలలో వాటర్ లెవల్‌ను పరిశీలించారు. గత నెలలో ఎంత లోతులో నీరు ఉంది, ఈనెలలో ఎంత లోతుకి వెళ్లింది అన్న వివరాలను వారు సేకరించారు. కొణిదెన గ్రామంలో 11 మీటర్ల లోతులో నీరు ఉందని, బల్లికురవలో 3.83 మీటర్లలోతులో నీరు ఉందని, ప్రజలు నీటిని వృథా చేయకుండా వాడుకోవాలని వారు కోరారు. ప్రతి నెలా నీటి లెవల్ పరిశీలన చేసి నివేదికను ఉన్నతాధికారులకు అందజేస్తామని వారు తెలిపారు. ఈ పరిశీలనలో భూగర్భ వాటర్ లెవల్ జిల్లా ఏజీపీ వసంతకుమారి, ఏఈ శివ వరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.


ఆరోగ్య సిబ్బందితో మాట్లాడుతున్న జిల్లా మలేరియా అధికారి డాక్టర్ గోపినాథ్

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

అద్దంకిటౌన్, ఫిబ్రవరి 28(ఆంధ్రజ్యోతి): సీజనల్‌గా వచ్చే జర్వాల పట్ల ఆరోగ్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని బాపట్ల జిల్లా మలేరియా అధికారి డాక్టర్ గోపినాథ్ సూచించారు. శుక్రవారం అద్దంకిలోని గాజులపాలెం యూపీహెచ్‌సీని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా గాజులపాలెం, కాకానిపాలెం వైద్యాధికారులు, ఆరోగ్య సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రానున్న సీజనల్‌గా వచ్చే డెంగ్యూ, మలేరియా, చికున్ గున్యా లాంటి జ్వరాలు అదుపుచేయడానికి తీసుకోవాల్సిన చర్యలు, జాగ్రత్తలను ఆరోగ్య కార్యకర్తలకు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో గాజులపాలెం, కాకానిపాలెం యూపీహెచ్‌సీల మెడికల్ ఆఫీసర్లు డాక్టర్ గొట్టిపాటి జయసింహ, డాక్టర్ హేమమాధురి, అద్దంకి జోన్ మలేరియా సూపర్‌వైజర్ కె. అర్జున్, తదితరులు పాల్గొన్నారు.


అన్నాభిషేకం నిర్వహిస్తున్న నిర్వాహకులు

ముగిసిన అంకమ్మతల్లి తిరునాళ్లు

చీరాల, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి) : చీరాల మండల పరిధిలోని ఈపూరుపాలెం బూదాటివారి వీధిలో నిర్వహిస్తున్న అంకమ్మతల్లి వార్షిక తిరునాళ్ల శుక్రవారంతో ముగిశాయి. చివరి రోజు కమిటీ ప్రతినిధుల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజల అనంతరం అంకమ్మతల్లికి అన్నాభిషేకం చేశారు. అలాగే భక్తులకు అన్నసంతర్పణ జరిగింది. వేడుకల్లో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

రేపు మిర్చి, పొగాకు రైతుల సమావేశం

చెరుకూరు(పర్చూరు), ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): పర్చూరు మండల పరిధిలోని చెరుకూరు గ్రామంలో నల్లమడ రైతు సంఘం ఆధ్వర్యంలో మార్చి 2న మిర్చి, పొగాకు రైతుల సమావేశం జరుతుందని నల్లమడ రైతు సంఘం ప్రతినిధులు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు.

రైతుల సమక్షంలో రీ సర్వే


దైవాలరావూరులో రీసర్వే గురించి రైతులతో మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్ ప్రఖర్ జైన్

జాయింట్ కలెక్టర్ ప్రఖర్ జైన్

మేదరమెట్ల, ఫిబ్రవరి 28(ఆంధ్రజ్యోతి): భూముల రీసర్వే రైతుల సమక్షంలో జరిగేలా చూడాలని జేసీ ప్రఖర్‌జైన్ తెలిపారు. శుక్రవారం మండలంలోని దైవాలరావూరులో రీసర్వేను ఆయన అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా అక్కడకు వచ్చిన రైతులను మీకు నోటీసులు ఇచ్చారా లేదా అని ప్రశ్నించారు. అక్కడ ఉన్న సర్వే నెంబర్‌లలో ఏ రైతుకు ఎంత భూమి ఉంది అని అడిగి తెలుసుకున్నారు. రైతుల సమక్షంలో సర్వే చేయడం వలన తప్పులు దొర్లకుండా ఉంటాయన్నారు. ఈ సందర్భంగా దైవాలరావూరు రైతులు 255 సర్వే నెంబర్‌లో ఉన్న గ్రామ కంఠాన్ని దేవదాయశాఖ నిషేధిత జాబితాలోకి తెచ్చిందని తెలిపారు. దేవాలయం భూమి 32 సెంట్లు ఉండగా గ్రామం మొత్తాన్ని 2016 సంవత్సరం నుంచి నిషేధిత జాబితాలో చేర్చారన్నారు. అదే విధంగా సర్వే నెంబర్ 30బై1లో చెరువు మాన్యం ఉండగా 30వ సర్వే నెంబర్ మొత్తాన్ని నిషేధిత జాబితాలోకి చేర్చారని రైతులు జేసీ దృష్టికి తీసుకువచ్చారు. ఈ రెండు సర్వే నెంబర్లను పరిశీలించి నివేదికలను తనకు పంపాలన్నారు. రోవర్‌ల పనితనం గురించి గ్రామ సర్వేయర్‌లను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో తూమాటి చంద్రశేఖర్ నాయుడు, తహసీల్దార్ జీవీ సుబ్బారెడ్డి, సర్వే ఇన్‌స్పెక్టర్ జీవీ ముసలయ్య, మండల సర్వేయర్ మహేష్ బాబు, వీఆర్‌వోలు నరసింహారావు, నారాయణ, గ్రామ సర్వేయర్‌లు ఇమ్మానియేలు, రైతులు ముమ్మన నరసింహారావు, శ్రీనివాసరావు, రావి ఆంజనేయులు, బొక్కిసం జనార్దన్, ఆనంద్, సురేష్, దశరథరామయ్య తదితరులు పాల్గొన్నారు.


పూనూరు లో రీసర్వే పనులను పరిశీలిస్తున్న ఆర్‌డీవో గ్లోరియా, తహసీల్దారు రవికుమార్ తదితరులు

15 నాటికి రీ సర్వే పనులు పూర్తిచేయాలి

యద్దనపూడి,(మార్టూరు):యద్దనపూడి మండలం పూనూరుగ్రామంలో జరుగుతున్న రీసర్వే పనులు ఈ నెల 15 వతేదీ నాటికి పూర్తిచేయాలని ఆర్‌డీవో గ్లోరియా రీసర్వే బృందాలను ఆదేశించారు. ఆమె శుక్రవారం పూనూరు గ్రామంలో రీసర్వే జరుగుతున్న పొలాలను పరిశీలించారు. గ్రామాల సరిహద్దు, పొలాల హద్దులు, ప్రభుత్వ భూములు తదితర వివరాలను సక్రమంగా నమోదు చేయాలన్నారు. ఈ రీసర్వేలో ఎలాంటి లోపాలు జరగకూడదన్నారు. అదేవిధంగా రీసర్వే జరుగుతున్న వివరాలను తహసీల్దారు కె. రవికుమార్‌ను అడిగి తెలుసుకున్నారు. పూనూరు గ్రామంలో4,900 ఎకరాలు పొలాలు ఉండగా వాటిలో 2,800 ఎకరాల సర్వే పూర్తయ్యిందని తహసీల్దారు ఆర్‌డీవోకు తెలిపారు. అంతేగాకుండా 4 ప్రత్యేక బృందాలు సర్వే చేస్తున్నాయన్నారు. గ్రామంలోని రైతుల సహకారంతో నిష్పక్షపాతంగా సర్వే చేస్తున్నామన్నారు.ఈ కార్యక్రమంలోడీఐ శ్రీనివాసరావు, డీటీ మస్తాన్‌రావు, మండల సర్వేయరు సాంబశివరావు, పలువురు వీఆర్‌వోలు, రైతులు పాల్గొన్నారు.

రుణాలను సద్వినియోగం చేసుకోవాలి

- ఏపీఎం రామకృష్ణ

పర్చూరు, ఫిబ్రవరి 28(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం స్వయం సహాయ సంఘాల సభ్యులకు బ్యాంకు లింకేజ్ ద్వారా అందజేస్తున్న రుణాలను సద్వినియోగం చేసుకోవాని ఏపీఎం రామకృష్ణ కోరారు. శుక్రవారం యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా పర్చూరు బ్రాంచ్, అన్నంబొట్లవారిపాలెంలో ఎస్‌హెచ్‌జీ రుణమేళా జరిగింది. అందులో భాగంగా పర్చూరు బ్రాంచ్ పరిధిలో రూ.60 లక్షలను లబ్ధిదారులకు అందజేశారు. అందులో 10 మంది లబ్ధిదారులకు రూ.లక్ష చొప్పున అందజేయగా, టెంట్ హౌస్‌కు ఇద్దరు సభ్యులకు రూ.6,40000, గొర్రెల యూనిట్‌కు రూ.300000 మంజూరు, బ్యాంక్ లింకేజ్ ద్వారా రూ.20 లక్షలకు సంబంధించిన మంజూరు పత్రాలను లబ్ధిదారులకు అందజేశారు. ఈకార్యక్రమంలో బ్రాంచ్ మేనేజర్ ప్రదీప్ కుమార్, యూబీఐ ఫీల్డ్ ఆఫీసర్ లిజిపాన్, సీసీలు పి.ప్రమీల, విజయ్ కుమార్, ఎం.శ్రీనివాసరావు, వీఏవోలు గ్రూప్ సభ్యులు పాల్గొన్నారు.


రుణాల మంజూరు పత్రాలు అందజేస్తున్న బ్యాంక్ మేనేజర్ ప్రదీప్ కుమార్, ఏపీఎం రామకృష్ణ, సిబ్బంది

సంఘాల బలోపేతానికి కృషి


కార్యక్రమంలో మాట్లాడుతున్న ఏపీఎం కోటేశ్వరరావు

అద్దంకిటౌన్, : స్వయం సహాయక, మండల, గ్రామ సంఘాలు బలోపేతానికి రానున్న ఐదు సంవత్సరాలలో అనుసరించాల్సిన మార్గాలను గురించి ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని వెలుగు ఏపీఎం సీహెచ్ కోటేశ్వరరావు అన్నారు. శుక్రవారం వెలుగు కార్యాలయంలో విజన్ బిల్డింగ్‌పై మండలంలోని 42 గ్రామ సమైఖ్య సంఘాల అధ్యక్షులకు శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా ఏపీఎం మాట్లాడుతు ప్రతి గ్రూపు అభివృద్ధి వైపు నడవాలంటే పొదుపు, రుణాలు సక్రమంగా జరుపుకుంటూ, సబ్సిడీతో కూడిన రుణాలను ఉపయోగించుకుని ఆదాయం వచ్చే మార్గాలను అనుసరిస్తూ ఆదాయం సృష్టించుకోవాలన్నారు. ఈక్రమంలో ఆదర్శ గ్రామం ఎలా ఉండాలో, పేదరికం నుంచి బయటకు రావాలంటే ఏఏ మార్గాలను అనుసరించాలి అనే విషయాలను చార్టుల ద్వారా సభ్యులకు ఏపీఎం, సీసీ శ్రీనివాసరావు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సీసీలు, వీవోలు, అ కౌంటెంట్ శ్యామల తదితరులు పాల్గొన్నారు.

100 రోజుల పని కల్పించాలి

- లక్ష్యాలను పూర్తి చేయాలి
- డ్వామా పీడీ విజయలక్ష్మి


సమావేశంలో మాట్లాడుతున్న డ్వామా పీడీ విజయలక్ష్మి

అద్దంకిటౌన్, ఫిబ్రవరి 28(ఆంధ్రజ్యోతి): గ్రామాలలోని అన్ని కుటుంబాలకు 100 రోజులు ఉపాధి హామీ పనులు కల్పించాలని, మార్చి నాటికి లక్ష్యాలను పూర్తి చేయాలని డ్వామా పీడీ ఏవీ విజయలక్ష్మి అన్నారు. శుక్రవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలోని సమావేశపు హాల్లో అద్దంకి, కొరిశపాడు మండలాలకు సంబంధించిన ఉపాధి హామీ పథకం అధికారులు, ఫీల్డ్ అసిస్టెంట్‌లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మండలాలు, గ్రామాల వారీగా ఇప్పటి వరకు జరిగిన పనుల వివరాలను, చేపట్టాల్సిన పనుల గురించి అడిగి తెలుసుకున్నారు. ప్రతి కూలీకి సగటు వేతనం 300 రూపాయలు వచ్చేలా చూడాలని, కూలీలను చైతన్య పరిచి పని చేయించాలని అన్నారు. ప్రతి గ్రామ పంచాయతీలో లక్ష్యం మేరకు ఫారం పాండ్ల నిర్మాణం పూర్తి చేయాలని సూచించారు. ఉద్యానశాఖ ద్వారా అర్హులైన రైతులకు వంద శాతం సబ్సిడీతో ఉద్యాన పంటలు సాగు చేసేలా ప్రోత్సహించాలన్నారు.ఫీల్డ్ అసిస్టెంట్‌లు నిర్లక్ష్యంగా ఉండకుండా ఇచ్చిన లక్ష్యాలను త్వరగా పూర్తి చేయాలన్నారు. కొత్త జాబ్ కార్డు కావాల్సిన వారికి 24 గంటల్లో అందించాలన్నారు. మంత్రి గొట్టిపాటి రవికుమార్ నియోజకవర్గంలో ఎక్కడా ఎటువంటి తప్పులు జరగకుండా అనుకున్న లక్ష్యాలను పూర్తి చేసి ప్రభుత్వానికి, మంత్రికి పేరు తేవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీడీ కోటయ్య నాయక్, ఎంపీడీవోలు బత్తిన శింగయ్య, రాజ్యలక్ష్మి, ఏపీవో శోభన్‌బాబు, ఉద్యానశాఖ అధికారిణి ఎస్. దీప్తి, ఏపీవోలు గాయత్రిదేవి, కోటేశ్వరి, ఈసీలు, టీఏలు, ఫీల్డ్ అసిస్టెంట్‌లు పాల్గొన్నారు.

పొలం ఉన్న ప్రతిరైతు రిజిస్ట్రేషన్ చేయించాలి

- జిల్లా వ్యవసాయాధికారి రామకృష్ణ

పంగులూరు, ఫిబ్రవరి 28(ఆంధ్రజ్యోతి):పొలం ఉన్న ప్రతి రైతు తప్పనిసరిగా రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని జిల్లా వ్యవసాయాధికారి వై.రామకృష్ణ అన్నారు. మండలంలోని ముప్పవరం రైతు సేవా కేంద్రంలో జరుగుతున్న రైతు రిజిస్ట్రేషన్ ప్రక్రియను శుక్రవారం ఏవో రామకృష్ణ స్థానిక అధికారులతో కలసి పరిశీలించారు. ముప్పవరం రైతు సేవాకేంద్రంలో స్వయంగా రైతు రిజిస్ట్రేషన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న పథకాలు అందాలంటే రైతు రిజిస్ట్రేషన్ తప్పనిసరి అన్నారు. రైతులు తమ మొబైల్ నెంబరు ఆధార్‌కు లింక్ చేసుకోక పోయినా ఫేషియల్ అథెంటికేషన్ ద్వారా రైతు రిజిస్ట్రేషన్ చేస్తారన్నారు. 2024 - 2025 సంవత్సరానికి సంబంధించి రబీలో సాగు చేసిన పంటల వివరాలను రైతు సేవా కేంద్రాలలో మార్చి 3వ తేదీలోగా ఈకేవైసీ చేయించుకోవాలని సూచించారు. రైతులు తాము పండించిన పంట ప్రభుత్వ మద్దతు ధరకు అమ్ముకోవాలన్నా, ప్రకృతి వైపరీత్యాలతో జరిగిన పంట నష్ట పరిహారం ప్రభుత్వం నుంచి పొందాలన్నా, సున్నా వడ్డీ రాయితీతో పాటు వ్యవసాయ పనిముట్లు పొందేందుకు ఈకేవైసీ విధిగా చేయించాలన్నారు. ఈ కార్యక్రమంలో మార్టూరు ఏడీఏ శ్రీనివాసరావు, ఏవో సుబ్బారెడ్డి, రైతు సేవాకేంద్ర అధికారిణి దిల్లా పాల్గొన్నారు.


ముప్పవరం రైతు సేవా కేంద్రంలో రైతు రిజిస్ట్రేషన్‌ను పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయాధికారి రామకృష్ణ

నేటి నుంచి ఇంటర్ పరీక్షలు

- అద్దంకిలో మూడు పరీక్షా కేంద్రాలు
- హాజరు కానున్న 1,040 మంది విద్యార్థులు

అద్దంకిటౌన్, ఫిబ్రవరి 28(ఆంధ్రజ్యోతి): ఇంటర్ మీడియట్ ప్రథమ సంవత్సరం పరీక్షలు శనివారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఈ క్రమంలో అద్దంకిలో మూడు పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. శ్రీ ప్రకాశం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 359 మంది విద్యార్థులు, శ్రీ చైతన్య జూనియర్ కళాశాలలో 410 మంది, వి శ్వభారతి జూనియర్ కళాశాలలో 271 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పరీక్షలు జరుగుతాయి. విద్యార్థులు ఉదయం గంట ముందుగానే పరీక్ష కేంద్రాలకు చేరుకోవాలని 8.30 తరువాత పరీక్షా కేంద్రంలోకి అనుమతించమని అధికారులు తెలిపారు.


పరీక్షల నిర్వహణపై సిబ్బందికి సూచనలు చేస్తున్న చీఫ్ రవీంద్రబాబు

ఏర్పాట్లు పూర్తి

బల్లికురవ : స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శనివారం నుంచి ఇంటర్ మొదటి సంవత్సర పరీక్షలు ప్రారంభం అవుతున్నాయని, పరీక్షల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని చీఫ్ రవీంద్రబాబు తెలిపారు. ఈసందర్భంగా ఆయన కళాశాల సిబ్బందితో మాట్లాడుతూ మొదటిసారిగా బల్లికురవకు పరీక్ష కేంద్రం మంజూరైందని, ఈ కేంద్రంలో బల్లికురవ, కేజీబీవీ, వలపర్ల కళాశాలకు చెందిన 135 మంది పరీక్షలు రాయనున్నారని ఆయన తెలిపారు. కట్టుదిట్టంగా పరీక్షలు నిర్వహిస్తామని ఆయన తెలిపారు.

చినకొత్తపల్లి పంచాయతీలో రికార్డుల తనిఖీకి ఆదేశాలు

అద్దంకి, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చినకొత్తపల్లి గ్రామ పంచాయతీలో గత 5 సంవత్సరాల కాలంలో జరిగిన లావాదేవీల పై విచారణకు జిల్లా పంచాయతీ అధికారి ఆదేశించారు. విచారణ అధికారిగా అద్దంకి ఈవో అండ్‌పీఆర్ డి ప్రసాద్‌ని నియమిస్తూ ఉత్తర్వులు ఇచ్చారు. 2021-22 నుంచి 2024-25 ఆర్థిక సంవత్సరాల మధ్య కాలంలో గ్రామ పంచాయతీలో జరిగిన ఖర్చులు, పన్నులు వసూలు తదితర అంశాలపై 10 వ తేదీ లోపు నివేదిక ఇవ్వాలని డీపీవో ప్రభాకరరావు ఉత్తర్వులు ఇచ్చారు. ఈ మేరకు స్థానిక తమ కార్యాలయానికి సమాచారం అందినట్లు ఎంపీడీవో శింగయ్య తెలిపారు. ఉపాధిహామీ నిధుల ద్వారా గత తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో చేసిన పనులకు సంబంధించి రూ. 15,74,823 ల బిల్లులను పనులు చేసిన టీడీపీ నేత మానం మురళీమోహన్‌దాస్‌కు చెల్లించకుండా సర్పంచ్ మల్లిక, అప్పటి పంచాయతీ కార్యదర్శులు నేరుగా బ్యాంక్ నుంచి డ్రా చేసి వేరే వ్యక్తికి చెల్లించారు. దీంతో ఇప్పటికే అధికారులు విచారణ చేసి సర్పంచ్ చెక్ పవర్‌ను మూడు నెలల పాటు రద్దు చేశారు. అప్పటి పంచాయతీ కార్యదర్శి ఈశ్వరరెడ్డిని సస్పెండ్ చేశారు. ఈ నేపథ్యంలో రికార్డుల పరిశీలనకు డీపీవో ఆదేశించారు.


చినకొత్తపల్లి పంచాయతీ కార్యాలయం (ఫైల్)

ఉచిత వైద్య శిబిరంలో 270 మందికి పరీక్షలు

చినగంజాం, ఫిబ్రవరి 28(ఆంధ్రజ్యోతి) : మండలంలోని పెద గంజాం గ్రామంలో ఒంగోలు కిమ్స్ హాస్పిటల్ ఆధ్వర్యంలో శుక్రవారం ఉచిత కంటి వైద్య శిబిరం జరిగింది. గ్రామ సర్పంచ్ నక్కల కృష్ణ, తెలుగు రైతు రాష్ట్ర కార్యనిర్వహక కార్యదర్శి ఆసోది సుబ్బారెడ్డి, టీడీపీ నాయకులు ఆసోది అంజిరెడ్డిల ఆధ్వర్యంలో గ్రామంలోని తూర్పు రచ్చబండ వద్ద ఉచిత వైద్య శిబిరం నిర్వహించినట్లు హాస్పిటల్ మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్ షేక్ రఫీ తెలిపారు. ఈశిబిరంలో కంటి, సాధారణ వ్యాధులకు సంబంధించి 270 మందికి వైద్య పరీక్షలు జరిపినట్లు తెలిపారు. బీ.పీ, షుగర్, ఈసీజీ తదితర పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేసినట్లు తెలిపారు. రోగ నిర్ధారణ జరిగిన 60 మందిని ఒంగోలు హాస్పిటల్‌కు రిఫర్ చేసినట్లు తెలిపారు. ఆరోగ్యశ్రీ, ఈఎస్ఐ, ఈహెచ్ఎస్, ఈసీహెచ్ఎస్ కార్డుల ద్వారా ఉచితంగా ఆపరేషన్లు నిర్వహిస్తామని, ప్రతి ఒక్కరికి కార్పొరేట్ స్థాయి వైద్యాన్ని అందిస్తామని అన్నారు. కార్యక్రమంలో కిమ్స్ హాస్పిటల్ వైద్య సిబ్బంది, అర్థమెట్రిక్స్ స్వాతి, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.


దగ్గుబాడు - ఇంకొల్లు మధ్య డ్రైనేజ్ వాగును పరిశీలిస్తున్న ఈఈ మురళీ కృష్ణ, డీఈ సుబ్బారావు, రైతులు

ఆలేరు వాగును పరిశీలించిన డ్రైనేజ్ అధికారులు

దగ్గుబాడు(పర్చూరు), ఫిబ్రవరి 28(ఆంధ్రజ్యోతి) : దగ్గుబాడు - ఇంకొల్లు మధ్య ఉన్న ఆలేరు వాగును బాపట్ల జిల్లా డ్రైనేజ్ ఈఈ మురళీ కృష్ణ నేతృత్వంలో అధికారులు శుక్రవారం పరిశీలించారు. వాగులో ముళ్ల చెట్లు పెరిగిపోయి నీటి పారుదల సక్రమంగా సాగటం లేదని, వాగుపై ఏర్పాటు చేసిన బ్రిడ్జిలు సైతం మరమ్మతులకు గురయ్యాయని, తక్షణం చర్యలు చేపట్టాలని ఆలేరు వాగు ఫార్మర్స్ కమిటీ అధ్యక్షులు గంటా విజయ్ కుమార్ ఆధ్వర్యంలో రైతులు డ్రైనేజ్ అధికారుల దృష్టికి తీసుకుపోయారు. దీనిపై స్పందించిన డ్రైనేజ్ అధికారులు ఆలేరు వాగును పరిశీలించి రైతుల నుంచి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈసందర్భంగా విజయ్‌కుమార్ మాట్లాడుతూ ఆలేరు వాగు పరిస్థితిని ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు దృష్టికి తీసుకుపోయామని, సమస్య పరిష్కారానికి కృషిచేస్తామని చెప్పారని అన్నారు. ప్రతిపాదనలు సిద్ధం చేసి ఉన్నతాధికారుల దృష్టికి తీసుకుపోయి చిల్లచెట్లను తొలగించటంతోపాటు, వాగుకు పడిన గండ్లను కూడా పూడ్చేవిధంగా చర్యలు తీసుకుంటామని డీఈ సుబ్బారావు తెలిపారు.

క్రైం సమాచారం

రాజుగారిపాలెంలో చోరీ

మార్టూరు,ఫిబ్రవరి28(ఆంధ్రజ్యోతి):మండలంలోని రాజుగారిపాలెం గ్రామంలో ఉప్పలపాటి శంకరరాజు అనే వ్యక్తి ఇంటిలో శుక్రవారం మధ్యాహ్నం గుర్తుతెలియని వ్యక్తులు దొంగతనం చేశారు. ఇంటిలో బీరువాలో ఉన్న 1.30 లక్షల రూపాయల నగదును ఎత్తుకు పోయారు.ఇంటి తాళం కప్పను గడ్డపారతో పగులగొట్టి ఇంటిలోకి ప్రవేశించి బీరువా తాళాలను ఊడగొట్టి అందులో ఉన్న నగదును ఎత్తుకుపోయారు.మార్టూరులో నెట్‌పాయింట్‌ను నిర్వహిస్తున్న శంకరరాజు దంపతులు యథావిధిగా శుక్రవారం ఉదయం మార్టూరు వచ్చారు. అయితే ఇంటిలో ఉన్న శంకరరాజు తల్లి విజయలక్ష్మి గ్రామంలో మందులు తీసుకోవడానికి వెళ్లారు.ఈ సమయంలో దాదాపుగా 11 గంటల నుంచి 12 గంటల సమయంలో గుర్తుతెలియని వ్యక్తులు ఈ చోరీకి పాల్పడ్డారు. ఇంటికి వచ్చిన విజయలక్ష్మి దొంగతనం జరిగిన విషయం గ్రహించి కుమారునికి సమాచారం అందించారు. దాంతో శంకరరాజు పోలీసులకు ఫిర్యాదు చేశారు. మార్టూరు పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. స్థానిక పోలీసులు విచారణ చేస్తున్నారు.


ఇంటిలో దొంగలు పగులగొట్టిన బీరువా


డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో జరిమానా

అద్దంకి, ఫిబ్రవరి28(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని రామ్‌నగర్‌లో మద్యం సేవించి మోటార్ బైక్ నడుపుతున్న వ్యక్తిని పోలీసులు అదుపులోకి తీసుకొని శుక్రవారం కోర్టులో హాజరుపరచగా 4 రోజులు జైలు శిక్ష, రూ. 3 వేల జరిమానా సెకండ్ క్లాస్ మేజిస్ట్రేట్ శింగయ్య విధించినట్లు సీఐ సుబ్బరాజు తెలిపారు. నిందితుడిని ఒంగోలు జైలుకు తరలించినట్లు తెలిపారు.

ANDHRAJYOTHY

ఆంధ్రజ్యోతి

5



శ్రీ పొట్టిశ్రీరాములు నెల్లూరు

జిల్లా వార్తలు

శనివారం 1 మార్చి 2025



ఆదిదంపతులు కొలువైన రథాన్ని లాగుతున్న భక్తజనం

హరహర శంకర.. జయజయ శంకర..!

ఉత్సాహంగా మూలస్థానేశ్వరుడి రథోత్సవం

నగరంలోని మూలాపేట వీధులు శివశివ శంభో.. హరిహర శంకర.. హరిఓం శంకర.. జయజయ శంకర అనే నామస్మరణలతో మారుమోగాయి. శివరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా భువనేశ్వరీ సమేత మూలస్థానేశ్వర స్వామికి రథోత్సవం వైభవంగా జరిగింది. యువత, మహిళలు పెద్ద సంఖ్యలో తరలివచ్చి రథాన్ని ముందుకు లాగారు. ఉదయం మహాన్యాస పూర్వక రుద్రాభిషేకాలు, రుద్రహోమాలు జరిగాయి. భువనేశ్వరీ సమేత మూలస్థానేశ్వరుడికి ప్రత్యేక అలంకారం, విశేష పూజలు జరిగాయి. అర్చకుల వేదమంత్రాలు.. మంగళవాయిద్యాలు.. శివనామ స్మరణలతో ఉత్సవర్లను పల్లకిలో ఊరేగింపుగా రథం వద్దకు తీసుకువచ్చి ప్రతిష్ఠించారు. ఉభయకర్త గిరీష్‌కుమార్‌రెడ్డి, నారాయణ విద్యా సంస్థల జీఎం వేమిరెడ్డి విజయభాస్కర్‌రెడ్డి, శివరాత్రి ఫెస్టివల్ అధికారి జిల్లా దేవదాయ సహాయ కమిషనర్ కోవూరు జనార్దన్‌రెడ్డి, ఈవో అర్వభూమి వెంకటశ్రీనివాసులురెడ్డిలు గుమ్మడి, కొబ్బరికాయలతో దిష్టి తీశారు. ఆ తర్వాత కదిలిన రథం బ్రాహ్మణ వీధి, ఈఎస్ఆర్ఎం హైస్కూల్, పొట్టిశ్రీరాములు విగ్రహం, అలంకార్ సెంటర్, రాజాగారివీధి, రావిచెట్టు సెంటర్ మీదుగా శివాలయం సెంటర్‌కు చేరింది. ఈ సందర్భంగా దారిపొడవునా భక్తులు ఆదిదంపతులకు కర్పూర నీరాజనాలు అందజేశారు. రథోత్సవంలో పాల్గొన్న భక్తుల ఆకలిదప్పులు తీర్చేందుకు స్థానికులు మజ్జిగ, రస్నా, కేసరి, పుచ్చకాయలు తదితర పదార్థాలను ఉచితంగా పంపిణీ చేశారు. అలాగే మూలాపేటలో వెలసి వున్న అన్నపూర్ణ సమేత నీలకంఠేశ్వర స్వామి వారి రథోత్సవం కూడా ఉత్సాహంగా సాగింది. రాత్రి నీలకంఠేశ్వరస్వామికి పుణ్యకోటి విమానంలో నగరం ఉత్సవం కనుల పండువగా జరిగింది.

- నెల్లూరు (సాంస్కృతికం, ఆంధ్రజ్యోతి)

విజయోస్తు..!

నేటి నుంచి ఇంటర్ పరీక్షలు ● 79 కేంద్రాల్లో నిర్వహణ

నెల్లూరు (విద్య), ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి) : ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షలకు విద్యార్థులు పూర్తిస్థాయిలో సన్నద్ధమవగా, ఎలాంటి లోటుపాట్లు రానీయకుండా అధికార యంత్రాంగం పటిష్ఠ ఏర్పాట్లు చేసింది. శనివారం నుంచి 20వ తేదీ వరకు జరిగే పరీక్షలను జంబ్లింగ్ విధానంలో జిల్లావ్యాప్తంగా 79 కేంద్రాల్లో నిర్వహిస్తున్నారు. ప్రతిరోజూ ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ఈ పరీక్షలు జరుగుతాయి. అయితే, ఉదయం 8.30 గంటలకే కేంద్రానికి చేరుకోవాలని అధికారులు సూచిస్తున్నారు. నిర్ణీత సమయం దాటాక సహేతుక కారణాలతో కేంద్రానికి చేరుకునే విద్యార్థులను మాత్రమే 2 నుంచి 5 నిమిషాల ఆలస్యం వరకు అనుమతిస్తారు. కాగా, ఇంటర్ ప్రథమ సంవత్సరంలో జనరల్ విభాగంలో 26,931 మంది, ఒకేషనల్ 1245 మంది కలిపి 28,176 మంది హాజరవుతున్నారు. అలాగే ద్వితీయ సంవత్సరంలో జనరల్‌లో 23,994, ఒకేషనల్‌కు 1030 మంది కలిపి 25,024 మంది పరీక్షలు రాయనున్నారు. ప్రథమ, ద్వితీయ సంవత్సరం కలిసి మొత్తంగా 53,200 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కానున్నారు. మరోవైపు పరీక్షలను పకడ్బందీగా నిర్వహించేందుకు 1400 మంది సిబ్బందిని, హైపవర్ కమిటీతోపాటు జిల్లా పరీక్షల కమిటీ, నాలుగు ఫ్లయింగ్ స్క్వాడ్‌లు, ఐదు సిట్టింగ్ స్క్వాడ్‌లు నియమించడంతోపాటు కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేస్తున్నారు.

సీసీ కెమెరాల నిఘా

ఇంటర్ పరీక్షలను సీసీ కెమెరాల నిఘా నీడలో నిర్వహిస్తున్నారు. అన్ని పరీక్షా కేంద్రాల్లో ఒక్కో కేంద్రానికి 4 సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. విద్యార్థుల తోపాటు ఇన్విజిలేటర్లు కూడా కేంద్రంలోకి సెల్‌ఫోన్‌లు, క్యాలుకులేటర్లు వంటి వస్తువులు, కాగితాలను అనుమతించరు. 79 కేంద్రాల్లో 12 సమస్యాత్మక కేంద్రాలుగా గుర్తించిన అధికారులు బందోబస్తును కట్టుదిట్టం చేశారు. పరీక్షల నిర్వహణలో ఏదైనా సమాచారం పొందాలన్నా, ఇబ్బందులను తెలియచేయాలన్నా నగరంలోని ఆర్ఐఓ కార్యాలయంలో కంట్రోల్ రూమ్, ఫోన్ 0861-2320312 నెంబర్ అందుబాటులో ఉంచారు. విద్యార్థులు ఎలాంటి ఆందోళన చెందకుండా, కంగారుపడకుండా ప్రశాంత వాతావరణంలో పరీక్షలకు హాజరు కావాలని, వారికి పూర్తి సదుపాయాలను ఏర్పాటు చేసినట్లు ఆర్ఐఓ డాక్టర్ శ్రీనివాసులు తెలిపారు.

ఎన్ని పులులు ఉన్నాయ్..

ఎక్కడున్నాయ్!?

- నేటినుంచి 45 రోజులపాటు గణన
- 3 రేంజ్‌లలో 240 సీసీ కెమెరాల ఏర్పాటు

నెల్లూరు (వెంకటేశ్వరపురం), ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి) : జిల్లావ్యాప్తంగా విస్తరించి ఉన్న అటవీ ప్రాంతంలో శనివారం పులుల గణన ప్రారంభం కానుంది. ఇప్పటికే రాపూరు, ఉదయగిరి, ఆత్మకూరు రేంజ్‌ల పరిధిలోని దాదాపు 1.50 హెక్టార్ల అటవీ ప్రాంతాన్ని టైగర్ కారిడార్‌గా మార్పు చేస్తూ కేంద్ర ప్రభుత్వం ఇటీవల నిర్ణయం తీసుకొన్నది. రాష్ట్రంలో అరుదుగా కనిపించే పులుల కదలికలు జిల్లాలోనూ గుర్తించారు. తిరుపతి వైపు శేషాచలం టైగర్ కారిడార్‌కు, ప్రకాశం జిల్లా వైపు నల్లమల టైగర్ కారిడార్‌కు మధ్యలో ఉన్న నెల్లూరు జిల్లా అటవీ ప్రాంతంలో పులుల కదలికలు పెరిగాయి.

● అటవీ సిబ్బందికి శిక్షణ

నాలుగేళ్లకు ఒకసారి జరిగే పులుల గణన మొదట నాగార్జునసాగర్, శ్రీశైలం టైగర్ రిజర్వు ఫారెస్టు ప్రాంతాల్లో పూర్తిచేశారు. శనివారం నుంచి ప్రకాశం, నెల్లూరు, తిరుపతి జిల్లాల పరిధిలోని నల్లమల, శేషాచలం టైగర్ కారిడార్ ప్రాంతాల్లో పులుల గణన జరగనున్నది. 45 రోజులపాటు అంటే ఏప్రిల్ 14వ తేదీ వరకు జరిగే గణన కోసం ఇప్పటికే రాపూరు, ఉదయగిరి, ఆత్మకూరు రేంజ్‌ల పరిధిలో 240 సీసీ కెమెరాలను అటవీశాఖ ఏర్పాటు చేసింది. పులుల గణన ఎలా చేయాలో అన్న అంశంపై అటవీ సిబ్బందికి నిపుణుల ద్వారా శిక్షణ కూడా ఇప్పించారు.

● 3 పులుల గుర్తింపు



ఆత్మకూరు రేంజ్‌లో గుర్తించిన పెద్దపులి

ఆత్మకూరు రేంజ్ పరిధిలో ఇప్పటికే మూడు పులులను అటవీ శాఖ గుర్తించింది. గత సంవత్సరం మర్రిపాడు మండలం కదిరినాయుడిపల్లి ప్రాంతంలో పులిని కారు ఢీకొన్న ఘటనతో అప్రమత్తమైన అటవీ అధికారులు అనేక చోట్ల సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. దీంతో ఆత్మకూరు, ఉదయగిరి, రాపూరు రేంజ్‌ల పరిధిలో మగ, ఆడపులుల పాదముద్రలను గుర్తించారు. అదేవిధంగా ఈ నెలలో (ఫిబ్రవరి) చిట్వేల్ ఘాట్‌లో కూడా ఓ పులిని గుర్తించారు. దీంతో జిల్లాలో మూడు పులులు ఉన్నట్లు తేలింది. అయితే శనివారం నుంచి జరగనున్న పులుల గణనలో జిల్లావ్యాప్తంగా ఎన్ని పులులు ఉన్నాయో స్పష్టత రానున్నట్లు అటవీ శాఖ అధికారులు తెలిపారు.

ఆశలు.. ఆకాంక్షలతో..


- పయ్యావుల పద్దులో సింహపురికి సముచిత స్థానం
- సాగునీటి ప్రాజెక్టులకు భారీగా నిధులు
- తెలుగుగంగ ప్రాజెక్టుకు రూ.345 కోట్లు
- సోమశిల జలాశయానికి రూ.266 కోట్లు
- యూనివర్సిటీ అభివృద్ధికి రూ.20.53 కోట్లు
- రామాయపట్నం పోర్టుకు రూ.100 కోట్లు
- తల్లులకు, మత్స్యకారులకు చేయూత

కూటమి ప్రభుత్వం తొలి బడ్జెట్ ప్రజల ఆశకు, ఆశయాలకు అనుగుణంగానే ఉందనే అభిప్రాయం సర్వత్రా వ్యక్తమవుతోంది. అభివృద్ధి-సంక్షేమం రెండు కళ్లు అనే కూటమి నినాదానికి ఈ బడ్జెట్ అనుగుణంగా ఉందని అభిప్రాయపడుతున్నారు. సాగునీటి ప్రాజెక్టులకు చెప్పుకోదగ్గ స్థాయిలో కేటాయింపులు జరిగాయి. అలాగే నిధుల కేటాయింపులతో పెండింగ్ ప్రాజెక్టుల పనుల్లోనూ కదలిక మొదలు కానుంది. ఇక తల్లికి వందనం, అన్నదాత సుఖీభవ తదితర పథకాలకూ భారీగా నిధులు కేటాయించారు. మరోవైపు విక్రమ సింహపురి విశ్వవిద్యాలయం, రామాయపట్నం పోర్టుకూ నిధులు విడుదల కానున్నాయి. మొత్త మ్మీద ఎన్డీఏ కూటమి ప్రవేశపెట్టిన బడ్జెట్ అన్ని వర్గాల ప్రజల్లో ఆనందం వ్యక్తమవుతోంది.

నెల్లూరు, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ శుక్రవారం ప్రవేశపెట్టిన 2025-26 బడ్జెట్‌లో జిల్లాకు సముచిత స్థానం దక్కింది. ప్రధానంగా సాగునీటి ప్రాజెక్టులకు ఊతమిచ్చేలా ప్రభుత్వం బడ్జెట్‌లో కేటాయింపులు జరిపింది. ఈ నిధులతో పెండింగ్ ప్రాజెక్టుల్లో వేగం పెరగనుంది. తెలుగుగంగ ప్రాజెక్టుకు రూ.345.48 కోట్లు కేటాయించారు. కండలేరు జలాశయంతోపాటు తెలుగుగంగ కెనాల్ వ్యవస్థ మొత్తం ఈ ప్రాజెక్టు కిందకు వస్తుంది. ఈ ప్రాజెక్టు పరిధిలో అనేక కాలువల నిర్మాణం జరుగుతోంది. అలానే సోమశిల ప్రాజెక్టుకు రూ.266 కోట్లు కేటాయించారు. ఇందులో రూ.150 కోట్ల వరకూ భూసేకరణకు కేటాయించడం విశేషం. ప్రస్తుతం సోమశిల హైలెవల్ కెనాల్‌కు భూసేకరణ పెద్ద సమస్యగా ఉంది. ఈ నిధులతో భూసేకరణ పూర్తయితే ప్రాజెక్టు వేగం పుంజుకోనుంది. అలాగే పెన్నా రివర్ కెనాల్ సిస్టమ్‌కు రూ.50.42 కోట్లు బడ్జెట్‌లో కేటాయించారు. డెల్టాలో ప్రస్తుతం సర్వేపల్లి కాలువ, మలిదేవి డ్రెయిన్, పెన్నా ప్రొటెక్షన్ వాల్స్, ముదివర్తిపాలెం కాజ్‌వే వంటి కీలక పనులు జరుగుతున్నాయి. ప్రస్తుత బడ్జెట్‌లో కేటాయింపులతో ఆ పనులు ఊపందుకోనున్నాయి. కనుపూరు కాలువ అభివృద్ధికి రూ.7 కోట్లు ప్రభుత్వం కేటాయించింది. మరో కీలక ప్రాజెక్టు సోమశిల-స్వర్ణముఖి లింక్ కెనాల్‌కు ఈదఫా రూ.69 కోట్లు కేటాయించారు. వెంకటగిరి, శ్రీకాళహస్తి నియోజకవర్గాలకు తాగు, సాగునీరు అందించడంలో ఈ కాలువ కీలకంగా మారుతుంది. అయితే కొంతకాలంగా నిధులు లేక ఈ కాలువ పనులు సాగడం లేదు. మొత్తంగా ఎన్టీఆర్ తెలుగుగంగ ప్రాజెక్టు సర్కిల్‌కు రూ.840 కోట్లను ప్రభుత్వం కేటాయించింది. 2024-25లో రూ.887 కోట్లు కేటాయించినా చివరకు రూ.406 కోట్లు మాత్రమే ఖర్చు చేశారు. ఈదఫా రెట్టింపు కేటాయింపులు ఉన్న నేపథ్యంలో ఆ నిధులన్నింటినీ సక్రమంగా ఉపయోగించుకుంటే ప్రధాన ప్రాజెక్టులు, కాలువల రూపురేఖలు మారుతాయి.



● ఎన్నికల్లో ఎన్డీఏ కూటమి హామీ మేరకు ఒక కుటుంబంలో ఎంతమంది పిల్లలు చదువుతుంటే అంతమందికి ఒక్కొక్కరికి ఏడాదికి రూ. 15వేలు చొప్పున తల్లికి వందనం పథకం కింద తల్లుల ఖాతాల్లో జమ చేయనున్నారు, గత ప్రభుత్వ హయాంలో కుటుంబంలోని ఒక్క విద్యార్థికి మాత్రమే ఈ పథకాన్ని పరిమితం చేయడంతో లబ్ధిదారుల సంఖ్య 2.50 లక్షలకు మించలేదు. ఇందులోనూ ఏడాదికేడాది కోత పెడుతూ ఎన్నికల సంవత్సరం వచ్చే నాటికి 1.75 లక్షల మందికే అమ్మఒడి పథకాన్ని పరిమితం చేశారు. అయితే కూటమి ప్రభుత్వం ఈ పథకం వర్తించే క్రమం లో తల్లుల సంఖ్య పెద్దగా పెరగక పోయినా వారికి ఇచ్చే ఆర్థిక సాయం మాత్రం దాదాపు రెట్టింపు అయ్యే సూచనలు కనిపిస్తున్నాయి. గత వైసీపీ ప్రభుత్వంలో అమ్మఒడి కింద ఏడాదికి 262 కోట్లు పంపిణీ చేస్తుండగా, కూటమి ప్రభుత్వంలో లబ్ధిపొందే విద్యార్థుల సంఖ్య 30 నుంచి 40 శాతం పెరగనున్న దృష్ట్యా తల్లికి వందనం పథకం ద్వారా జిల్లాలో ఏడాదికి రమారమి 350 కోట్ల రూపాయ లకుపైగా తల్లులకు పంపిణీ చేయనున్నారు.





● వీఎస్‌యూకు రూ.20.53 కోట్లు

ఇక విక్రమ సింహపురి యూనివర్సిటీకు కూడా బడ్జెట్‌లో రూ.20.53 కోట్లను కేటాయించారు. ఈ నిధులతో యూనివర్సిటీలో అభివృద్ధి పనులు చేపట్టడంతోపాటు కొత్త పరిశోధనలకు చేయూత లభించనుంది. అదే విధంగా రామాయపట్నం పోర్టు నిర్మాణానికి సంబంధించి రూ.100 కోట్లను కేటాయించారు.

● అన్నదాత సుఖీభవ పథకం కూడా ఈ ఏడాది నుంచే అమలులోకి రానుంది. వైసీపీ ప్రభుత్వంలో రైతు భరోసా కింద కేంద్ర, రాష్ట్ర పభుత్వాలు కలిపి రూ.12వేలు ఇచ్చేవి. అయితే కూటమి ప్రభుత్వం ఈ మొత్తాన్ని భారీగా పెంచింది. రాష్ట్ర వాటాగా ఒక్కో రైతుకు 14వేలు ఇస్తామని, కేంద్ర వాటా 6వేలుతో కలిపి మొత్తం రూ.20 వేలు ఇస్తామని ఎన్నికల హామీలో ప్రకటించింది. ఆ మేరకు ఇప్పుడు అన్నదాత సుఖీభవ పథకం కింద జిల్లా పరిధిలోని అర్హులైన రైతులు సుమారుగా 1.77 లక్షల మంది ఉన్నారు. వీరికి గత ప్రభుత్వం రూ.106 కోట్లు పంపిణీ చేయగా ప్రస్తుత కూటమి ప్రభుత్వం రూ.16వేలు చొప్పున రూ.247 కోట్లు పంపిణీ చేయనుంది. అంటే గత ప్రభుత్వంతో పోల్చితే కూటమి ప్రభుత్వం అన్నదాత సుఖీభవ పథకం కింద పంపిణీ చేసే మొత్తం ఒకటిన్నర రెట్లు ఎక్కువ.



● ఇక మత్స్యకారులకు కూడా వేట నిషేధ సమయంలో ఇస్తున్న భృతిని పెంచనున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. ఈ నిర్ణయంతో జిల్లాలో 12 వేల మందికిపైగా మత్స్యకారులకు మరింత చేయూత లభించనుంది.



సూపర్‌సిక్స్ పథకాలకు పంగనామాలు



రాష్ట్ర బడ్జెట్ అంతా డొల్లే. సూపర్ సిక్స్ పథకాలకు పంగనామాలు పెట్టారు. ప్రజల ఆకాంక్షలకు వ్యతిరేకంగా ఉంది. ఇది మంచి ప్రభుత్వం కాదని తొలి బడ్జెట్‌లోనే తేటతెల్లం అయింది. అన్నదాత సుఖీభవ పథకానికి రూ.6300 కోట్లు మాత్రమే కేటాయించటం అరకొరే. రాష్ట్రంలోని 54 లక్షల మంది రైతుల ఆశలపై నీళ్లు చల్లారు, కేంద్రం ఇచ్చే మ్యాచింగ్ గ్రాంట్ల కోసం రైతులను నిరీక్షించేటట్లు చేయటం సరికాదు. పండించిన పంటలకు గిట్టుబాటు ధర కూడా లేక రైతులు అల్లాడుతుంటే కేవలం రూ. 300 కోట్ల ధరల స్థిరీకరణ నిధిని ఇవ్వటం ద్రోహమే.

- చేవూరు దేవకుమార్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు

మ్యానిఫెస్టో అమలుకే ప్రాధాన్యం



అభివృద్ధి, సంక్షేమంతో పాటు మ్యానిఫెస్టోలో ఇచ్చిన హామీల అమలుకు బడ్జెట్‌లో అధిక ప్రాధాన్యత కల్పించారు. వ్యవసాయ, సాగునీటి రంగానికి అధిక నిధులు కేటాయించి రైతే రాజు అన్న నినాదానికి పెద్ద పీట వేశారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీల అభివృద్ధికి బాటలు వేసేలా రాష్ట్ర బడ్జెట్ ఉంది. గత ప్రభుత్వం వివిధ పథకాల పేరుతో నిధులను దారి మళ్లించగా, కూటమి ప్రభుత్వం మాత్రం దారి మళ్లింపునకు అవకాశం లేకుండా బడ్జెట్‌ను రూపొందించింది.

- షేక్ అబ్దుల్ అజీజ్, నెల్లూరు పార్లమెంటు టీడీపీ అధ్యక్షుడు

పేదల అభివృద్ధికి పెద్దపీట



కూటమి ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ పేదల అభివృద్ధికి పెద్ద పీట వేసింది. అణగారిన వర్గాలు ఆర్థికంగా ఎదిగేందుకు వీలుగా భారీగా నిధులు కేటాయించడం శుభపరిణామం. బీసీ సంక్షేమానికి రూ.23,260 కోట్లు, ఎస్సీ సంక్షేమానికి రూ.20,281 కోట్లు, ఎస్టీల సంక్షేమానికి రూ.8159 కోట్లు కేటాయించడం గొప్ప విషయం. ఎస్సీ ఎస్టీలు నిర్మించుకనే ఇళ్లకు కూడా ఆర్థిక చేయూతను ఇవ్వాలని నిర్ణయం తీసుకున్నారు. పట్టణాలను అభివృద్ధి చేయాలని నిర్ణయించిన ప్రభుత్వం ఆ మేరకు భారీగా నిధులను కేటాయించింది. ప్రభుత్వ కేటాయింపులతో రానున్న రోజుల్లో గుంతలు లేని రోడ్లను చూడవచ్చు.

- కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే

ప్రజల ఆకాంక్షల బడ్జెట్



రాష్ట్ర బడ్జెట్ అన్ని వర్గాల ఆకాంక్షలను ప్రతిబింబిస్తోంది. రాష్ట్ర పునఃనిర్మాణం దిశగా రూ.3.22 లక్షల కోట్లతో అభివృద్ధి, సంక్షేమమే ఎజెండాగా బడ్జెట్ కేటాయింపులు కూటమి ప్రభుత్వ చిత్తశుద్ధికి నిదర్శనం. అన్నదాత సుఖీభవ, తల్లికి వందనం పథకాలకు భారీ కేటాయింపులు చేయడం సంతోషించదగ్గ విషయం. వ్యవసాయ, జలవనరుల శాఖలకు కేటాయింపులు హర్షదాయకం. బీసీల సంక్షేమానికి సబ్ ప్లాన్ ద్వారా బడ్జెట్‌లో రూ.26.260 కేటాయించడం సంతోషకరం. ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ వర్గాల అభివృద్ధికి బాటలు వేశారు. అభివృద్ధి ఫలాలు అందరికీ అందేలా కేటాయింపులు చేయడం కూటమి ప్రభుత్వానికే సాధ్యమైంది.

- వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, నెల్లూరు ఎంపీ


వ్యవసాయ రంగానికి మంచి రోజులు



వైసీపీ ప్రభుత్వంలో నిర్వీర్యమైపోయిన వ్యవసాయ రంగానికి మంచి రోజులొచ్చాయి. బడ్జెట్‌లో వ్యవసాయం, సాగునీటి ప్రాజెక్టులకు పెద్దపీట దక్కింది. డ్రిప్ ఇరిగేషన్‌కు పూర్వవైభవం రావడంతో మెట్ట రైతులకు ఎంతో మేలు జరుగుతుంది. ఎన్టీఆర్ తెలుగుగంగ ప్రాజెక్టుకు రూ.840 కోట్లు కేటాయించడం గొప్ప విషయం. ఈ నిధులతో ఉమ్మడి నెల్లూరు జిల్లాలో అనేక కీలక ప్రాజెక్టుల్లో ముందడుగు పడుతుంది. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలకే కాకుండా ఆర్థికంగా వెనుకబడిన వర్గాల కోసం స్వయం ఉపాధికి నిధులు కేటాయించారు.

- సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, సర్వేపల్లి ఎమ్మెల్యే

సంక్షేమానికి పెద్దపీట



రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో సంక్షేమానికి పెద్ద పీట వేస్తూ నిధులు కేటాయించారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ సంక్షేమ పథకాలు కొనసాగించే దిశగా నిధుల కేటాయింపు జరిగింది. పిల్లల చదువును ప్రోత్సహించేందుకు ఇంట్లో చదువుతున్న పిల్లలందరికీ తల్లికి వందనం అందచేసేందుకూ కేటాయింపులు జరిగాయి. వ్యవసాయానికి ప్రాధాన్యత నిస్తూ కేటాయింపులు పెంచారు. సంక్షేమం, అభివృద్ధికి సమపాళ్లలో ప్రాధాన్యం ఇచ్చారు. మొత్తం మీద అన్ని వర్గాలకు ఆమోదయోగ్యంగా బడ్జెట్ ఉంది.

- దగుమాటి వెంకటక్రిష్ణారెడ్డి, ఎమ్మెల్యే, కావలి

ఇది ప్రజల ఆకాంక్షల బడ్జెట్



కూటమి ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ ప్రజల ఆకాంక్షల బడ్జెట్ అని, అద్భుతంగా ఉంది. అభివృద్ధి, సంక్షేమంతోపాటు హామీల అమలుకు బడ్జెట్‌లో ప్రాధాన్యతిచ్చారు. అన్నివర్గాల ప్రజలను బడ్జెట్ ఆకర్షిస్తోంది. రాష్ట్ర పునర్నిర్మాణం దిశగా రూ.3.22 లక్షల కోట్లతో అభివృద్ధి, సంక్షేమం కోసం బడ్జెట్ కేటాయింపులు చేయడం కూటమి ప్రభుత్వ చిత్తశుద్ధికి నిదర్శనం. అన్నదాత సుఖీభవ, తల్లికి వందనం పథకాలకు భారీగా నిధులు మంజూరు చేశారు.

- కాకర్ల సురేష్, ఉదయగిరి ఎమ్మెల్యే

మాట నిలబెట్టుకొంటున్న ప్రభుత్వం



ఇది మాట నిలబెట్టుకునే ప్రభుత్వం. బడ్జెట్ కేటాయింపులే ఇందుకు నిదర్శనం. ఆర్థికంగా రాష్ట్రం ఒడిదుడుకుల్లో ఉన్నా ఇచ్చిన మాట ప్రకారం సీఎం చంద్రబాబు సూపర్ సిక్స్‌లోని ఒక్కో హామీని నెరవేర్చుకొంటూ వస్తున్నారు. ఈ బడ్జెట్‌లో తల్లికి వందనం ద్వారా తల్లులకు ఇచ్చిన మాట నిలబెట్టుకున్నాము. అన్నదాత సుఖీభవ పథకం కింద గత ప్రభుత్వం ఇచ్చిన దానికంటే రెండున్నర రెట్లు అధికంగా రైతులకు పంపిణీ చేయనున్నాము. మున్సిపాలిటీల్లో మౌలిక సదుపాయాల కల్పనకు ఈ బడ్జెట్‌లో పెద్ద పీట వేశాము.

- పొంగూరు నారాయణ, రాష్ట్ర మున్సిపల్ శాఖ మంత్రి

తొలిసారిగా తెలుగుభాషకు రూ.10 కోట్లు



రాష్ట్ర బడ్జెట్‌లో అభివృద్ధి, సంక్షేమంతో పాటు హామీల అమలుకు అధిక ప్రాధాన్యత ఇచ్చారు. వ్యవవసాయ రంగాన్ని ఆదుకుంటాం అన్న ఎన్నికల నినాదాన్ని బడ్జెట్‌లో కేటాయింపుల ద్వారా ఆచరణలో అమలు చేసి చూపించడం హర్షణీమం. బీసీల సంక్షేమానికి సబ్ ప్లాన్‌తోపాటు ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ వర్గాల అభివృద్ధికి బాటలు వేయడం ప్రశంసనీయం. తొలిసారిగా తెలుగు భాషకు రాష్ట్ర ప్రభుత్వం రూ.10 కోట్ల కేటాయింపు అభినందనీయం. విద్య, వైద్య, పారిశ్రామిక రంగాలకు పెద్ద పీట వేస్తూనే మరోవైపు పేదలు, మధ్య తరగతి వర్గాల ప్రజల సంక్షేమానికి బాటలు వేసి అన్నీ వర్గాలకు సమన్యాయం చేసే బడ్జెట్ ఇది.

- వేమిరెడ్డి, ప్రశాంతిరెడ్డి, కోవూరు ఎమ్మెల్యే

ఉద్యాన కళాశాలకు నిధులు..



ముఖ్యమంత్రి చంద్రబాబు బడ్జెట్ రూపకల్పనలో తన పాలనాదక్షతను నిరూపించారు. వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధికి వరంలా భావిస్తున్న వెలిగొండ ప్రాజెక్టును ఈ ఏడాదిలోనే పూర్తిచేసి నీరందించేలా బడ్జెట్‌లో కేటాయింపులు చేయడం హర్షనీయం. కందుకూరు విషయా నికొస్తే ఉద్యాన కళాశాలకు శాశ్వత భవనాల నిర్మాణం కోసం ఈ బడ్జెట్‌లో నిధులు కేటా యించారు. అలాగే యువతకు ఉపాధి కల్పనే లక్ష్యంగా కందు కూరులో స్కిల్ డెవలప్ మెంట్ సెంటర్ ఏర్పాటు కోసం భవ నాల నిర్మాణానికి కూడా ఈ బడ్జెట్‌లో స్థానం కల్పించడం సంతోషదాయకం.

- ఇంటూరి నాగేశ్వరరావు, కందుకూరు ఎమ్మెల్యే

న్యూస్ బాక్స్

ఇంటర్ పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి

లింగసముద్రం, ఫిబ్రవరి 28(ఆంధ్రజ్యోతి): శనివారం నుంచి ప్రారంభం కానున్న ఇంటర్మీడియట్ పరీక్షలకు అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయని మండలంలోని పెదపవనిలో ఉన్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల బాలికల కళాశాల ప్రిన్సిపాల్, చీఫ్ సూపరింటెండెంట్ కె.స్నేహలత తెలిపారు. శుక్రవారం ఆమె మాట్లాడుతూ ఈ పరీక్ష కేంద్రంలో మొదటి సంవత్సరం విద్యార్థులు 142 మంది, రెండవ సంవత్సరం విద్యార్థులు 88 మంది పరీక్షలు రాయనున్నట్లు తెలిపారు.

ఉపాధి కల్పించకపోతే ఉద్యమం

కందుకూరు, ఫిబ్రవరి 28(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వాలు స్మార్ట్ మీటర్లు తీసుకువచ్చి మా ఉపాధి కోల్పోయేలా చేస్తున్నందున ప్రత్యామ్నాయ ఉపాధి కల్పించకపోతే ఉద్యమం తప్పదని ఆంధ్రప్రదేశ్ విద్యుత్ మీటర్ రీడర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి కుంచాల సిద్ధయ్య హెచ్చరించారు. స్థానిక సీపీఐ కార్యాలయంలో ఏఐటీయూసీ ఆధ్వర్యంలో శుక్రవారం యూనియన్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యుత్ మీటర్ల రీడింగ్ తీసే కార్మికులు నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. మార్చి నెలాఖరువరకు దశలవా రీగా నిరసన, ఏప్రిల్ 1 నుంచి సమ్మె, 4న చలో విజయవాడ కార్యక్రమంతో చేస్తామని పేర్కొన్నారు. సమావేశంలో ఇ.మాల్యాద్రి, డి.శ్రీను, జె.రాము, మల్లికార్జున, వంశీకృష్ణ, మధు, కుమార్, తదితరులు పాల్గొన్నారు.

అధికారులపై ఫిర్యాదు

లింగసముద్రం, ఫిబ్రవరి 28(ఆంధ్రజ్యోతి) : స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఈ నెల 23న జరిగిన మండల సమావేశాన్ని జరగకుండా ప్రయత్నం చేసిన ఎంపీడీవో, అడ్డుకున్న ఇతరులపై చర్యలు తీసుకోవాలని ఎంపీపీ పెన్నా కృష్ణయ్య, ఎర్రారెడ్డిపాలెం సర్పంచు డి మల్లికార్జున, వైసీపీ జిల్లా అధికార ప్రతినిధి ఎం కిషోర్‌లు శుక్రవారం జిల్లా ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. నెల్లూరులో జిల్లా కలెక్టర్, జడ్పీ సీఈవో, ఏఎస్పీలకు వినతిపత్రం అందజేసినట్టు ఎంపీపీ చెప్పారు.

చేపల చెరువు వేలం

కొండాపురం, ఫిబ్రవరి 28(ఆంధ్రజ్యోతి): మండలంలోని రేణమాల చెరువులో చేపల పెంపకానికి సంబంధించిన వేలం ప్రక్రియను పంచాయతీ అధికారులు శుక్రవారం నిర్వహించారు. గ్రామానికి చెందిన మెట్టుకూరు సుబ్బారెడ్డి రూ.70వేలకు దక్కించుకొన్నట్లు పంచాయతీ కార్యదర్శి పృధ్వీరాజ్ తెలిపారు. వేలం పాడుకున్న వ్యక్తి ఈ ఏడాది జూన్ 30 వరకు చెరువులో చేపలను పట్టి విక్రయించుకోవచ్చని ఆయన తెలిపారు.

సేంద్రియ ఉత్పత్తులకు అధిక ధర

అల్లూరు, ఫిబ్రవరి 28(ఆంధ్రజ్యోతి) : సేంద్రియ పద్ధతిలో సాగు చేసిన ఉత్పత్తులకు మార్కెట్లో 20 శాతం అధిక ధరలు కలిగి ఉంటాయని ఉత్పత్తుల ధ్రువీకరణ రాష్ట్ర అధికారి ఆర్.వెంకట సునీల్‌కుమార్ అన్నారు. శుక్రవారం అల్లూరులో నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఆయన పాల్గొని రైతులకు పలు సూచనలు సలహాలు ఇచ్చారు. ఈకార్యక్రమంలో వ్యవసాయాధికారి ఆర్.వెంకటేశ్వర్లు, వీఏఏలు పాల్గొన్నారు.

5న దుకాణాలకు వేలం

కందుకూరు, ఫిబ్రవరి 28(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పాత లారీస్టాండ్ ఆవరణలో నిర్మించి ఉన్న మున్సిపల్ షాపింగ్ కాంప్లెక్స్‌లో మిగిలి ఉన్న 1, 13, 15వ నెంబరు గదులు అద్దెకు ఇచ్చేందుకు మార్చి 5న ఉదయం 11 గంటలకు బహిరంగ వేలం నిర్వహిస్తున్నట్లు కమిషనర్ కె. అనూష ఒక ప్రకటనలో తెలిపారు. 1వ నెంబరు షాపు ఎస్సీలకు, 13, 15వ నెంబరు షాపులు జనరల్‌కు రిజర్వ్ చేసినట్లు ఆమె తెలిపారు. మున్సిపల్ కార్యాలయంలో జరిగే వేలంలో ఔత్సాహికులు పాల్గొనాలని ఆయన కోరారు.

● **మాంసం మార్కెట్ గదులకు..**

పట్టణంలోని చేపల మార్కెట్ వద్ద నిర్మించిన మాంసం మార్కెట్ నూతన గదులకు ఈనెల 5న మున్సిపల్ కార్యాలయంలో ఉదయం 11గంటలకు బహిరంగ వేలం నిర్వహిస్తున్నట్లు కమిషనర్ కె. తెలిపారు. ఈ మార్కెట్‌లో 18 గదులు ఉండగా 1,2,3 గదులు ఎస్సీలకు, 4వ నెంబరు ఎస్టీలకు, 5వ నెంబరు వికలాంగులకు రిజర్వ్‌చేయగా మిగిలిన 13 గదులు జనరల్ కేటగిరిలో ఉంటాయని తెలిపారు. మూడేళ్ల కాలపరిమితితో అద్దెకు ఇచ్చేందుకు బహిరంగ వేలం నిర్వహిస్తున్నామని తెలిపారు.

చెత్తతో సంపద సృష్టించాలి

కావలి రూరల్, ఫిబ్రవరి 28(ఆంధ్రజ్యోతి): చెత్త నుంచి సంపద సృష్టించి పంచాయతీలను అభివృద్ధి పథంలో నడపాలని డివిజనల్ పంచాయతీ అధికారి మాధవీలత పేర్కొన్నారు. కావలి మండలం మన్నంగిదిన్నెలో శుక్రవారం చెత్త నుంచి సంపద తయారీ, నిర్వహణపై ఈవోపీఆర్డీలతో జరిగిన శిక్షణ కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ గ్రామ పంచాయతీల్లో ఉన్న చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలను ఉపయోగంలోకి తీసుకురావాలన్నారు. చెత్త సేకరణలో తడి, పొడి చెత్త వేరుచేసి నాడెప్ తొట్టెల్లో నిల్వచేసి 45 రోజుల్లో ఎరువు తయారు చెయ్యవచ్చన్నారు. అలాగే వర్మి కంపోస్టుతో ఎరువు తయారు చేసి రాయతీపై రైతులకు అందించాలన్నారు. జీరో వేస్టు మేనేజ్‌మెంట్ ద్వారా గ్రామాలల్లో రోడ్ల ప్రక్కన పేడదిబ్బలు, చెత్తకుప్పలు లేకుండా శుభ్రపరిచి మొక్కలు నాటాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ చెలంచర్ల ప్రభాకర్‌రెడ్డి, ఈవోపీఆర్డీలు, పంచాయతీ కార్యదర్శి గీత, గ్రీన్ అంబాజిడర్లు తదితరులు పాల్గొన్నారు.

పట్టణ సరిహద్దులు

మాయం చేసి..

- ఇష్టానుసారంగా ఇళ్ల నిర్మాణాలకు అనుమతులు
- లబ్ధిదారులకు తగ్గుతున్న ఖర్చు
- జేబులు నింపుకొంటున్న అధికారులు
- మున్సిపల్ ఖజానాకు గండి
- పట్టించుకొనేవారేరీ?

కావలి, ఫిబ్రవరి 28(ఆంధ్రజ్యోతి): అక్రమ ఆదాయాలు కోసం అధికారులు ఎంతటికైనా తెగిస్తున్నారు. తమ జేబులు నింపుకునేందుకు మున్సిపల్ ఆదాయాలకు కూడా గండి కొట్టేందుకు వెనుకాడటం లేదు. పట్టణ ప్రణాళికా విభాగంలో గత కొన్నేళ్లుగా ఈ అక్రమ దోపిడీ సాగుతున్నా దానికి ఎవరూ అడ్డుకట్ట వేయకుండా తలా పాపం తిలా పిడికెడు అన్నట్లుగా ఎవరి మామూళ్లు వారు తీసుకుంటున్నారు. మున్సిపల్ మాస్టర్ ప్లాన్ ప్రకారం ఉన్న పట్టణ పాత పరిధిని చెరిపేసి దానిని అధికారులు తమ ఆదాయవనరుల కోసం కొత్త పరిధిని సృష్టించారు. 9 ఏళ్ల కిందట పాత పరిధిని చెరిపి కొత్త పరిధిని చూపించి నట్లు మున్సిపల్ అధికారి ఒకరు తెలిపారు. వాస్తవంగా పట్టణ పాత పరిధి దాటి ఇళ్ల నిర్మాణాలకు అనుమ తులు ఇవ్వాలంటే ఆ ప్రాంతాల్లో రోడ్లు, డ్రైనేజీలు ఇతర మౌలిక వసతుల కల్పన కోసం పురపాలక సంఘానికి 14 శాతం డెవలప్‌మెంట్ చార్జీల కింద చెల్లించాలి. ఆ నిధులతో విస్తరణ ప్రాంతాల్లో మున్సిపాల్టీ అభివృద్ధి, మౌలికవసతుల సమకూర్చే పనులు చేపడుతోంది. అయితే కావలి పురపాలక సంఘంలో పాత పట్టణ పరిధిని తురిపేసి దాని విస్తరణ మరింత చూపించారు. దీని వలన విస్తరణ చూపించిన ప్రాంతాలలో మున్సిపాల్టీకి చెల్లించాల్సిన డెవలప్‌మెంట్ చార్జీలలో సగం అధికారుల జేబుల్లోకి వేసుకుని భవన నిర్మాణాలకు అనుమతులు ఇస్తున్నారు. వాస్తవంగా పాత సరిహద్దులు దాటితే 14 శాతం డెవలప్‌మెంట్ చార్జీలు మున్సిపాల్టీకి చెల్లించాల్సిందే. దీంతో అధికారులకు పెద్దగా మామూళ్లు రావు. విస్తరణ ప్రాంతాలలో కొద్దిపాటి భవనం నిర్మించాలన్నా డెవలప్‌మెంట్ చార్జీల కింద సుమారు రూ.2లక్షలు వరకు మున్సిపాల్టీకి చలానా రూపంలో చెల్లించాలి. అయితే దానిలో లక్ష రూపాయలు అధికారులకు ఇస్తే ఆ విస్తరణ ప్రాంతాన్ని పట్టణ పాత సరిహద్దుల ప్రాంతంలో చూపించి డెవలప్‌మెంట్ చార్జీలు లేకుండా చేస్తుండటంతో ఇళ్లు నిర్మించుకునే వారికి కూడా మరో లక్ష రూపాయలు మిగులుతోంది. పాతూరుకు తూర్పు వైపున విస్తరణ ప్రాంతాలలో జరిగిన అనేక నిర్మాణాలలో డెవలప్‌మెంట్ చార్జీలు లేకుండానే పాత పట్టణ పరిధిలో చూపించి అధికారులు తమ మామూళ్లు తీసుకుని అనుమతులు ఇచ్చారనే ఆరోపణలు ఉన్నాయి. గత 9 ఏళ్లుగా కావలి పురపాలక సంఘంలో ఈ తంతు కొనసాగుతున్నా ఎవరూ పట్టించుకోవటంలేదనే విమర్శలు ఉన్నాయి. దీని వలన మున్సిపల్ ఖజానాకు బారీగా గండి పడటంతో విస్తరణ ప్రాంతాలలో అభివృద్ధి పనులకు నిధులు కొరత ఏర్పడు తోంది. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు స్పందించి పాత పట్టణ పరిధిని గుర్తించి అక్రమ వసూళ్లకు అడ్డుకట్ట వేసి విస్తరణ ప్రాంతాలలో డెవలప్‌మెంట్ చార్జీల కింద వసూలు చేస్తున్న సొమ్ము మున్సిపల్ ఖజానాకు జమ అయ్యేట్లు చూడాలని ప్రజలు కోరుతున్నారు.



కావలి పట్టణ వ్యూ

మా దృష్టికి వచ్చింది

పట్టణ పాత సరిహద్దు చెరిపేసి వాటిని విస్తరించిన విషయం ఆలస్యంగా తమదృష్టికి వచ్చింది. దీనిని క్షుణ్ణంగా పరిశీలించి మాస్టర్‌ప్లాన్ ప్రకారం పాత సరిహద్దులు గుర్తించి అది దాటి భవనాలు నిర్మించే వారి వద్ద డెవలప్‌మెంట్ చార్జీలు వసూలు చేసే విధంగా చర్యలు తీసుకుంటాం.

\- జీ. శ్రావణ్‌కుమార్, మున్సిపల్ కమిషనర్, కావలి

వర్షం నీరు కాదండోయ్.. మంచినీరే!

● పైపులైన్ పగిలి వృథాగా పోతున్న వైనం



లింగసముద్రం కోళ్లఫారం వద్ద మంచినీటి పైపులైన్ పగిలి రోడ్డుపై ప్రవహిస్తున్న నీరు

లింగసముద్రం సమీపంలోని కోళ్లఫారం వద్ద రోడ్డుపై నిలిచిన ఈ నీరు వర్షపునీరు అనుకుంటే పొరపాటే.. ఇది ప్రజలకు పైపులైన్ల ద్వారా సరఫరా చేసే మంచినీరు. లింగసముద్రం నుంచి వాకమళ్లవారిపాలెంకు వెళ్లే పైపులైన్ పగిలి ఇలా వృథాగా పోతోంది. మూడు రోజుల క్రితం మహాశివరాత్రి సందర్భంగా కోళ్లఫారం పక్కనే ఉన్న ఆర్అండ్‌బీ రోడ్డు మార్జిన్లలో గుంతలను పూడ్చేందుకు రోడ్డు పక్కనే ఉన్న మట్టిని ఎక్స్‌కవేటర్‌తో తవ్వి గుంతలకు వేశారు. ఆ సందర్భంలో ఎక్స్‌కవేటర్ బకెట్ తగిలి మంచినీటి పైపులైన్ పగిలింది. దాని ద్వారా నీరులీకై వృథాగా పోతూ పక్కనే ఉన్న ఆర్అండ్‌బీ రోడ్డుపై ప్రవహిస్తోంది. దీంతో ఈ తారు రోడ్డు దెబ్బతినే అవకాశం ఉందని వాహనదారులు, ప్రజలు ఆందోళన చెందుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

\- లింగసముద్రం(ఆంధ్రజ్యోతి)

'బుడంగుంట'కు ఎస్ఎస్ ట్యాంకు నుంచి నీరు



బుడంగుంటలో పరిశీలిస్తున్న కమిషనర్ శ్రావణ్‌కుమార్, డీఈ సాయిరామ్

కావలి, ఫిబ్రవరి 28(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని 17వ వార్డు బుడంగుంట ఇందిరమ్మ కాలనీలోని 9 వీధులకు ఇకనుంచి ఎస్ఎస్ ట్యాంకు నుంచి తాగునీరు పునరుద్ధరిస్తామని మున్సిపల్ కమిషనర్ జీ.శ్రావణ్‌కుమార్ తెలిపారు. శుక్రవారం ఆయన మున్సిపల్ డీఈ సాయిరామ్, ఇంజనీరింగ్ సిబ్బందితో కలిసి ఆ కాలనీలోని 9 వీధులలో పర్యటించారు. తాగునీటికి వారు పడుతున్న ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం కమిషనర్ మాట్లాడుతూ ఈ కాలనీలో ఇంజనీరింగ్ సిబ్బంది గత రెండు నెలలుగా పర్యటించి గత కొన్నేళ్లుగా ఉన్న మంచినీటి సమస్యను పునరుద్ధరించేందుకు పైపులైన్లు విస్తరణ, మరమ్మతులు, వాల్వులను బిగించి మంచినీటి సరఫరాకు అంతరాయం కలుగకుండా చేశామన్నారు. దీంతో ఇక నుంచి ఈ కాలనీలోని 9 వీధులకు మంచినీటి సరఫరాకు ఎలాంటి అంతరాయం లేకుండా ఎస్ఎస్‌ట్యాంకు నుంచి నీటి సరఫరా చేస్తా మని పేర్కొన్నారు.

మానవాళి మనుగడకు సైన్సు అవసరం



లింగసముద్రం : పెంట్రాల యూపీ పాఠశాలలో చార్టులు ప్రదర్శిస్తున్న విద్యార్థులతో ఉపాధ్యాయులు

లింగసముద్రం, ఫిబ్రవరి 28(ఆంధ్రజ్యోతి) : మానవాళి మనుగడకు సైన్స్ అత్యంత అవసరమని మండలంలోని పెంట్రాల యూపీ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎం శ్రీనివాసులు చెప్పారు. శుక్రవారం పాఠశాలలో సైన్స్ దినోత్సవం నిర్వహించారు. విద్యార్థులు తయారు చేసిన మోడల్ చార్టులను ప్రదర్శించిన అనంతరం వారికి బహుమతులు, స్వీట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో సైన్సు ఉపాధ్యాయుడు కె మోహన్‌రావు, ఉపాధ్యాయులు ఆచారి, హైమారాణి, సంధ్యారాణి, లక్ష్మీనారాయణ, వెంకటేశ్వర్లు, సుబ్రహ్మణ్యం, తదితరులు పాల్గొన్నారు.

● వలేటివారిపాలెం : మండలంలోని అయ్యవారిపల్లె ఎంపీయూపీ స్కూల్‌లో సైన్స్‌దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా సీవీ రామన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. విద్యార్థులచే సైన్స్ పరికరాలను తయారు చేయించి ప్రదర్శించారు. సైన్సు టీచరు శివకుమారిని సహోపాధ్యాయులు ఘనంగా సత్కరించారు. హెచ్ఎం హనుమంతరావు విద్యార్థులకు బహుమతులు అందజేశారు.

● ఉలవపాడు : మండలంలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో విద్యార్థులు తమ సృజనాత్మకతకు తగిన విధంగా సైన్స్ నమూనాలతో కొత్తరకం ఆవిష్కరణలు ప్రదర్శించారు. ఉలవపాడు శాంతనికేతన్ కరస్పాండెంట్ శ్రీరాం బాపూజి విద్యార్థులకు సర్ సీవీ రామన్ గురించి వివరించి ఉత్తమ ప్రదర్శనకు బహుమతులు అందచేశారు. శ్రీసాయి పాఠశాలలో కరస్పాండెంట్ శేషమ్మ, సెయింట్ జోసెఫ్ పాఠశాల కరస్పాండెంట్ వర్గీస్ విద్యార్థులు తయారు చేసిన ఉత్తమ సైన్స్ నమూనాలకు బహుమతులు అందచేశారు.

● కావలిటౌన్ : రెడ్‌క్రాస్ భవనంలో జేవీవీ అధ్యక్షుడు తోట వెంకటేశ్వర్లు అధ్యక్షతన జరిగిన జాతీయ సైన్సు దినోత్సవంలో ముఖ్య అతిథులుగా డాక్టర్ బెజవాడ రవికుమార్, డాక్టర్ ఆనంద్, డాక్టర్ శివప్రసాద్‌లు పాల్గొని సర్ సీవీ రామన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ప్రతిభా పోటీల్లో విజేతలైన విద్యార్థులకు బహుమతులందించారు. కార్యక్రమంలో జేవీవీ బాధ్యులు హరనాథ్, సుబ్బరాయశర్మ తదితరులు పాల్గొన్నారు. అలాగే అలాగే పట్టణంలోని రూపాయి మిద్దె కూడలిలోని జయ ఉష ఉన్నత పాఠశాలలో కరస్పాండెంట్ ఊసా వెంకట్రావు పర్యవేక్షణలో జరిగిన కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా సామాజిక వేత్త కూనం తాతిరెడ్డి, విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు జాఫర్‌ఖాన్‌లు పాల్గొని విద్యార్థులు ప్రదర్శించిన ఎగ్జిబిట్స్ తిలకించి అభినందించి బహుమతులందించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు తల్లితండ్రులు పాల్గొన్నారు.

● కందుకూరు: జాతీయ సైన్స్ దినోత్సవాన్ని శుక్రవారం ప్రభుత్వ, ప్రైవేటు విద్యాసంస్థలలో ఘనంగా నిర్వహించారు. స్థానిక టీఆర్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ డాక్టరు ఎం.రవికుమార్ ఆధ్వర్యంలో జంతుశాస్త్ర విభాగం వారు ఎగ్జిబిషన్ ఏర్పాటు చేయగా కేంద్రీయ విద్యాలయ విద్యార్థినీ విద్యార్థులు ఉత్సాహంగా పరిశీలించారు. జడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో హెచ్ఎం నరసింహమూర్తి ఆధ్వర్యంలో సైన్స్ దినోత్సవం నిర్వహించారు. సర్ సీవీ రామన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. విద్యార్థులు రూపొందించిన పరికరాలను ప్రదర్శించారు. విద్యార్థులకు వక్తృత్వము, వ్యాసరచన, క్విజ్ పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. పాఠశాల ఉపాధ్యాయుడు గుళ్లా నరసింహం రూ.5వేల ప్రోత్సాహకం అందించారు. పట్టణంలోని ఆక్స్‌ఫర్డ్ ఉన్నత పాఠశాల, శ్రీ గాయత్రీ ఒలింపియాడ్ స్కూల్, నారాయణ ఓలింపియాడ్ స్కూల్, చైతన్య టెక్నోస్కూల్, నాగార్జున ఇంగ్లీష్ మీడియం స్కూల్లో జాతీయ సైన్స్ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు.



కావలిటౌన్ : సర్ సీవీ రామన్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న వైద్యులు రవికుమార్, ఆనంద్



కందుకూరు : బాలికల ఉన్నత పాఠశాలలో ఇంజనీరింగ్ విద్యార్థులు రూపొందించిన స్ప్రేయర్

● జాతీయ విజ్ఞాన దినోత్సవం సందర్భంగా స్థానిక జడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలో ప్రకాశం ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులు తాము రూపొందించిన ప్రాజెక్టులను ప్రదర్శించారు. కళాశాల డీన్ డాక్టరు ఎం.లక్ష్మణరావు ఆధ్వర్యంలో విద్యార్థులు స్వయంగా రూపొందించిన మల్టీపర్పస్ స్ప్రేయరు, క్రాప్ సేవర్, స్మార్ట్ కూలర్, బయోగ్యాస్ జనరేషన్ వంటి వినూత్న ప్రాజెక్టులను ప్రదర్శించటంతో పాటు వాటిపనితీరును హైస్కూల్ విద్యార్థినులకు వివరించారు. ఈ ప్రదర్శనలో భాగస్వాములైన కళాశాల విద్యార్థులు బి.వైష్ణవి, కె.వినయ్, సి.శంకర్, యం.విజయేంద్ర, ఎస్కే షాహిద్, వి.శ్రీహరి, డి.సాయిశ్రీ, డి.మానిషా, వి.భాగ్యలక్ష్మిలను హెచ్ఎం ద్వారకారాణి, పీడీలు ఎం.రాజ్యలక్ష్మి, కె.ఆదిలక్ష్మి, కళాశాల కరస్పాండెంట్ కంచర్ల రామయ్య అభినందించారు.

● బిట్రగుంట : బోగోలు మండలం కడనూతల ఆర్ఎస్ఆర్ ఇంజనీరింగ్ కళాశాల్లో జాతీయ సైన్స్ డే పురస్కరించుకుని సైన్స్ ఎక్స్పో 2కె 25 కార్యక్రమం కళాశాల ప్రిన్సిపాల్ పీవీఎస్ రెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం జరిగింది. ఈ కార్యక్రమానికి జిల్లాలోని వివిధ మండలాలకు చెందిన పాఠశాల విద్యార్థులు తాము తయారు చేసిన వివిధ రకాల పరికరాలను ప్రదర్శించి వాటి పనితీరును వివరించారు.

రైతులకు అందుబాటులో
ధాన్యం కొనుగోలు కేంద్రాలు : జేసీ

కావలి, ఫిబ్రవరి 28(ఆంధ్రజ్యోతి): కావలి నియోజకవర్గంలోని కావలి, అల్లూరు, బోగోలు, దగదర్తి, మండలాల్లోని గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాటు చేసి అవసరమైన సిబ్బందిని నియమించినట్లు జిల్లా జాయింట్ కలెక్టర్ కార్తీక్ ఒక ప్రకటనలో తెలిపారు. కావలి మండలంలోని ఆముదాలదిన్నె, అన్నగారిపాలెం1, చెంచుగానిపాలెం, గౌరవరం, తాళ్లపాలెం, తుమ్మలపెంట1, 2, చెన్నాయపాలెం, పెదపట్టపుపాలెం, ఆనెమడుగు, సర్వాయపాలెం, రుద్రకోట, చలంచర్ల, సిరిపురం, కొత్తపల్లిలలో ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అల్లూరు మండలంలో అల్లూరు-1, అల్లూరు-2, బీరంగుంట, నార్తుమోపోరు, సింగపేట,అల్లూరు-3,4, గోగులపల్లి, గద్దగుంట, ఇస్కపల్లి-1,2, ఇందుపూరు, పురిణిలలో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తినట్లు తెలిపారు. బోగోలు మండలంలో బోగోలు-1, కడనూతల, జువ్వలదిన్నె, జేపీగూడూరు, ఏనుగులబావి, నాగులవరం, ముంగమూరు, కోవూరుపల్లి, బోగోలు-4, బిట్రగుంట, తాళ్లూరులలో కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. దగదర్తి మండలంలో బోడిగెడిపాడు, చెన్నూరు, దగదర్తి, దర్మవరం(మనుబోలుపాడు) దామవరం(కేకేగుంట), దుండిగం, కాట్రాయపాడు, వెలుపోడు, ఉలవపాళ్ల, శ్రీరామపురం(పెదపుత్తేడు), తడకలూరు, తురిమెర్ల లో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

● **కందుకూరులో 14..**

కందుకూరు : వరిసాగు చేసిన రైతులకు మద్దతు ధర దక్కేలా చూడటమే లక్ష్యంగా కందుకూరు నియోజకవర్గంలో 14 ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నట్లు జిల్లా జాయింట్ కలెక్టరు కార్తీక్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. కందుకూరు మండలంలో మోపాడు, మహదేవపురం, ఓగూరు, పలుకూరు, గుడ్లూరు మండలంలో గుడ్లూరు, దారకానిపాడు, లింగసముద్రం మండలంలో చినపవని, మొగిలిచర్ల, తూనుగుంట, ఎర్రారెడ్డిపాలెం, వలేటివారిపాలెం మండలంలో పోకూరు, వలేటివారిపాలెం, ఉలవపాడు మండలంలో చాగొల్లు, ఉలవపాడులలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించినట్లు తెలిపారు.


ఆర్టీసీ ఆకర్ష్ పథకం లక్కీడిప్



ప్రయాణికులకు బహుమతులు అందజేసిన అధికారులు

కావలి, ఫిబ్రవరి 28(ఆంధ్రజ్యోతి): ప్రయాణికులను ఆకర్షించి ఆర్టీసీ ఆదాయం పెంచుకునేందుకు కావలి ఆర్టీసీ డిపో ప్రయాణికులకు లక్కీ డిప్‌ల ద్వారా ఆకర్ష పథకంను ప్రవేశపెట్టింది. డాక్టర్ రామస్వామి సౌజన్యంతో ఏర్పాటు చేసిన ఈ పథకంలో భాగంగా శుక్రవారం కావలి డిపో ఆవరణలో జరిగిన కార్యక్రమంలో పెద్దపవని-లింగసముద్రం రూట్‌లో ఎస్కే నాయబ్ రసూల్, కొమ్మి-కొండాపురం రూట్‌లో ఎం.సరోజనీదేవి, అల్లూరు రూట్‌లో జీ.పద్మలకు చీరలను అసిస్టెంట్ మేనేజరు ఎం.కల్పనారెడ్డి బహూకరించారు. ఈ మూడు రూట్లలో బస్సులలో ఒక పెట్టెను ఏర్పాటు చేసి ప్రయాణికులు తమ టిక్కెట్ల వెనుక పేర్లు, ఫోన్‌నెంబర్లు రాసి వాటిని అందులో వేస్తారు. ఇలా ప్రతి నెలలో ఒక సారి లక్కీడిప్‌ద్వారా విజేతలను ఎంపిక చేసి వారికి బహుమతులను అందచేస్తూ ఆర్టీసీ ప్రయాణికులను ఆకర్షిస్తున్నట్లు అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ సూపరింటిండెంట్ ఎం. రామకృష్ణ, మార్కెటింగ్ ఎగ్జిక్యూటీవ్ డీ.రవిప్రకాష్. ఏడీసీ ఎన్. మాల్యాద్రి పాల్గొన్నారు.

మొక్కుబడిగా సామాజిక తనిఖీ ప్రజావేదిక



సామాజిక తనిఖీ ప్రజా వేదిక నిర్వహిస్తున్న అధికారులు

అల్లూరు, ఫిబ్రవరి 28(ఆంధ్రజ్యోతి): మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం 17వ విడత పనులపై సామాజిక తనిఖీ నిర్వహించిన అధికారుల బృందం శుక్రవారం కార్యాలయ ఆవరణలో మొక్కుబడిగా రెప్పపాటు కాలంలో ముగించేశారు. ఉదయం 10 గంటలకు ప్రారంభమవుతుందని అధికారులు తెలిపినప్పటికీ మధ్యాహ్నం ఎవరూ లేని సమయం చూసి కేవలం అర్ధగంటలో ముగించేశారు. అసలు ఈ తనిఖీలు చేసిన అధికారులు పూర్తిస్థాయిలో వివరించే అవకాశం ఇవ్వకుండానే పూర్తి చేశారు. 2023 ఏప్రిల్ 1 నుంచి గతేడాది మార్చి చివరి వరకు జరిగిన పనులపై గత కొన్ని రోజులుగా తనిఖీలు చేపట్టారు. ఈ తనిఖీలపై ప్రజావేదికను ఏర్పాటు చేసి రూ.30,920 మాత్రమే రికవరీకి ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ప్రిసైడింగ్ అధికారి గంగాభవాని, విజిలెన్స్ అధికారి విజయలక్ష్మి, ఎంపీడీవో రజనీకాంత్, ఉపాధిహామీ సిబ్బంది పాల్గొన్నారు.

కొలతలు ప్రకారమే కూలి : ఏపీవో



కూలీలకు అవగాహన కల్పిస్తున్న ఏపీవో ఉమామహేష్

వలేటివారిపాలెం, ఫిబ్రవరి 28(ఆంధ్రజ్యోతి): కొలతల ప్రకారమే కూలీ లభిస్తుందని ఏపీవో ఉమామహేష్ తెలిపారు. మండలంలోని నూకవరంలో జరుగుతున్న ఉపాధి పనులను ఏపీవో ఉమామహేష్ ఈసీ వంశీకృష్ణతో కలిసి శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెరుగుతున్న ఎండలను దృష్టిలో పెట్టుకొని ఉదయం 6 గంటలకే పనులకు రావాలని సూచించారు. అవసరమున్న ప్రతి ఒక్కరూ తమ ఇళ్ల ముందు ఇంకుడు గుంతలు నిర్మించుకోవాలని తెలిపారు. అందుకు ప్రభుత్వం రూ.6 వేలు అందిస్తుందని తెలిపారు. ఆయన వెంట ఫీల్డ్‌అసిస్టెంట్ బద్దిపూడి హరిబాబు ఉన్నారు.

శనగలో తెగుళ్ల నివారణకు సస్యరక్షణ చర్యలు

వలేటివారిపాలెం, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి) : శనగలో తెగుళ్ల నివారణకు సమగ్ర సస్య రక్షణ చర్యలు చేపడితే అధిక దిగుబడులు సాధించవచ్చునని కందుకూరు డివిజన్ వ్యవసాయ సహాయ సంచాలకురాలు పి.అనసూయ తెలిపారు. మండలంలోని శాఖవరంలో శుక్రవారం పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా ఏఓ హేమంత్‌భరత్‌కుమార్‌తో కలిసి శనగ పంటను పరిశీలించింది. ఈ కార్యక్రమంలో కందుకూరు సాంకేతిక వ్యవసాయశాఖాధికారి పి.దుర్గ, విలేజ్ అగ్రికల్చరల్ అసిస్టెంట్ ప్రభు, రైతులు పాల్గొన్నారు.

ఉద్యోగ విరమణ ఉపాధ్యాయినికి సన్మానం

బిట్రగుంట, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): బోగోలు మండలం విశ్వనాథరావుపేట జడ్పీ పాఠశాల ప్రాంగణంలో ఉద్యోగ విరమణ పొందిన ఉపాధ్యాయిని సుహాసిని వీడ్కోలు సమావేశం హెచ్ఎం రవీంద్రఠాగూర్ ఆధ్వర్యంలో శుక్రవారం జరిగింది. మొదట జాతీయ విజ్ఞాన దినోత్సవ సందర్భంగా సీవీరామన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళర్పించారు. అనంతరం సుహాసిని, సీహెచ్.నాగరాజు దంపతులను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమానికి గ్రామ సర్పంచు గండూరి మంజుల, ఎంఈవో నరసింహారావు, హెచ్ఎం గంగాధర్‌రావు పాల్గొన్నారు.

నేటి నుంచి గాలికుంటు వ్యాధి నిరోధక టీకాలు

కలిగిరి, ఫిబ్రవరి 28(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో శనివారం నుంచి 31వ తేదీ వరకు గాలికుంటు వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమం జరుగుతుందని ప్రాంతీయ వైద్యశాల ఏడీ డాక్టర్ కే.సురేష్‌బాబు ఒక ప్రకటనలో తెలిపారు.

దర్జీలను ప్రభుత్వం గుర్తించాలి



సీనియన్ టైలర్‌ను సత్కరిస్తున్న అళహరి

అల్లూరు, ఫిబ్రవరి 28(ఆంధ్రజ్యోతి): దర్జీలను ప్రభుత్వం గుర్తించి ప్రత్యేక అవకాశాలు కల్పించాలని దర్జీల అసోసియేషన్ మండల అధ్యక్షుడు కావలి కృష్ణ కోరారు. దర్జీల దినోత్సవాన్ని పురస్కరించుకొని శుక్రవారం అల్లూరు పాతబస్టాండు కూడలిలోని అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో షహెబ్, వెంకటేశ్వర్లు, వాసు, చిన్న పాల్గొన్నారు.

● కావలిటౌన్ : కావలి టైలర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం టైలర్స్ దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. ముందుగా పట్టణ ట్రంకురోడ్డులో టైలర్లు ఫ్లకార్డులు చేతపట్టి తమ సమస్యలు పరిష్కారించాలని పెద్దఎత్తున నినదిస్తూ ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఐదు లాంతర్ల సెంటర్‌లోని ఏవీఎస్ కల్యాణ మండపంలో జరిగిన సమావేశంలో ముఖ్య అతిథులుగా జనసేన నియేజకవర్గ ఇన్‌చార్జ్ అళహరి సుధాకర్, అసోసియేషన్ గౌరవాధ్యక్షుడు, స్థానిక మాజీ కౌన్సిలర్ అమరా వేదగిరి పాల్గొని సీనియర్ టైలర్లను సత్కరించారు. ఈ కార్యక్రమంలో అతిథులుగా ఖాదర్‌బాషా, మాలకొండారెడ్డి, జమీర్, గనీబాషా, అసోసియేషన్ బాధ్యులు వేణు, రఫి, రెహమాన్ పాల్గొన్నారు.

శ్రీధర్‌బాబు సేవలు మరువలేనివి



శ్రీధర్‌బాబును సన్మానిస్తున్న సిబ్బంది, రైతులు

కలిగిరి, ఫిబ్రవరి 28(ఆంధ్రజ్యోతి): పొగాకు బోర్డు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌గా ఐఏఎస్ అధికారి అద్దంకి శ్రీధర్ బాబు సేవలు, కృషి మరువలేనివని కలిగిరి పొగాకు వేలం కేంద్రం పరిధిలోని పొగాకు రైతులు పేర్కొన్నారు. గత ఏడున్నరేళ్లుగా పొగాకుబోర్డులో విధులు నిర్వహించి ఉత్తరాఖాండ్‌కు జాయింట్ సెక్రటరీగా పదోన్నతిపై వెళ్తున్న ఆయనను శుక్రవారం కలిగిరి వేలం కేంద్రంలో సిబ్బంది, రైతులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా శ్రీధర్‌బాబు మాట్లాడుతూ పొగాకు బోర్డులో రైతులకు అందించిన ప్రయోజనాలతో తనకు పూర్తి సంతృప్తి కలిగిందన్నారు. ఈ బోర్డులో విధులు నాకు జీవితానికి సరిపడా ఆనందాన్నిచ్చాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వేలం నిర్వహణాధికారి మహేష్‌కుమార్, ఫీల్డ్ ఆఫీసర్ సంతోష్ పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికుల ధర్నా

కావలిటౌన్, ఫిబ్రవరి 28(ఆంధ్రజ్యోతి) : మున్సిపల్ కార్మికులు శుక్రవారం ఆర్డీవో కార్యాలయం వద్ద ధర్నా చేసి ఆర్డీవో వంశీకృష్ణకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ గౌరవాధ్యక్షుడు పసుపులేటి పెంచలయ్య మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఆప్కాస్ రద్దు చేసి మున్సిపల్ కార్మికులను ప్రైవేట్ ఏజెన్సీలకు అప్పజెప్పాలని చూడడం దుర్మార్గమన్నారు. పోరాటాలతో సాధించకున్న హక్కులను కూటమి ప్రభుత్వం తిరిగి రద్దు చేసి కార్మికులను ఇబ్బందులు పెట్టే ఆలోచనలు చేయడం సమంజసం కాదన్నారు. సీఎం చంద్రబాబు ఎన్నికల హామీలు నిలబెట్టుకోవాలని కోరారు. కార్యక్రమంలో తిరుపాల్, కృష్ణమోహన్, మధుసూధన్‌రావు, యూనియన్ నాయకులు తురకా శీనయ్య, బి మహేష్, ఒ మహేష్, కె బాబు, పోలయ్య తదితరులు పాల్గొన్నారు.

డ్రైవర్లు, కండక్టర్లకు ప్రోత్సాహకాలు

కావలి, ఫిబ్రవరి 28(ఆంధ్రజ్యోతి): శివరాత్రి సందర్భంగా కావలి డిపో నుంచి లింగసముద్రం, మొగిలిచర్ల క్షేత్రములకు తిరిగిన బస్సులలో అత్యధిక ఆదాయం, సీట్ల భర్తీ శాతం పెంచిన డ్రైవర్లు, కండక్టర్లకు నగదు ప్రోత్సాహకాలను అందచేసినట్లు కావలి డిపో మేనేజరు రాఘూరు శ్రీనివాసులు తెలిపారు. కావలి డిపో ఆవరణలో శుక్రవారం జరిగిన కార్యక్రమంలో ఆదాయం, సీట్ల భర్తీలో మొదటి స్థానం సాధించిన కండక్టర్ పీ.శ్రీనివాస్, డ్రైవర్ ఎస్కే జలీల్, ద్వితీయస్థానం సాధించిన కండక్టర్ కే. రాంప్రసాద్, డ్రైవర్ బీ. కోదండయ్య, తృతీయస్థానం సాధించిన కండక్టర్ వై.శేఖర్, డ్రైవర్ ఎం.శ్రీనివాసులకు నగదు బహుమతులను అందచేశారు. ఈ కార్యక్రమంలో ఆర్టీసీ అధికారులు కల్పనారెడ్డి, ఎస్కే ఖాదర్‌మొహిద్దీన్, ఎం.రామకృష్ణ, డీ.రవిప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

రేపటి నుంచి రంజాన్ మాసం

- మసీదుల వద్ద ప్రత్యేక ఏర్పాట్లు
- నేటి రాత్రి తారావీ ప్రార్థనలు



నెల్లూరు (సాంస్కృతికం), ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి) : పవిత్ర రంజాన్ మాసం ఆదివారం నుంచి ప్రారంభమవుతోంది. ఈ సందర్భంగా జిల్లా వ్యాప్తంగా మసీదులను శుభ్రం చేస్తున్నారు. విద్యుత్, తాగునీరు, పారిశుధ్యం ఏర్పాట్లు చేస్తున్నారు. నెల్లూరు నగరంలోని ప్రధాన మసీదుల్లో రంజాన్ ప్రార్థనలు చేసుకునే ముస్లింలకు మెరుగైన వసతులు, సేవల కల్పనకు రాష్ట్ర వక్ఫ్‌బోర్డు అధ్యక్షుడు అబ్దుల్ అజీజ్ ఆధ్వర్యంలో ఫెస్టివల్ కమిటీలను ఏర్పాటు చేశారు. రంజాన్ మాసానికి స్వాగతం పలుకుతూ అన్నీ మసీదుల్లో శనివారం రాత్రి 8 గంటల నుంచి తారావీ నమాజ్‌లు జరగనున్నాయి.

ప్రార్థనలు.. ఉపవాసాలు

ప్రార్థనలు, ఉపవాసాలు, దానధర్మాలకు రంజాన్ మాసం ప్రత్యేకమైనది. శనివారం నెలవంక దర్శనం అనంతరం ఉపవాస దీక్ష ప్రారంభిస్తారు. ఈ మాసంలో ప్రతి ముస్లిం వయసుతో సంబంధం లేకుండా పగటి పూట ఉపవాసం చేస్తారు. ఆ సమయంలో ఉమ్మిని కూడా మింగకుండా కఠోర దీక్షను పాటిస్తారు. ఈ నెలంతా ఆధ్యాత్మిక భావనతో దైవ చింతన కలిగి, ఖురాన్ పఠనం, దాన ధర్మాలతో గడుపుతారు. సహరి, ఇఫ్తార్ సమయాల్లో ప్రత్యేక ప్రార్థనలు చేస్తారు. అలాగే ఇఫ్తార్‌కు ఉచితంగా ఆహారం అందించేందుకు దాతలు ముందుకు వస్తున్నారు. ఇక, రంజాన్ నెల అంటే నోరూరించే వంటకం హలీమ్. దాని విక్రయాలకు పలుచోట్ల దుకాణాలు వెలుస్తున్నాయి.

పరిశ్రమల ఏర్పాటుకు వేగంగా అనుమతులు

- ప్రోత్సాహక కమిటీ సమావేశంలో జేసీ కార్తీక్

నెల్లూరు (వెంకటేశ్వరపురం) ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో నూతన పరిశ్రమల ఏర్పాటుకు అవసరమైన అనుమతులను వేగంగా మంజూరు చేయాలని జాయింట్ కలెక్టర్ కార్తీక్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఉదయం కలెక్టరేట్‌లోని తిక్కన ప్రాంగణంలో జరిగిన జిల్లా పరిశ్రమలు, ఎగుమతుల ప్రోత్సాహక కమిటీ సమావేశంలో జేసీ మాట్లాడారు. అదే విధంగా పరిశ్రమల ఏర్పాటుకు అవసరమైన భూసేకరణ వేగవంతంగా పూర్తిచేయాలని సూచించారు. ఎంఎస్ఎంఈ పరిశ్రమలను ప్రోత్సహించేందుకు పీఎంఈజీపీ రుణాలను విరివిగా మంజూరు చేయలని పేర్కొన్నారు. ఎంఎస్ఎంఈ పార్కుల కోసం ఏపీఐఐసీ అధికారులు భూమిని గుర్తించాలని ఆదేశించారు. ఈ సమావేశంలో పరిశ్రమల శాఖ జీఎం మారుతీప్రసాద్, ఏపీఐఐసీ జెడ్ఎం శివకుమార్, డీజెడ్ఎం వెంకటసురేష్, ఎల్‌డీఎం శ్రీకాంత్ పారిశ్రామికవేత్తలు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న జేసీ కార్తీక్

హమాలీ చార్జీల పెంపు

అమరావతి : పౌర సరఫరాలశాఖకు చెందిన మండలస్థాయి గోడౌన్లలో రేషన్ బియ్యం, ఇతర నిత్యావసర సరుకుల లోడింగ్, అన్‌లోడింగ్ పనులు చేసే హమాలీలకు ప్రభుత్వం చార్జీలు (జీసీసీ హమాలీలతో సహా) పెంచింది. క్వింటాలుకు రూ.25 నుంచి రూ.28 వరకు పెంచుతూ సివిల్ సప్లయిస్ కమిషనర్, ప్రభుత్వ ఎక్స్‌-అఫీషియో కార్యదర్శి సౌరబ్ గౌర్ శుక్రవారం ఉత్తర్వులు విడుదల చేశారు. వీరితోపాటు స్వీపర్లు, స్టిచ్చింగ్ సిబ్బంది, స్వీట్ పాకెట్, తాగునీటి చార్జీలను కూడా పెంచారు. దీనివల్ల ఏడాదికి రూ.11.80 కోట్లు అదనపు భారం పడుతుందని పేర్కొన్నారు.

ఫిట్‌నెస్... ఇక ఏటీఎస్...!

- రవాణాశాఖ అధికారుల ప్రమేయం ఉండదు
- ఏప్రిల్ 1 నుంచి ప్రారంభం
- ప్రస్తుతం రోజుకు సుమారు 250 ఎఫ్‌సీలు
- స్థానిక రవాణా కార్యాలయాల్లో జారీ
- ఇకపై జిల్లా మొత్తానికి ఒక్కటే స్టేషన్
- అందరూ అక్కడికి రావలసిందే!
- దూరప్రాంతాల వారికి ఇబ్బందే!

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట), ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): రవాణాశాఖ అధికారులు వాహనాలను పరీక్షించి, ఫిట్‌నెస్ సర్టిఫికెట్లు జారీచేసే విధానానికి ఇక కాలం చెల్లింది. ఆటోమేటిక్ టెస్టింగ్ స్టేషన్(ఏటీఎస్)ల ద్వారా వాహనాలను పరీక్షించి ఎఫ్‌సీలు జారీ చేసే విధానానికి రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. రాష్ట్రంలోని అనంతపురం, నంద్యాల, కాకినాడ, గుంటూరు... ఇలా ఐదు ప్రాంతాల్లో ఏటీఎస్‌ల ద్వారా వాహనాల ను పరీక్షించి ఎఫ్‌సీలు జారీ చేస్తున్నారు. ఏప్రిల్ 1 నుంచి నెల్లూరు జిల్లాలోనూ ఆ ప్రక్రియ ప్రారంభం కానుంది.



ముత్తుకూరు : కప్పలదొరువు వద్ద నిర్మాణంలో ఉన్న రవాణా శాఖ ఎఫ్‌సీ సెంటర్

సరకు, ప్రజా రవాణా చేసే భారీ, మధ్యతరహా వాహనాలు అయిన లారీలు, బస్సులు, లైట్ మోటారు వాహనాలైన కార్లు, జీపుల వంటివాటికి పరీక్షలు నిర్వహించి రవాణాశాఖ అధికారులు ఫిట్‌నెస్ సర్టిఫికెట్ జారీ చేసేవారు. అయితే ఇకపై ఆ పనిని యంత్రాలు చేయనున్నాయి. ఇందుకోసం ముత్తుకూరు మండలం కప్పలదొరువులో ఏటీఎస్ కేంద్రాన్ని నిర్మిస్తున్నారు. ఇప్పటివరకు ఆయా ఆర్టీవో కార్యాలయాల పరిధిలో ఎఫ్‌సీలను అధికారులు జారీ చేసేవారు. కానీ, నూతన విధానంలో కందుకూరు, సీతా రామపురం, కావలి ప్రాంతాల్లో ఎఫ్‌సీలకు దరఖాస్తు చేసుకునే వాహనదారులు కప్పలదొరువులో ఏర్పాటు చేయనున్న ఏటీఎస్ కేంద్రానికి వచ్చి ఎఫ్‌సీ పొందాల్సి ఉంటుంది. జిల్లా వ్యాప్తంగా ఎఫ్‌సీల కోసం ఒకే ఒక ఏటీస్ కేంద్రం ఏర్పాటు చేస్తుండటంతో తీవ్ర ఇబ్బందులు ఎదురయ్యే అవకాశం ఉంది.

పరికరాలతో ఫిట్‌నెస్

ఆటోమొబైల్ రీసెర్చ్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా (ఏఆర్ఏఐ) నిర్దేశించిన ప్రమాణాలకు అనుగుణంగా వాహనానికి సంబంధించిన 40 అంశాలను ఆటోమెటిక్ టెస్టింగ్ స్టేషన్‌లో పరికరాలు తనిఖీలు చేసి సదరు వాహనం సామర్థ్యాన్ని నిర్ధయి స్తాయి. ఇంజన్, టైర్లు, బాడీ... ఇలా అన్ని అంశాలకు సంబంధించి యంత్రాలే పరీక్షలు జరుపుతాయి. జిల్లా వ్యాప్తంగా సుమారుగా రోజుకు 250కుపైగా వాహనాలు ఫిట్‌నెస్ కోసం స్థానిక ఆర్టీవో కార్యాలయాలకు వెళుతుంటాయి. ఇకపై ఆ వాహనాలన్నీ ఏటీఎస్‌కు రావలసి ఉంటుంది.

విద్యార్థులతో వెట్టి చాకిరీ..!

- తల్లిదండ్రుల ఆగ్రహం

దుత్తలూరు (ఉదయగిరి), ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఆదర్శ పాఠశాలలో విద్యార్థుల చేత వెట్టి చాకిరీ చేయించిన సంఘటన శుక్రవారం వెలుగు చూసింది. వివరాల మేరకు.. పాఠశాలలో సరస్వతిదేవి విగ్రహ నిర్మాణానికి ఆరుబయట ఉన్న ఇసుకను బస్తాల్లో నింపి విద్యార్థులతో లోపలికి మోయించారు. ఇటీవల గండిపాళెం గ్రామంలో విద్యార్థుల చేత పాఠశాల యాజమాన్యం వందల చపాతీలు చేయించిన ఘటన మరువకముందే ఆదర్శ పాఠశాలలో విద్యార్థుల చేత ఇసుక బస్తాలు మోయించడంపై తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయమై పాఠశాల ప్రిన్సిపాల్ సైమన్‌రావును వివరణ కోరగా తాము విద్యార్థులకు పని చెప్ప లేదని, ఇసుక గుట్టపై ఉన్న పట్టలను విద్యార్థులే లోపలికి తీసుకొచ్చారని తెలిపారు.



సర్టిఫికెట్లు అందుకున్న విద్యార్థులతో డీఈవో, ఇతర అధికారులు

భావిశాస్త్రవేత్తలుగా ఎదగాలి

- విద్యార్థులకు డీఈఓ బాలాజీరావు పిలుపు

నెల్లూరు(విద్య), ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి) :నూతన ఆవిష్కరణలతో భావిశాస్త్రవేత్తలుగా ఎదగాలని డీఈఓ డాక్టర్ ఆర్. బాలాజీరావు విద్యార్థులకు పిలుపునిచ్చారు. నగరంలోని దర్గామిట్ట జడ్పీ ఉన్నత పాఠశాలలో శుక్రవారం జరిగిన జిల్లాస్థాయి క్విజ్, డ్రాయింట్ పోటీల విజేతల బహుమతి ప్రదానోత్సవంలో డీఈవో పాల్గొని మాట్లాడారు. విద్యార్థుల్లో విజ్ఞానశక్తి పెరుగుతోందని, ఎంతోమంది తమ ప్రతిభను చూపి పలు ఆవిష్కరణలు చేపడుతున్నార న్నారు. జిల్లాకు చెందిన పలువురు విద్యార్థులు జాతీయ, రాష్ట్రస్థాయిలో సైతం సత్తా చాటి విజేతలుగా నిలవడం గర్వకారణమన్నారు. మిగిలిన విద్యార్థులు కూడా తమలోని విజ్ఞాన ప్రతిభతో ఉత్తమ శాస్త్రవేత్తలుగా ఎదగాలని తెలిపారు. ఈ సందర్భంగా సైక్రియాట్రిస్ట్ డాక్టర్ సురేష్ విద్యార్థులకు మోటివేషన్ స్పీచ్ అందజేశారు. అలాగే జాతీయ సైన్స్‌దినోత్సవాన్ని పురస్కరించుకుని రాష్ట్ర ఉత్తమ అవార్డు గ్రహీత ఏవీ.సుధాకర్‌ను సన్మానించారు. వివిధ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు నగదు బహుమతులు, సర్టిఫికెట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో సెట్నల్ సీఈఓ నాగేశ్వరరావు, డిప్యూటీ ఈఓ వెంకటేష్ నాయక్, జిల్లా సైన్స్ అధికారి కరుణాకర్ రెడ్డి, ఎంఈవోలు ఆర్.మురళీధర్‌రావు, హమీద్, పాఠశాల హెచ్ఎం కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

దుకాణాల వేలం ద్వారా మాలకొండకు రూ.1.67 కోట్ల రాబడి



మాలకొండలో వేలం నిర్వహిస్తున్న ఆలయ అధికారులు

వలేటివారిపాలెం, ఫిబ్రవరి 28(ఆంధ్రజ్యోతి) : మండలంలోని మాలకొండ మాల్యాద్రి లక్ష్మీనరసింహ స్వామి ఆలయానికి 8 దుకాణాల నిర్వాహణకు నిర్వహించి బహిరంగ వేలం ద్వారా రూ.1,67,10,000 ఆదాయం లభించిందని ఆలయ డిప్యూటీ కమిషనర్ కేవీ సాగర్‌బాబు తెలిపారు. మాలకొండ ఆలయ కల్యాణ మండపంలో శుక్రవారం భైరవకోన భైరవేశ్వరస్వామి ఆలయం కార్యనిర్వాహణాధికారి డి.వంశీ పర్యవేక్షణలో శుక్రవారం 8 దుకాణాలకు బహిరంగ వేలం నిర్వహించారు. ఈ దుకాణాలకు గత ఏడాది కంటే ఈ ఏడాది రూ.18,20,000 అదనంగా ఆదాయం లభించింది. గత ఏడాది 8 దుకాణాలకు రూ.1,48,90,000 ఆదాయం రాగా ప్రస్తుతం రూ.1,67,10,000 వచ్చింది. కొబ్బరి చిప్పలు పోగు చేసుకునేందుకు మహంకాళి మల్లికార్జున రూ.19,62,000, నెయ్యి, పాలు విక్రయానికి ఐచ్చు వెంగళరావు రూ.50 వేల, టోల్‌గేట్ నిర్వహణ మంచాల చినవీరయ్య రూ.28,25,000, వస్త్రముల విక్రయం, వసూలు చేసుకొనేందుకు జాలాది ప్రసాద్ రూ.34,35,000, కొబ్బరికాయలు అంగడి నిర్వహణను మహంకాళి మల్లికార్జున రూ.26,20,000, అద్దములు, ఫొటోలు, పూజాద్రవ్యములు విక్రయం ఇంటూరి శంకరయ్య రూ.35,33,000, కూల్‌డ్రింక్ షాపు కామినేని రఘురామయ్య రూ.16,75,000, పాదరక్షలు భద్రపరచు పాటను నల్లబోతుల ఏడుకొండలు రూ.6,10,000లకు దక్కించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ సీనియర్ అసిస్టెంట్ వెంకటేశ్వర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

శునకాలకు కు.ని శస్త్రచికిత్సలు.. ఆవులు గోశాలకు!

- 2 వేల పందులు తరలింపునకూ నోటీసులు
- నెల్లూరును స్మార్ట్ సిటీగా తీర్చిదిద్దేందుకు చర్యలు

నెల్లూరు (సిటీ), ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలోనే మొదటిగా నెల్లూరును స్మార్టు సిటీగా తీర్చిదిద్దేందుకు ప్రయోగాత్మకంగా తీసుకున్న పురపాలక శాఖ మంత్రి నారాయణ, ఎన్ఎంసీ కమిషనర్ సూర్యతేజల శ్రమ ఒక్కొక్కటిగా ఫలిస్తోంది. తొలి ప్రయత్నంగా కుక్కలను నియంత్రించాలని చేపట్టిన ఏబీసీ (పశువుల జనన నియంత్రణ) కార్యక్రమం చురుగ్గా సాగుతోంది. నెల్లూరులో 27,500 కుక్కలు ఉన్నట్లు గుర్తించిన కార్పొరేషన్ అధికారులు వాటిల్లో 24,144లకు ఇప్పటికే కు.ని శస్త్రచికిత్సలు చేయించారు. ఇందుకోసం ఒక్కో శునకానికి రూ.1000 ఖర్చు చేస్తున్నట్టు సమాచారం. పాతమున్సిపల్ కార్యాలయం వద్దనున్న కుక్కలకు ఆపరేషన్లు చేసే ఏబీసీ సెంటరులో 66 గదులను 200లకు విస్తరించే పనులు మొదలుపెట్టారు. ఇదే సమయంలో పౌరులను కరిచినా ఎలాంటి ప్రమాదం తలెత్తకుండా యాంటీ రేబీస్ ఇంజక్షన్లు కూడా వేస్తున్నారు. కాగా, నగరానికి శివారునున్న విలీన ప్రాంతాలలో 3,356 కుక్కలు పట్టుకోవడం సిబ్బందికి సవాల్‌గా మారింది.



కు.ని శస్త్రచికిత్సల అనంతరం గదిలో ఉన్న శునకాలు

- నగరవాసులకు, వాహనదారులకు ప్రధాన సమస్యగా మారిన ఆవులను కల్లూరిపల్లి వద్దనున్న గోశాలకు తరలిస్తున్నారు. ఇప్పటి వరకు 120 ఆవులను తరలించగా, ఇంకా 300 ఆవులు రోడ్లపై ఉన్నట్టు లెక్కగట్టారు. గతంలో గోశాలకు తరలించిన ఆవులకు జరిమానా చెల్లించి వాటి యజమానులు తిరిగి తెచ్చుకునే అవకాశం కల్పించిన కార్పొరేషన్ అధికారులు తాజాగా ఒకసారి గోశాలకు తరలించిన ఆవును తిరిగి యజమానులకు ఇవ్వకుండా కఠినంగా వ్యవహరిస్తున్నారు. ఆవులను నిరంతరం తరలించేందుకు ప్రత్యేక వాహనాన్ని కొనుగోలు చేయనున్నారు.



నగరంలోని వీధి కుక్కలను తీసుకువచ్చిన బండి

- అంటురోగాలు, దుర్వాసనకు ప్రధాన కారణాలైన పందులను నివాసాల మధ్య నుంచి బయటకు తీసుకెళ్లిపోవాలని వాటి యజమానులకు ఇప్పటికే నోటీసులు జారీ చేశారు. ధనలక్ష్మీపురం, వావిలేటిపాడు, కొత్తూరు, బుజబుజనెల్లూరు, అయ్యప్పగుడి, వెంకటేశ్వరపురం, నవలాకులతోట, నారాయణరెడ్డిపేట, పడారుపల్లి, పొదలకూరురోడ్డు, ఇరగాళమ్మ సంఘం, మనుమసుద్దినగర్, సంతపేట, కపాడిపాళెం, మద్రాసుబస్టాండ్, మన్సూర్‌నగర్, మినీబైపాస్‌రోడ్డు, ఆత్మకూరుబస్టాండ్ ప్రాంతాలలో వీటి సంచారం ఎక్కువగా ఉంది. ఈ ప్రాంతాలలో 2 వేల పందులు వరకు ఉన్నట్లు లెక్కకట్టారు.

పశువుల నియంత్రణ నిరంతర ప్రక్రియ



మంత్రి నారాయణ, కమిషనర్ సూర్యతేజల ఆదేశాలతో నగరంలోని పశువులను నిరంతరం నియంత్రించే పనిలోనే ఉన్నాము. కుక్కలకు ఆపరేషన్ల ప్రక్రియ దాదాపుగా లక్ష్యం పూర్తికావస్తోంది. పందులను బయటకు తీసుకెళ్లిపోవాలని ఇప్పటికే నోటీసులు ఇచ్చాము. వాళ్లు స్పందించకుంటే మేమే తరలిస్తాము. ఆవులను ఎలాగూ తీసుకెళ్లిపోతున్నాము.

- డాక్టర్ మదన్‌మోహన్, ఎన్ఎంసీ పశువైద్యుడు

నైపుణ్య శిక్షణ ద్వారా నిరుద్యోగులకు ఉపాధి

- స్కిల్ డెవలప్‌మెంట్ ప్లాన్ సమీక్షలో కలెక్టర్

నెల్లూరు (హరనాధపురం) ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి) : రాబోయే ఆర్థిక సంవత్సరంలో మంచి నైపుణ్య శిక్షణ ఇచ్చి ఎక్కువ మంది నిరుద్యోగులకు ఉపాధి కల్పించే చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆనంద్ స్కిల్‌డెవలప్‌మెంట్ అధికారులకు సూచించారు. శుక్రవారం కలెక్టర్ క్యాంప్ కార్యాలయంలో జిల్లా స్కిల్ డెవలప్‌మెంట్ ప్లాన్ 2025-26పై సమీక్ష జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పరిశ్రమల అధికారులు, యాజమాన్యాలతో సమావేశాలు నిర్వహించి నిరుద్యోగులకు వారి ప్రాంతాలలోనే ఎక్కువ మందికి ఉపాధి కలిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి షేక్.అబ్దుల్ ఖయ్యూం, డీఆర్‌డీఏ పీడీ నాగరాజకుమారి, బీసీ, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ ఏ.నిర్మలాదేవి, గిరిజన సంక్షేమ అధికారి పరిమళ పలువురు అధికారులు పాల్గొన్నారు.

డిగ్రీ సప్లిమెంటరీ పరీక్షలకు ఐదుగురు గైర్హాజరు

వెంకటాచలం, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): విక్రమ సింహపురి యూనివర్సిటీ పరిధిలోని అనుబంధ కళాశాలలో శుక్రవారం జరిగిన డిగ్రీ ఒకటవ, నాలుగవ సెమిస్టర్ మెగా సప్లిమెంటరీ పరీక్షలకు ఐదుగురు విద్యార్థులు గైర్హాజరైనట్లు వీఎస్‌యూ పరీక్షల నిర్వాహణాధికారి డాక్టర్ సీహెచ్ వెంకట్రాయులు ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం, మధ్యాహ్నం జరిగిన పరీక్షలలో 155 మంది విద్యార్థులకు గాను 150 మంది హాజరయ్యారు.

దుర్భిక్ష గ్రామాల్లో వాల్టాచట్టం గడువు పెంపు

అమరావతి, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): భూగర్భజలాలు అడుగంటిన అత్యంత దుర్భిక్షమైన 300 గ్రామాల్లో వాటర్, ల్యాండ్ అండ్ ట్రీ (వాల్టా) చట్టం కొనసాగిస్తూ పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధిశాఖ ఉత్తర్వులు జారీచేసింది. వాల్టా చట్టం ప్రకారం ఈ గ్రామాల్లో అనుమతి లేకుండా బోరుబావులు, ఇసుక తవ్వకం చేయరాదు. 8 జిల్లాల్లోని ఈ 300 గ్రామాల్లో వాల్టా చట్టం ఈ నెల 28తో గడువు పూర్తి కావడంతో తదుపరి ఆదేశాలిచ్చే వరకు వాల్టా చట్టం అమల్లో ఉంటుందని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. అనంతపురం, అన్నమయ్య, చిత్తూరు, పల్నాడు, ప్రకాశం, సత్యసాయి, శ్రీకాకుళం, వైఎస్ఆర్ కడప జిల్లాల్లోని 300 గ్రామాల్లో ఈ చట్టం అమలవుతుంది.

వైభవంగా అన్నలింగ ప్రతిష్ఠ

ముత్తుకూరు : మహాశివరాత్రి ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం కృష్ణపట్నం సిద్ధేశ్వరాలయంలో అన్నలింగ ప్రతిష్ఠ వైభవంగా జరిగింది. అనంతరం అన్నలింగ రూపంలో స్వామివారిని ఊరేగించారు. పూర్ణాహుతి అనంత రం అన్నలింగ నిమజ్జనం నిర్వహించారు. స్వామివారికి అభిషేకం చేసిన అన్నంతో భకులకు అన్నదానం చేశారు.

అప్కాస్ రద్దు చేస్తే కార్మికులను రెగ్యులర్ చేయాలి

- కలెక్టరేట్ ఎదుట సీఐటీయూ ధర్నా

నెల్లూరు (వైద్యం), ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం అప్కాస్‌ను రద్దు చేస్తే అప్కాస్ కింద పనిచేస్తున్న మున్సిపల్ కార్మికులను రెగ్యులర్ చేయాలంటూ శుక్రవారం కలెక్టరేట్ వద్ద సీఐటీయూ ఆధ్వర్యంలో కార్మికులు ధర్నా చేశారు. సీఐటీయూ మున్సిపల్ వర్కర్స్, ఎంప్లాయీస్ యూనియన్ జిల్లా కార్యదర్శి పెంచల నర్సయ్య మాట్లాడుతూ ఇటీవల జరిగిన కేబినెట్ సమావేశంలో అప్కాస్‌ను రద్దు చేసి ప్రైవేట్ ఏజెన్సీలకు ఇవ్వాలని తీర్మానించారన్నారు. ఈ ఆలోచనను వెంటనే విరమించు కోవాలని డిమాండ్ చేశారు. గతంలో ప్రైవేట్ ఏజెన్సీలకు ఇవ్వడం వల్ల మున్సిపల్ కార్మికులు చాలా ఇబ్బందులు ఎదుర్కొన్నారన్నారు. ప్రాణాలను సైతం లెక్క చేయకుండా ప్రజారోగ్యానికి ప్రాధా న్యత ఇస్తున్న మున్సిపల్ కార్మికులకు అన్యా యం చేస్తే ఆందో ళనకు దిగుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మున్సి పల్ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షు రాలు కామాక్షమ్మ, నాయకులు అశోక్, సుజాత, వజ్రమ్మ, భాగ్యమ్మ, కొండయ్య, శ్రీనివాసులు, బాలు పాల్గొన్నారు.



కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న కార్మికులు

అప్కాస్ నుంచి వైద్య ఉద్యోగుల తొలగింపు

నెల్లూరు (వైద్యం, ఆంధ్రజ్యోతి) : యల్లాయపాళెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో అప్కాస్ కింద పనిచేస్తున్న ఎఫ్ఎన్‌వో దార్ల జీవిత, సర్వాయపాళెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పనిచేస్తున్న ఎఫ్ఎన్‌వో వాసుకిలను ఉద్యోగాల నుంచి తొలగిస్తున్నట్లు డీఎంహెచ్‌వో డాక్టర్ సుజాత ఓ ప్రకటనలో పేర్కొన్నారు. బంగారు గొలుసు చోరీకి పాల్పడ్డ వారిని పోలీసులు అరెస్టు చేశారని, ఈ నేపథ్యంలో ఉద్యోగాల నుంచి తొలగిస్తున్నట్లు వెల్లడించారు.

అండర్-17 క్రికెట్ విజేత కావలి



విజేతగా నిలిచిన కావలి జట్టు

నెల్లూరు(విద్య), ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి) : జిల్లా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బుజబుజ నెల్లూరులోని సీఏఐ క్రికెట్ మైదానంలో జరుగుతున్న సమాధి మాలకొండయ్య మెమోరియల్ అండర్-17 బాలుర క్రికెట్ పోటీల్లో కావలి జట్టు విజేతగా నిలిచింది. శుక్రవారం జరిగిన బహుమతి ప్రదానోత్సవంలో అసోసియేషన్ సంయుక్త కార్యదర్శి కే ముని గిరీష్ మాట్లాడుతూ ఐదు జట్లు టోర్నీలో తలపడ్డాయని, యువ క్రీడాకారులు అవకాశాలను అందిపుచ్చుకుని ఉత్తమంగా రాణించాలని సూచించారు.కావలి జట్టును, రన్నర్‌గా నిలిచిన వెంకటగిరి జట్టును అభినందించి బహుమతులు అందచేశారు. ఈ కార్యక్రమంలో అసోసియేష న్ కేర్‌టేకర్ శ్రీనివాసులు రెడ్డి, ఎన్‌డీసీఏ కోచ్‌లు, సిబ్బంది పాల్గొన్నారు.

మెప్మాలో 'ప్రేరణ సఖి'లు

ఒక్కో జిల్లా నుంచి నలుగురు ఎంపిక.. 8న సత్కారం

అమరావతి, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): స్వయం సహాయక సంఘాలను ప్రోత్సహించేందుకుగాను.. స్వయం ఉపాధి కార్యక్రమాలతో వృద్ధి చెంది అందరికీ ఆదర్శంగా నిలిచిన మహిళలను 'ప్రేరణ సఖి'లుగా ఎంపిక చేసి సత్కరించాలని ఏపీ మెప్మా నిర్ణయించింది. మార్చి 8న అంతర్జాతీయ మహిళా దినోత్సవం రోజున వారిని సత్కరించాలని నిర్ణయించారు. రాష్ట్ర వ్యాప్తంగా 100 మందిని ఎంపిక చేస్తారు. ఏఎస్ఆర్ జిల్లా తప్ప మిగిలిన 25 జిల్లాల్లో ఒక్కో జిల్లా నుంచి నలుగురు ప్రేరణ సఖిలను ఎంపిక చేయాలని నిర్ణయించారు. సీనియర్ స్వయం సహాయక సంఘ సభ్యులై ఉండి, జీవనోపాదుల కార్యక్రమాలను నిర్వహిస్తూ ఏడాదికి యూనిట్ టర్నోవర్ విలువ రూ.25 లక్షల నుంచి రూ.50 లక్షల వరకు ఉన్న మహిళలను ఎంపిక చేస్తారు.

నేడు పింఛన్ల పంపిణీ

నెల్లూరు (హరనాధపురం) : ఎన్టీఆర్ భరోసా సామాజిక పింఛన్ల పంపిణీ కార్యక్రమం జిల్లావ్యాప్తంగా శనివారం ఉదయం ప్రారంభమవుతుంది. 3,07,232 మంది లబ్ధిదారులకు రూ.132.16 కోట్ల పింఛన్ మొత్తాన్ని ప్రభుత్వ సిబ్బంది అందజేయనున్నారు. రాష్ట్ర మంత్రి పొంగూరు నారాయణ నగరంలోని భగత్‌సింగ్ నగర్‌లో లబ్ధిదారులకు పింఛన్లు అందజేయనున్నారు.

ఖాళీలను పదోన్నతులతో భర్తీ చేయాలి: ఎన్ఎంయూ

విజయవాడ, (బస్‌స్టేషన్), ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): ప్రజా రవాణా సంస్థలో ఫైనాన్స్, పర్సనల్, మెటీరియల్ విభాగాల్లో డిప్యూటీ సూపరింటెండెంట్ పోస్టులను నిబంధనల ప్రకారం భర్తీ చేస్తున్నారని, అయితే అర్హులైన సీనియర్ అసిస్టెంట్, ఫైనాన్స్, పర్సనల్, మెటీరియల్ విభాగాల్లో ఖాళీ లేనప్పుడు మాత్రమే డైరెక్టు రిక్రూట్‌మెంట్ ద్వారా భర్తీ చేయాలని పీటీడీ నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ అధ్యక్షుడు పి.రమణారెడ్డి, జనరల్ సెక్రటరీ వై.శ్రీనివాసరావు సంస్థ కమిషనర్‌కు లేఖ రాశారు. డైరెక్టు రిక్రూట్‌మెంట్‌కు అనుమతి ఇవ్వడం వల్ల పదోన్నతులు పొందవలసి ఉన్న సీనియర్ అసిస్టెంట్లు తీవ్రంగా నష్టపోతున్నారని పేర్కొన్నారు. ఖాళీలను పదోన్నతుల ద్వారా మాత్రమే భర్తీచేసి ఆయా విభాగాల్లో సూపర్‌వైజర్లు ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు.